


# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

13.09.2026

ఆదివారం | అనంతపురం

సంపుటి : 11 | సంచిక: 123

పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## నాయకత్వం వహించడానికి భారత్ సిద్ధం

- 'గ్లోబల్ సౌత్' నిర్ణయాలు
- తీసుకునే స్థాయికి ఎదగాలి
- బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ
- 'రూల్ టేకర్' కాదు, 'రూల్ షేపర్'గా మారాలి
- బ్రిక్స్ వేదికపై మోదీ పిలుపు





న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12, అనంతజనశక్తి న్యూస్

రెండు రోజుల పాటు జరిగే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు 2026ను భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లతో సహా ప్రపంచ దేశాల నాయకులకు ఆయన ఘన స్వాగతం పలికారు. ప్రారంభోపన్యాసం చేసిన ఆయన నాయకులను ఉద్దేశించి ప్రసంగించారు. 'భారతదేశం బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను ప్రజలే కేంద్రంగా, మానవత్వమే ప్రథమ ప్రాధాన్యంగా నిర్వహించింది' అని తెలిపారు. ఇందులో భాగంగా స్థిరత్వం, వినూత్నత, సహకారం, సుస్థిరతలను ముఖ్యమైన ప్రాధాన్యతలుగా ఎంచుకున్నట్లు వెల్లడించారు.

2లో..

## ఒకరి నుంచి మరొకరం నేర్చుకోవచ్చు

ప్రధాని నరేంద్ర మోదీతో భేటీలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్

ఏడు సంవత్సరాల తర్వాత భారత్‌లో పర్యటన

బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని మోదీతో ద్వైపాక్షిక భేటీ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12, అనంతజనశక్తి న్యూస్

2020 గల్వాన్ ఘర్షణల తర్వాత చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ బ్రిక్స్ సమావేశాల్లో పాల్గొనేందుకు భారత్ వచ్చారు. ప్రధాని నరేంద్రమోడీతో, జిన్‌పింగ్ శనివారం భేటీ అయ్యారు. భారత్, చైనాలు తమ పరస్పర బలాల నుంచి నేర్చుకుని, ఒకరికొకరు సహకరించుకుంటూ అభివృద్ధి సాధించగలవని అన్నారు. బ్రిక్స్ సదస్సు సందర్భంగా మోడీతో చైనా అధ్యక్షుడు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చైనాభారత్ ద్వైపాక్షిక సంబంధాలు, సరిహద్దు సమస్య, వాణిజ్యం, పెట్టుబడులు వంటి కీలక అంశాలపై రెండు దేశాలు చర్చించినట్లు తెలుస్తోంది.

2లో..

## ఆరోగ్య, టెక్నాలజీ రంగాల్లో దూసుకెళ్తాం

- 2047 నాటికి భారత్, ఏపీ నంబర్ వన్
- సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి
- ఆరోగ్యవంతమైన ఏపీ కోసం ఎన్డీఏ సర్కార్ పనిచేస్తుంది
- అందరూ దేశభక్తితో పనిచేయాలి
- భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతున్నది
- మోదీ నేతృత్వంలోనే ఇది సాధ్యం
- ప్రజల సహకారం కలిస్తే మరింత వేగంగా అభివృద్ధి
- అమరావతి టెక్నాలజీ హబ్‌గా..



అమరావతి, సెప్టెంబర్ 12, అనంత జనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు.. బెజవాడలోని ఓల్డ్ గవర్నమెంట్ హాస్పిటల్‌లో క్రిటికల్ కేర్ బ్లాక్, ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ను కేంద్ర మంత్రి జేపీ నడ్డా, ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో కలిసి ప్రారంభించిన ఆయన.. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. 2047 నాటికి దేశం, రాష్ట్రం నంబర్ వన్‌గా నిలిచేలా అందరూ దేశభక్తితో పనిచేయాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రధాని మోడీ నేతృత్వంలో భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని అన్నారు. కేంద్ర సహకారం, రాష్ట్ర భాగస్వామ్యం, ప్రజల సహకారం కలిస్తే ఆంధ్రప్రదేశ్ మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.




### ఆరోగ్య రంగంలో కీలక మార్పులు

రాష్ట్రంలో మొత్తం 10 క్రిటికల్ కేర్ బ్లాక్‌లను ప్రారంభించామని చంద్రబాబు తెలిపారు. వీటి ద్వారా వైద్య ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని అన్నారు. సంజీవని ప్రాజెక్ట్ దేశానికి గేమ్‌చేంజర్‌గా మారుతుందని పేర్కొన్నారు. వచ్చే జనవరి 1 నుంచి రాష్ట్రంలోని అన్ని మెడికల్ రికార్డులను డిజిటలైజేషన్ చేస్తామని వెల్లడించారు. ప్రపంచానికి వ్యాక్సిన్ అందించి ప్రజల ప్రాణాలను కాపాడిన ఘనత భారత్‌కు దక్కిందని చంద్రబాబు అన్నారు. దేశవ్యాప్తంగా 1.8 లక్షల ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల ద్వారా గ్రామస్థాయిలో వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. 780 మెడికల్ కాలేజీలకు సంఖ్యను పెంచి, వైద్య విద్య సీట్లను రెట్టింపు చేశారని చెప్పారు. మంగళగిరి ఎయిమ్స్ దేశంలోనే నంబర్ వన్‌గా తయారైందని పేర్కొన్నారు.

2లో..

## ప్రజలను అప్రమత్తం చేయండి

- ఏపీలో భారీ వర్షాలు, వరదలపై..
- అధికారులకు పవన్ దిశానిర్దేశం
- వాగులు పొంగుతున్న వేళ
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలి

2లో..



అమరావతి, సెప్టెంబర్ 12, అనంతజనశక్తి న్యూస్

రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ .. సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ సూచనలు చేశారు.

## చిన్మయ్ కృష్ణదాస్ కన్నీరు



2లో..

## ఇది కదా మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ అంటే

- జగన్ హయాంలో మార్కెట్ ఇంటర్వెన్షన్ ఎక్కడ? రైతులకు చేసిన సాయం ఎంత?
- బడ్జెట్‌లో కేటాయింపులు చూపించి.. రైతులకు మాత్రం నిధులు ఇవ్వని జగన్ సర్కార్
- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి

2లో..



## ఏపీ ఆరోగ్య రంగానికి రూ.64,100 కోట్లు

- ఏపీ ఆరోగ్య రంగానికి రూ.64,100 కోట్లు
- ఏపీ ఆరోగ్య రంగానికి రూ.64,100 కోట్లు
- విజయవాడలో జేపీ నడ్డా

2లో..



## ఆదిలాబాద్ విమానాశ్రయం వేగంగా అడుగులు పడ్తున్నాయి

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి
- రాజ్‌నాథ్, రామ్మోహన్‌తో సమావేశం అయ్యాను
- వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకం

2లో..



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12, అనంతజనశక్తి న్యూస్

వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఆదిలాబాద్ ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటుకు అడుగులు వేగంగా పడుతున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఈ అంశంపై శనివారం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో సమావేశమైనట్లు తెలిపారు. ఈ భేటీలో ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పురోగతిపై సమీక్షించినట్లు కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## ఎక్కడా నిర్లక్ష్యం ఉండొద్దు

- గణేశ్ ఉత్సవాలు.. శాంతిభద్రతల పరిరక్షణ
- హోంమంత్రి అనిత

2లో..



## బీసీల ఆత్మగౌరవం పెంచేలా చంద్రబాబు పాలన

- సంక్షేమ శాఖ మంత్రి సవిత
- ఆత్మగౌరవం పెంచేలా రక్షణ చట్టానికి మెరుగులు
- స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతాం

2లో..



## చట్టసభలపై నమ్మకం లేదా..?

- కేసీఆర్‌పై మంత్రి సీతక్క ఫైర్
- మాక్ అసెంబ్లీకి కూడా రాలేదంటే ఏం అనుకోవాలి



2లో..

# నాయకత్వం వహించడానికి భారత్ సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

అంతేకాదు, 'గ్లోబల్ సౌత్ నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదగాలని, భారత్ నాయకత్వం వహించడానికి సిద్ధంగా ఉందని మోదీ ఉద్ఘాటించారు. ''మనం బ్రిక్స్ 20వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ, ఈ ఏడాది బ్రిక్స్ సమ్మిట్ ఒక చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరిస్తోంది. మానవ జీవితంలో 20 ఏళ్ల వయస్సు అనేది పరిణతి, బాధ్యతలతో కూడిన ఒక కొత్త దశకు నాంది పలుకుతుంది. కలలకు బాధ్యతలు తోడై, సామర్థ్యాలకు కొత్త దిశ లభించే సమయం ఇది'' అన్నారు. ''భారతదేశ బ్రిక్స్ అధ్యక్షత ప్రజల ప్రయోజనాలు, మానవత్వానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చే విధానంపై ఆధారపడి ఉంది. స్థిరత్వం, వినూత్నత, సహకారం, సుస్థిరతలే మా ప్రాధాన్యతలు. వీటి ఆధారంగానే బ్రిక్స్ అధ్యక్షతను సాధారణ ప్రజలతో అనుసంధానించేందుకు మేము ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చాం. ఈ ఆలోచనతోనే 350కి పైగా సమావేశాలను నిర్వహించాం, అలాగే దాదాపు 30 నగరాల్లో మీ ప్రతి నిధి బృందాలకు స్వాగతం పలికే అవకాశం మాకు లభించింది'' అని తెలిపారు. ''ఈ రోజు బ్రిక్స్ కూడా తన పరిణతి చెందిన (కమింగ్‌ఆఫ్‌ఏజ్) స్థితికి చేరుకుంది. గడిచిన 20 ఏళ్లలో ప్రపంచ వేదికపై బ్రిక్స్ తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును ఏర్పరచుకుంది. మనం పరస్పరం ఒకరి దృక్పథాలను మరొకరం గౌరవించుకుంటూ, ఏకాభిప్రాయంతో ముందుకు సాగుతున్నాం. మనం ఎవరికీ వ్యతిరేకం కాదు; అందరినీ కలుపుకుని ముందుకు సాగడమే మన నైజం.'' అని వివరించారు.

# ఒకరి నుంచి మరొకరం నేర్చుకోవచ్చు

(మొదటి పేజీ తరువాయి)

బ్రిక్స్ సదస్సులో చైనా అధ్యక్షుడు చేసిన సానుకూల వ్యాఖ్యల్ని ప్రధాని మోదీ స్వాగతించారు. భారత్ బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో చైనా అందించిన సహకారానికి మోదీ థాంక్స్ చెప్పారు. ద్వైపాక్షిక సహ కారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఈ సమావేశం అవకాశం కల్పించిందని అన్నారు. తన పుట్టిన రోజైన జూన్ 15న భారత పర్యటనకు తనకు ఆహ్వానం వచ్చిందని జిన్‌పింగ్ తెలిపారు. గతంలో మోదీతో 21 సార్లు భేటీ అయినట్లు ఆయన గుర్తు చేసుకున్నారు. ఈ సమావేశాల్లో కుదిరిన పలు ముఖ్యమైన అవగాహనలు భారత్‌చైనా సంబంధాలను స్థిరమైన అభివృద్ధిలోకి తీసుకెళ్తాయని అన్నారు.

ఒకరి నుంచి మరొకరం నేర్చుకోవచ్చు..

భారత్, చైనాలు ఒకరి బలాల నుంచి మరొకరు నేర్చుకోవడం, పూర్తిగా అర్థం చేసుకోవడం ద్వారా రెండు దేశాలు ఉమ్మడి విజయాన్ని, అభివృద్ధిని సాధించవచ్చని జిన్‌పింగ్ అన్నారు. చైనా ఎప్పుడూ భారత్‌తో సంబంధాలను వ్యూహాత్మక, దీర్ఘకాలిక దృష్టితో చూస్తాయని చెప్పారు. ప్రపంచంలో చోటుచేసుకున్న పరిణామాలు గత శతాబ్ధకాలంలో ఎప్పుడూ చూడలేదని, ఈ సవాళ్ల మధ్య ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన రెండు దేశాలుగా, గ్లోబల్ సౌత్‌లో కీలక దేశాలుగా ఉన్న భారత్, చైనాలకు ప్రత్యేక బాధ్యతలు ఉన్నాయని అన్నారు. మానవాళి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ రెండు దేశాలు కలిసి పనిచేయాలని జిన్‌పింగ్ సూచించారు.

# ప్రజలను అప్రమత్తం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

ఏఎస్ఆర్ జిల్లాలో భారీ వర్షాలు, వరదలపై ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. వాగులు పొంగుతున్న వేళ ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలని పేర్కొన్నారు.

అవసరం ఉన్న చోట తక్షణం పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయాలని పవన్ కల్యాణ్ అప్రమత్తం చేశారు. గంగవరం సమీపంలో ఆంధ్రప్రదేశ్ ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన వరద ప్రవాహానికి కొట్టుకుపోయిందని చెప్పుకొచ్చారు. సుమారు 15 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వర్షాలు తగ్గే వరకు ప్రజలు అత్యవసర పరిస్థితులు మినహా బయటకు రావద్దని విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంతో పాటు, ప్రమాదకర ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. అవసరం ఉన్న చోట తక్షణమే పునరావాస శిబిరాలను ఏర్పాటు చేసి బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని అలర్ట్ చేశారు. గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

# చట్టసభలపై నమ్మకం లేదా.?

**హైదరాబాద్, సెప్టెంబర్ 12, అనంతనశక్తి న్యూస్**

బీఆర్ఎస్‌పై తెలంగాణ మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నిర్వహించింది మాక్ అసెంబ్లీ కాదని.. డెమోక్రసీని గులాబీ పార్టీ ఖూనీ చేసిందని ధ్వజమెత్తారు. శనివారం అసెంబ్లీ లాబీలో మీడియాతో మంత్రి సీతక్క చిట్ చాట్ చేశారు. ఎర్రవల్లిలో బీఆర్ఎస్ఎల్పీ మీటింగ్ నిర్వహించి, ఆ పార్టీ ఆఫీస్‌లో మాక్ అసెంబ్లీని ఎందుకు నిర్వహించారని ప్రశ్నించారు. ఫాంహౌస్ ముందు దళిత సంఘాలు నిరసన తెలిపితే గులాబీ పార్టీ నేతలు పసుపు నీళ్లతో శుద్ధి చేశారని ఆగ్రహించారు.

బీఆర్ఎస్‌ది ఆధిపత్య దురంహంకారం..

ఇంకా ఆ మైలపోలేదనే ఆధిపత్య దురంహంకారంతో ఆ పార్టీ నేతలు ఫాంహౌస్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించలేదా? అని మంత్రి సీతక్క ఎద్దేవా చేశారు. అసెంబ్లీకి ఎలాగూ రాని కేసీఆర్... మాక్ అసెంబ్లీకి కూడా రాలేదంటే ఆయనకు చట్టసభలపై ,సొంత పార్టీ కార్యక్రమంపై ఎంత గౌరవం ఉందో అర్థం చేసుకోవచ్చని విమర్శించారు. అధికారంలో ఉంటే సచివాలయానికి రారని.. ప్రతిపక్షంలో ఉంటే అసెంబ్లీకి కూడా రారా అని నిలదీశారు. ఫాంహౌస్‌ని సచివాలయంగా.. పార్టీ కార్యాలయాన్ని అసెంబ్లీగా భావించే పార్టీ బీఆర్ఎస్ తప్ప దేశంలో మరొకటి లేదని ఎద్దేవా చేశారు.

స్పీకర్‌ను, చట్టసభలను అవమానిస్తున్నారు..

ఫాంహౌస్‌లో బీఆర్ఎస్ఎల్పీ మీటింగ్, పార్టీ ఆఫీస్‌లో అసెంబ్లీ మీటింగ్ పెట్టడమంటే వారు ఉన్న దగ్గరకే అన్ని రావాలనుకోవడం దొరల అహంకారానికి నిదర్శనమని మంత్రి మండిపడ్డారు. చింత చచ్చినా పులుపు చావలేదన్నట్లుగా అధికారం పోయినా.. దొర అహంకారం ఇంకా పోలేదని ఎద్దేవా చేశారు. స్పీకర్‌ను, చట్ట సభలను అవమానిస్తున్న బీఆర్ఎస్‌ను ప్రజలు శిక్షించడం ఖాయమని మంత్రి సీతక్క హెచ్చరించారు.

# చిన్మోయ్ కృష్ణదాస్ కన్నీరు

**- తల్లి అంత్యక్రియల సమయంలో..**
**- బంగ్లాదేశ్‌లో కస్టడీలో ఉన్న చిన్మయ్**
**- కృష్ణదాస్‌పై సువేందు అధికారి వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12, అనంత జనశక్తి న్యూస్**

బంగ్లాదేశ్ కస్టడీలో ఉన్న హిందూ సన్యాసి చిన్మోయ్ కృష్ణదాస్ అంశాన్ని పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారి ప్రస్తావించారు. చిన్మోయ్ తన తల్లి అంత్యక్రియలకు హాజరైన సమయంలో కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ వీడియో దేశవ్యాప్తంగా వైరల్‌గా మారింది. బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులు పడుతున్న కష్టాలను ఈ కన్నీళ్లు చెబుతున్నాయి. బంగ్లాదేశ్ ప్రభుత్వం కేవలం 5 గంటల పెరోల్ ఇచ్చి, తల్లి అంత్యక్రియలకు హాజరయ్యేందుకు అనుమతించింది. ఇదిలా ఉంటే, ఈ అంశంపై సువేందు అధికారి మట్లాడుతూ.. తన తల్లి అంత్యక్రియలకు హాజరైన సమయంలో చిన్మోయ్ కృష్ణదాస్ పెట్టుకున్న కన్నీళ్లు ప్రపంచవ్యాప్తంగా సనాతనవాదుల్ని కదిలించాని అన్నారు. బెంగాల్ విభజన, హిందువుల భద్రతకు సంబంధించిన చారిత్రక అంశాలను అధికారి ప్రస్తావించారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ, స్వామి ప్రణవానంద వంటి నేతల పోరాటం వల్ల బెంగాల్‌లో కొంత భాగం భారత్‌లో విలీనం అయిందని అన్నారు. ఒక వేళ విలీనం కాకపోయి ఉంటే, ఈ రోజు మన పరిస్థితి కూడా చిన్మోయ్ కృష్ణదాస్ పరిస్థితి లాగే ఉండేదని అన్నారు.

# ఆదిలాబాద్ విమానాశ్రయం వేగంగా అడుగులు పడ్తున్నాయి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టు అమలును వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. దీనికి సంబంధించిన కార్యాచరణను మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వం నుంచి ఒక్కో నోడల్ అధికారిని వచ్చే వారంలోగా నియమించాలని నిర్ణయించినట్లు తెలిపారు. జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్ట్‌కు డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పనను వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఉత్తర తెలంగాణ కనెక్టివిటీకి సంబంధించి విమానాశ్రయం, ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ఏర్పాటు అవసరాన్ని కేంద్ర మంత్రులకు వివరించినట్లు తెలిపారు. రీజినల్ కనెక్టివిటీని మెరుగుపరచాల్సిన అంశాన్నీ వారి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ మేరకు ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ ను అభివృద్ధి చేసేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ సిద్ధంగా ఉందని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారన్నారు. అలాగే ఇందుకు అవసరమైన సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని ఆయన హామీ ఇచ్చారని కిషన్ రెడ్డి తెలిపారు. మరోవైపు, ఈ విమానాశ్రయం కోసం ఏళ్లుగా చేస్తున్న ప్రయత్నాలు.. వరుస సమావేశాలు, లేఖలు, నిరంతర సమన్వయం నేడు తుది దశకు చేరుకోవడం సంతోషంగా ఉందని ఆయన చెప్పుకొచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష సాకారమయ్యే దిశగా కీలక ముందడుగు పడిందని కేంద్ర మంత్రి హర్షం వ్యక్తం చేశారు. కాగా, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు సంబంధించి రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, తెలంగాణ అధికారుల మధ్య ఇప్పటికే పలు సమావేశాలు జరిగాయని కిషన్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా రక్షణ, పౌర విమానయాన అధికారులు 17 ఏప్రిల్ 2026న విమానాశ్రయ స్థలాన్ని పరిశీలించారన్నారు. ఈ సందర్భంగా 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణం అవసరమని వారు నిర్ణయించారని తెలిపారు. దీంతోపాటుగా ఐఏఎఫ్ వద్ద ఉన్న 369.45 ఎకరాల భూమికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించిందని చెప్పారు. ఈ భూమిలో ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, విజిటింగ్ ఎయిర్‌క్రాఫ్ట్ పార్కింగ్, వెదర్ షెల్టర్లు, ఎయిర్‌క్రాఫ్ట్ హ్యాంగర్లు, ఆపరేషనల్ కాంప్లెక్స్, ట్రైనింగ్ ఫెసిలిటీస్, మెయింటెనెన్స్ ఇన్‌ఫ్రా ఫెసిలిటీస్ ఏర్పాటు చేస్తామన్నారు.

అలాగే పౌర సేవలకు సంబంధించి సివిల్ టెర్మినల్‌తో పాటు నిర్వహణ, మరమ్మతు కార్యకలాపాల కేంద్రాన్ని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేస్తుందన్నారు. వీటితో పాటు అక్కడ పనిచేసే ఎయిర్‌ఫోర్స్ సిబ్బందికి అవసరమైన నివాస, ఇతర మౌలిక సదుపాయాలను కూడా ఏర్పాటు చేస్తారని కిషన్ రెడ్డి చెప్పారు.

# ఏపీ ఆరోగ్య రంగానికి రూ.64,100 కోట్లు

**అమరావతి, సెప్టెంబర్ 12, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ పర్యటనలో ఉన్న కేంద్ర మంత్రి జేపీ నడ్డా.. ఏపీ ఆరోగ్య రంగానికి కేటాయింపులపై కీలక ప్రకటన చేశారు.. విజయవాడలోని ఓల్డ్ గవర్నమెంట్ హాస్పిటల్‌లో క్రిటికల్ కేర్ బ్లాక్, ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ను సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో కలిసి ప్రారంభించిన జేపీ నడ్డా.. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేస్తూ దేశవ్యాప్తంగా ఆరోగ్య సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. కోవిడ్ సమయంలో ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య రంగాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.64,100 కోట్లు ఖర్చు చేస్తున్నామని జేపీ నడ్డా వెల్లడించారు. రాష్ట్రానికి 24 క్రిటికల్ కేర్ బ్లాకులు, 26 ల్యాబొరేటరీలు మంజూరు చేశామని తెలిపారు. ఇప్పటికే 500 క్రిటికల్ కేర్ బెడ్లు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో ఆయుష్మాన్ ఆరోగ్య సేవా మందిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

**కాంప్రహెన్సివ్ హెల్త్ కేర్‌పై దృష్టి**

2017లో కొత్త హెల్త్ పాలసీని తీసుకొచ్చామని నడ్డా తెలిపారు. కేవలం వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స అందించే క్యూరేటివ్ హెల్త్ కేర్ విధానం నుంచి కాంప్రహెన్సివ్ హెల్త్ కేర్ వైపు భారత్ ముందుకు సాగుతోందన్నారు. గతంలో సూపర్ స్పెషాలిటీ వైద్యంపై ఎక్కువగా ఆధారపడేవాళ్లమని, ఇప్పుడు నివారణ, ముందస్తు గుర్తింపు, సమగ్ర ఆరోగ్య సేవలకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. వంటగది కూడా ఒక ఫార్మసీలా పనిచేస్తుందని, ఆహారమే ఔషధంగా ఉండేలా ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇక, దేశవ్యాప్తంగా 1.86 లక్షల ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు 140 కోట్ల మంది ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలకు తొలి ఆధారంగా నిలుస్తున్నాయని నడ్డా తెలిపారు. ఏపీలో ఇంద్రధనుష్ వ్యాక్సినేషన్ కార్యక్రమం విజయవంతంగా అమలు చేశారని ప్రశంసించారు. హైపర్‌టెన్షన్ కోసం 42 కోట్ల మందికి స్క్రీనింగ్, 36 కోట్ల మందికి నోటి క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించినట్లు వెల్లడించారు.

**టీబీ నియంత్రణలో భారత్ పురోగతి**

భారతదేశంలో ట్యూబర్‌క్యులోసిస్ కేసులు 21 శాతం తగ్గాయని నడ్డా తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా టిబీ తగ్గుదల 11 శాతంగా ఉంటే, భారత్‌లో మరింత మెరుగైన ఫలితాలు సాధించామని చెప్పారు. ఆరోగ్య సేవలను ప్రతి కుటుంబానికి చేరువ చేయడమే ప్రభు

# బీసీల ఆత్మగౌరవం పెంచేలా చంద్రబాబు పాలన

**విజయవాడ సెప్టెంబర్ 12, అనంత జనశక్తి ప్రతినిధి**



బీసీల ఆత్మగౌరవం పెంచేలా సీఎం చంద్రబాబు నాయుడు పాలిస్తున్నారని, ప్రజల్లోని కూటమి నాయకులు, కార్యకర్తలు గర్వంతో తలెత్తుకుని వెళుతున్నారని, రాబోయే స్థానిక ఎన్నికల్లో తమదే విజయమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ధీమా వ్యక్తంచేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి తీరుతామని స్పష్టంచేశారు. జగన్ లో మరో ఓటమి భయం కనిపిస్తోందన్నారు. కోర్టుల్లో నిలబడేలా బీసీ రక్షణ చట్టాన్ని రూపొందిస్తున్నామన్నారు. విజయవాడలోని గొల్లపూడి బీసీ భవన్ లో వివిధ బీసీ కార్పొరేషన్ చైర్మన్లతో శనివారం బీసీ రక్షణ చట్టంపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బీసీలంటేనే టీడీపీ అని స్పష్టంచేశారు. బీసీల ఆత్మగౌరవం పెంచేలా సీఎం చంద్రబాబునాయుడు పాలిస్తున్నారన్నారు. గత ఎన్నికల ముందు మంత్రి నారా లోకేష్ నిర్వహించిన పాదయాత్రలో బీసీ రక్షణ చట్టం అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, బీసీ రక్షణ చట్టం అమలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కోర్టుల్లో బలంగా నిలబడేలా ఈ చట్టానికి తుదిమెరుగులు దిద్దుతున్నామన్నారు. దీనిలో భాగంగా మంత్రివర్గ ఉప సంఘంతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో సమావేశాలు నిర్వహించామన్నారు. బీసీలను కులం, వృత్తుల పేరుతో దూషించినా, సంఘ బహిష్కరణలు చేసినా చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామన్నారు. జిల్లాల్లో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేస్తామని, రెండు నెలల్లో కేసుల దర్యాప్తు పూర్తి చేసేలా నిబంధనలు రూపొందించామని తెలిపారు. బీసీ రక్షణ చట్టాన్ని కోర్టుల్లో నిలబడేలా రూపొందిస్తున్నామన్నారు. ఇప్పుడు 156 బీసీ కులాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కార్పొరేషన్ల చైర్మన్ల నుంచి అభిప్రాయాలు తీసుకున్నామని తెలిపారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా ఏపీలోనే బీసీ రక్షణ చట్టం అమలుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సవిత తెలిపారు.

బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసి తీరుతాం...

స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామని మంత్రి సవిత స్పష్టం చేశారు. 19987 అన్న ఎన్టీఆర్ తొలిసారిగా బీసీలకు రిజర్వేషన్లకు అమలు చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు బీసీలకు 34 శాతానికి రిజర్వేషన్లు పెంచారన్నారు. 2019 తరవాత అధికారంలోకి వచ్చిన జగన్ ...బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి కుదించారన్నారు. గొడ్డలి పార్టీ చర్యతో బీసీలకు రాజకీయంగా తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. మరోసారి 34 శాతం రిజర్వేషన్ల కల్పనకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి సవిత తెలిపారు.

ధైర్యంగా ప్రజల్లోకి వెళుతున్నాం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన 26 నెలల్లో ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 90 శాతం అమలు చేశామని మంత్రి సవిత తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాల్లో అత్యధికంగా బీసీలే లబ్ధిపొందుతున్నారన్నారు. ఒకవైపు సంక్షేమ పథకాలు, మరో వైపు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం చంద్రబాబునాయుడు చేపడుతున్నారన్నారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా రహదారుల నిర్మాణం చేపట్టామన్నారు. అన్ని ప్రాంతాల్లో పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. ప్రజల్లోకి ధైర్యంగా కూటమి నాయకులు, కార్యకర్తలు వెళ్లేలా సీఎం చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారని కొనియాడారు.

త్వరలో ఆదరణ 3.0ను అమలు చేస్తామని మంత్రి సవిత తెలిపారు.

జగన్ కు ఓటమి భయం

సీఎం చంద్రబాబునాయుడు పాలనపై ప్రజల్లో సానుకూలత వ్యక్తమవుతోందని మంత్రి సవిత తెలిపారు. రాబోయేk స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానిదే విజయమని ధీమా వ్యక్తంచేశారు. జగన్ లో మరో ఓటమి భయం కనిపిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీసీ కార్పొరేషన్ల చైర్మన్లకు మంత్రి సవిత దిశానిర్దేశం చేశారు. బీసీ రక్షణ చట్టంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలుకు కృషి చేస్తున్న సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు, మంత్రి నారా లోకేష్ కు, మంత్రి సవితకు వివిధ కార్పొరేషన్ చైర్మన్లు ధన్యవాదాలు తెలిపారు. మంత్రి సవితకు ఘనంగా సత్కరించారు. అంతకు ముందు మంత్రి సవిత... అన్న ఎన్టీఆర్, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, పలు బీసీ సంక్షేమ శాఖ కార్పొరేషన్ చైర్మన్లు వీరంకి వెంకట్ గురుమూర్తి, నందం అబద్ధయ్య, పేరేపి ఈశ్వరరావు, నర్సింహాయాదవ్, మల్లెల ఈశ్వర్, దేవేంద్రప్ప, చిలకలపూడి పాపారావు, కొల్లు పెద్ది రాజు, సీఆర్ రాజన్, రుద్రకోటి సదాశివ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇది కదా మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ అంటే

**అమరావతి, సెప్టెంబర్ 12:అనంత జనశక్తి ప్రతినిధి**

రైతు పండించిన పంటకు మార్కెట్‌లో కనీస మద్దతు ధర కంటే తక్కువ ధర లభించి నష్టపోయే పరిస్థితి ఏర్పడినప్పుడు, రైతుకు అండగా నిలిచి ధరకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం మార్కెట్‌లో జోక్యం చేసుకోవడమే మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు మార్కెట్ ఇంటర్వెన్షన్ పేరుతో పెద్దగా ప్రయోజనం కల్పించకపోయినా, భారీగా నిధులు ఖర్చు చేసినట్లు ప్రచారం చేసుకున్నారని మంత్రి విమర్శించారు. బడ్జెట్‌లో కేటాయింపులు చూపించడం, వాస్తవంగా రైతులకు నిధులు అందించడం మధ్య భారీ వ్యత్యాసం ఉందని ఎద్దేవా చేశారు. రైతుల పంటలకు ధరలు పడిపోయినప్పుడు జగన్ ప్రభుత్వం ఎక్కడ ఉంది? రైతులకు ఎంత సాయం చేసింది? అని మంత్రి ప్రశ్నించారు.2025-26 ఆర్థిక సంవత్సరానికి మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద ప్రభుత్వం రైతును ఆదుకునేందుకు చిత్తశుద్ధితో పనిచేసిందని మంత్రి తెలిపారు. వివిధ పంటలకు మద్దతు ధరల కోసం సుమారు రూ.800 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. అందులో భాగంగా పొగాకు - రూ.271 కోట్లు, మామిడి - రూ.261 కోట్లు, ఉల్లి - రూ.125 కోట్లు, కోకో - రూ.14 కోట్లు, టమాటా - రూ.12 కోట్లు ఖర్చు చేసామని తెలిపారు. ఈ ఏడాది కూడా తోతాపూరి మామిడి, పొగాకు రైతులకు అండగా నిలిచామని వెల్లడించారు. మార్కెట్‌లో తోతాపురి మామిడి ధరలు పడిపోవడంతో రైతులకు అండగా నిలిచిన కూటమి ప్రభుత్వం కిలోకు రూ.4 చొప్పున ధర లోటు భర్తీ చేసిందని మంత్రి తెలిపారు. చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి, కడప జిల్లాల్లోని రైతులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం కల్పించామని చెప్పారు. మొత్తం 7.03 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి ఉత్పత్తికి కిలోకు రూ.4 చొప్పున ధర లోటు చెల్లింపు చేసినట్లు మంత్రి వివరించారు. ఆఫ్‌స్టైల్, లోగ్రేడ్ పొగాకు రకాలను సాగు చేస్తున్న రైతులను ఆదుకునేందుకు కిలోకు రూ.10 చొప్పున ప్రోత్సాహకం అందించామని మంత్రి తెలిపారు. మద్దతు ధర లేక ఇబ్బందులు పడుతున్న వేలాది మంది పొగాకు రైతులకు ఈ నిర్ణయం గణనీయమైన ఆర్థిక ప్రయోజనం కల్పిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

వైసీపీ హయాంలో రైతులను గాలికొదిలేశారు

రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. రైతుల పేరుతో ప్రచారం చేసుకోవడం తప్ప, పంటలకు ధరలు పడిపోయినప్పుడు వారికి అండగా నిలిచిన దాఖలాలు ఆ ప్రభుత్వానికి లేవు అని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా విమర్శించారు. 2020లో మార్కెట్ ధర సుమారు రూ.12,000గా ఉన్నప్పటికీ కేవలం రూ.7,000 మద్దతు ధర ప్రకటించి, దానిని అమలు చేయడానికి అవసరమైన నిధులను కూడా మంజూరు చేయలేదని ఆరోపించారు. రైతులకు నిజంగా ఎంత సాయం చేశారో చెప్పకుండా, కాగితాలపై భారీ మొత్తాలు చూపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వ 5 ఏళ్ల కాలంలో మార్కెట్ ఇంటర్వెన్షన్‌కు రూ.2,140 కోట్లు బడ్జెట్ కేటాయించినట్లు చూపించి, వాస్తవంగా కేవలం రూ.1,475 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని మంత్రి తెలిపారు. అయితే రూ.7,700 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రచారం చేసుకోవడం వైసీపీ ప్రభుత్వ అసమర్థతకు, రైతుల పట్ల దాని నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. కూటమి ప్రభుత్వం 2025 2026 ఏడాదిలోనే 800 కోట్లకు పైగా రైతులకు ఖర్చు చేసామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రైతులను మాటలతో మోసం చేస్తే.. కూటమి ప్రభుత్వం చేతల్లో అండగా నిలుస్తోంది. వైసీపీ హయాంలో కాగితాలపై కేటాయింపులు, ప్రచారంలో వేల కోట్లు.. కూటమి ప్రభుత్వంలో రైతుల ఖాతాల్లోకి వాస్తవంగా సాయం. ఇదే రెండు ప్రభుత్వాల మధ్య ఉన్న తేడా అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. పంట ధరలు పడిపోయిన ప్రతిసారీ రైతు మార్కెట్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి లేకుండా మార్కెట్ ఇంటర్వెన్షన్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని మంత్రి తెలిపారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం, అవసరమైన సమయంలో ప్రభుత్వమే మార్కెట్‌లో జోక్యం చేసుకుని రైతును ఆదుకోవడం కూటమి ప్రభుత్వ విధానమని చెప్పారు. రైతు కష్టపడి పండించిన పంటకు ధర రాకుండా పోతే కూటమి ప్రభుత్వం చూస్తూ చేతులు ముడుచుకుని కూర్చోదు. రైతు నష్టపోకుండా అవసరమైన ప్రతి సందర్భంలో మార్కెట్‌లో జోక్యం చేసుకుంటాం. నిధులు అవసరమైతే మరిన్ని నిధులు సమకూరుస్తాం. రైతు సంక్షేమమే మా ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యత అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# ఆరోగ్య, టెక్నాలజీ రంగాల్లో దూసుకెళ్తాం

(మొదటి పేజీ తరువాయి)

భవిష్యత్తులో అమరావతి గురించి ప్రపంచం మాట్లాడుకునే స్థాయికి తీసుకెళ్తామని సీఎం చంద్రబాబు అన్నారు. డిసెంబర్ 1 నుంచి అమరావతిలో తొలి క్వాంటం కంప్యూటింగ్ వ్యవస్థ పనిచేయనుందని తెలిపారు. అమరావతి క్వాంటం బయో వ్యాలీని కూడా ప్రారంభించబోతున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో డీప్ టెక్నాలజీని అన్ని రంగాల్లోకి తీసుకొస్తామని చెప్పారు. ఫార్మా రంగానికి ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా మారుతుందని, మెడ్‌టెక్ పార్క్ రాష్ట్రంలో ఉందని అన్నారు.

పోలవరం, ఆర్థిక వృద్ధిపై దృష్టి

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ విలువ 11.1 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరిందని చంద్రబాబు తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్ వచ్చే సంవత్సరానికి పూర్తవుతుందని అన్నారు. వచ్చే ఏడాది నుంచి ఎల్‌నినో ప్రభావాన్ని అధిగమించేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

అమరావతి బెస్ట్ సిటీగా..



2035లో జరగబోయే ఒలింపిక్ గేమ్స్‌కు అమరావతి అత్యుత్తమ నగరంగా నిలిచేలా అభివృద్ధి చేస్తామని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో ఆధునిక మౌలిక వసతులతో పాటు డీప్ టెక్నాలజీ, ఆరోగ్యం, ఫార్మా, మెడ్‌టెక్ రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న జేపీ నడ్డా కెమికల్ ఫెర్టిలైజర్స్‌తో పాటు ఆరోగ్య శాఖ బాధ్యతలను కూడా చూస్తున్నారని చంద్రబాబు పేర్కొన్నారు. ఇక, ప్రతి ఒక్కరికీ యోగా, ప్రాణాయామం, ధ్యానం ఎంతో ముఖ్యమని చంద్రబాబు అన్నారు. విద్యార్థులు 'హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్' నిర్మాణానికి సారథులుగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశభక్తితో పనిచేస్తూ రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు..

# ఎక్కడా నిర్లక్ష్యం ఉండొద్దు

**అమరావతి, సెప్టెంబర్ 12, అనంత జనశక్తి న్యూస్**



గణేశ్ ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత .. పోలీసులకు దిశానిర్దేశం చేశారు. ఏపీలోని పలు జిల్లాల ఎస్పీలతో హోం మంత్రి అనిత సచివాలయంలో టెలికాన్ఫరెన్స్ ద్వారా శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ అంశాలపై ఎస్పీలతో సుదీర్ఘంగా హోం మంత్రి చర్చించారు. గణేశ్ ఉత్సవాల నిర్వహణపై అధికారులకు కీలక సూచనలు చేశారు. వినాయక చవితి ఉత్సవాలకు అనుమతుల జారీపై ఎస్పీలతో హోం మంత్రి అనిత మాట్లాడారు. ఈ ఉత్సవాల అనుమతుల కోసం అమలు చేస్తున్న సింగిల్ విండో విధానంపై ఉత్సవ కమిటీలకు, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఏకదంతుడి మండపాలు, ఊరేగింపుల విషయంలో నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలని హోం మంత్రి దిశానిర్దేశం చేశారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని హోం మంత్రి అనిత ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో నిన్న జరిగిన శాంతిభద్రతల సమీక్షపై ఆయా అంశాలపై ఎస్పీలతో చర్చించామని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎక్కడా నిర్లక్ష్యం ఉండకూడదని ఎస్పీలకు.. హోం మంత్రి అనిత స్పష్టం చేశారు.

# మదురై మీనాక్షి ఆలయం సమీపంలో భారీ అగ్నిప్రమాదం..

**- 86 ఏళ్ల పురాతన సెంట్రల్ థియేటర్‌లో మంటలు**




తమిళనాడులోని మదురై మీనాక్షి సుందరేశ్వర ఆలయ పశ్చిమ గోపురం సమీపంలో అగ్నిప్రమాదం జరిగింది. 86 ఏళ్ల పురాతన సెంట్రల్ థియేటర్‌లో భారీగా మంటలు చెలరేగాయి. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ అగ్నిప్రమాదం జరిగిందని అనుమానిస్తున్నారు. వెంటనే రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది మంటల్ని ఆర్పేశారు.. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తమిళనాడులోని మదురై మీనాక్షి సుందరేశ్వర ఆలయం సమీపంలో అగ్నిప్రమాదం జరిగింది. అమ్మవారి ఆలయ పశ్చిమ గోపురం సమీపంలోని ఒక థియేటర్ ఉంది. కొన్ని రోజులుగా మూసి ఉన్న ఆ థియేటర్‌ను పార్కింగ్ సౌకర్యంగా, పిల్లల బొమ్మలను నిల్వ చేసే గోడౌన్‌గా ప్రస్తుతం ఉపయోగిస్తున్నారు. ఈ క్రమంలో సెంట్రల్ థియేటర్‌లో శుక్రవారం సాయంత్రం ఒక్కసారి పొగ కనిపించి, వేగంగా మంటలు చెలరేగాయి. అందరూ చూస్తుండగానే మంటలు వేగంగా భవనాన్ని చుట్టుముట్టాయి. నిమిషాల్లోనే దట్టమైన పొగ చుట్టుపక్కల వీధుల్లోకి వ్యాపించడంతో ఆలయ ప్రాంతంలో భక్తులు, స్థానికులు కంగారుపడ్డారు. సమీపంలోనే మీనాక్షి సుందరేశ్వర ఆలయ కుంభాభిషేకం కోసం యాగశాల కార్యక్రమాలు జరుగుతున్నసమయంలోనే అగ్నిప్రమాదం జరగంతో భక్తులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటల్ని ఆర్పే ప్రయత్నం చేశారు. దట్టమైన పొగ, మంటలు వేగంగా వ్యాపించడంతో అగ్నిమాపక సిబ్బంది అదుపు చేయడానికి తీవ్రంగా శ్రమించారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.. అగ్నిప్రమాదానికి కారణం తెలియరాలేదు. షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగి ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

అగ్నిమాపక సిబ్బంది దాదాపు రెండు గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పివేసినప్పటికీ.. రాత్రి పొద్దుపోయే వరకు సహాయక చర్యలు కొనసాగాయి. కేవలం 60% మంటలను మాత్రమే అదుపులోకి తీసుకురాగలిగారు. ప్రస్తుతం పార్కింగ్ సౌకర్యంగా ఉపయోగిస్తున్న ఆ థియేటర్‌లో ప్లాస్టిక్ సామాగ్రి కూడా నిల్వ ఉందని పోలీసులు తెలిపారు. ఈ అగ్ని ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

018లో మదురై మీనాక్షి అమ్మవారి ఆలయంలో అగ్నిప్రమాదం జరిగింది. వేయికాళ్ల మండపం దగ్గర మంటలు చెలరేగగా.. ప్రమాదంలో 50కి పైగా షాపులు కాలిపోయాయి. వెంటనే స్పందించిన విద్యుత్ సిబ్బంది మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వెంటనే రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది మంటల్ని ఆర్పేశారు. ఆలయంలోని తూర్పు రాజగోపురం దగ్గర ఉన్న పూజాసామాగ్రి షాపులో అగ్నిప్రమాదం జరిగింది. ఆలయం మూసేసిన తర్వాత మంటలు చెలరేగాయి.. క్షణాల్లోనే చుట్టుపక్కలకు వ్యాపించాయి.. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

# ప్రియుడితో పారిపోయిన భార్య.. పట్టుకుని మరీ వారిద్దరికీ గుడిలో పెళ్లి జరిపించిన భర్త!




లక్నోలోని మలిహాబాద్‌లో భార్య ఇష్టానికి విలువనిస్తూ ఆమె ప్రియుడితో స్వయంగా పెళ్లి జరిపించిన పిఆర్‌డి జవాన్ ఉదారత వార్తల్లో నిలిచింది. ఏడాది క్రితం పెళ్లయినా.. పాత ప్రియుడితో హర్దోయీ ప్రాంతానికి పారిపోయిన భార్యను పోలీసులు గుర్తించగా.. ఆమె తన ప్రియుడితోనే ఉంటానని స్పష్టం చేసింది. దాంతో భర్త ఆమెను బలవంతపెట్టకుండా ఇరు కుటుంబాల సమక్షంలో ఆలయంలో వారిద్దరికీ శాస్త్రోక్తంగా వివాహం జరిపించి సాగనంపాడు. ప్రస్తుతం ఈ వార్త నెట్టింట తెగ వైరల్ అవుతోంది.

ఉత్తర ప్రదేశ్‌లోని లక్నో జిల్లాలో అత్యంత అరుదైన, వింతైన సంఘటన వెలుగుచూసింది. తనను కాదని మాజీ ప్రియుడి వద్దకు వెళ్లిన భార్యను.. ట్రాక్ చేసి మరీ కనిపెట్టాడు. ఆపై ఆమె ఉన్న చోటుకు వెళ్లి.. భార్యను బలవంతపెట్టకుండా, ఆమె ఇష్టాన్ని గౌరవిస్తూ స్వయంగా వారిద్దరికీ వివాహం జరిపించి సాగనంపాడో భర్త. లక్నో పరిధిలోని మలిహాబాద్ ప్రాంతంలో చోటుచేసుకున్న ఈ వినూత్న ఘటన ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**అసలేం జరిగిందంటే..?**

మలిహాబాద్ ప్రాంతానికి చెందిన ఒక యువతికి ప్రొవిన్షియల్ రక్షక్ దళ్ (పీఆర్డీ) లో పనిచేస్తున్న జవాన్‌తో సుమారు ఏడాది క్రితం వివాహమైంది. అయితే సదరు యువతికి.. తాను బడిలో చదువుకునే రోజుల నుంచే ఓ యువకుడిపై ప్రేమ ఉండేది. అయితే ఆ అబ్బాయికి కూడా ఈమె ఇష్టం ఉండగా.. ఇద్దరూ ప్రేమించుకున్నారు. ఇద్దరూ కలిసే జీవితాంతం కలిసుండాలని నిర్ణయించుకున్నారు. కానీ కుటుంబ సభ్యుల తీవ్ర ఒత్తిడి, బలవంతం కారణంగా సదరు యువతి ఆ పీఆర్‌డీ జవాన్‌ను పెళ్లి చేసుకోవాల్సి వచ్చింది. వివాహమై భర్త వద్దకు వచ్చినప్పటికీ.. ఆమె తన పాత ప్రియుడితో సంబంధాలను కొనసాగిస్తూనే వచ్చింది.

**మంచిరోజు చూస్కొని మరీ ప్రియుడితో పరార్**

సుమారు నాలుగు రోజుల క్రితం ఆ యువతి భర్త ఇల్లు వదిలి తన మాజీ ప్రియుడితో కలిసి హర్దోయీ ప్రాంతానికి వెళ్లిపోయింది. భార్య కనిపించకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ ఫిర్యాదు నమోదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి, లొకేషన్ ఆధారంగా సదరు యువతి హర్దోయీలో తన ప్రియుడితో ఉన్నట్లు గుర్తించారు. అనంతరం వారిద్దరినీ తీసుకొచ్చి ఇరు కుటుంబాల సమక్షంలో పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో పంచాయితీలో యువతి తెగేసి చెప్పింది. తనకు భర్తతో కలిసి జీవించడం ఇష్టం లేదని, తన పూర్వ ప్రియుడితోనే జీవితాన్ని పంచుకోవాలని ఉందని స్పష్టం చేసింది.

**ఆలయంలో ఘనంగా పెళ్లి.. సాగనంపిన భర్త**

యువతి నిర్ణయాన్ని విన్న పీఆర్‌డీ జవాన్ ఎంతో ఉదారతతో ఆలోచించాడు. ఇష్టం లేని బంధంలో ఆమెను బలవంతంగా ఉంచడం సరికాదని భావించి, ఆమె నిర్ణయానికి ఆమోదం తెలిపారు. ఇరువైపుల కుటుంబ సభ్యుల సమ్మతితో, అవసరమైన పోలీసు లాంఛనాలు పూర్తి చేసిన తర్వాత వారిద్దరి పెళ్లికి అంగీకరించారు. స్థానిక ఆలయంలో హిందూ సాంప్రదాయాల ప్రకారం ఆ యువతికి, ఆమె ప్రియుడికి వివాహం జరిపించారు. ఇద్దరూ పూలమాలలు మార్చుకుని, ఏడడుగులు నడిచారు. ఆ తర్వాత భర్త స్వయంగా తన భార్యను ఆమె కొత్త భర్త (ప్రియుడు)తో కలిసి పంపించివేశాడు. భార్య ఇష్టాన్ని గౌరవించి, ఆమె సంతోషం కోసం పిఆర్‌డి జవాన్ తీసుకున్న ఈ సంచలన నిర్ణయంపై అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

# ఈ బొమ్మల ధరలు రూ.100 నుంచి రూ.8లక్షలు

రైతులకు ఎంతో నమ్మకమైన నేస్తాలైన ఎడ్లను పూజించే పండగ బైల్ పోలా. మహారాష్ట్రలోని తూర్పు విదర్భ ప్రాంతంలో ఈ పోలా మరుసటిరోజు జరుపుకొనే తాన్హా పోలా సంప్రదాయానికి ప్రత్యేక విశిష్టత ఉంది. ముఖ్యంగా పిల్లల్లో పశుసంపదపై ప్రేమ, వ్యవసాయం పట్ల అవగాహనను పెంచేందుకు నిర్వహించే ఈ పండగ ఈ ఏడాదితో 237 ఏళ్లు పూర్తి చేసుకుంటోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని నాగ్‌పూర్‌లోని లాకడ్‌గంజ్ మార్కెటు చెక్కతో చేసిన రంగురంగుల నంది బొమ్మలతో సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. ఈ చెక్క ఎద్దులకు పిల్లల సమక్షంలో పూజలు చేస్తారు. తర్వాత పిల్లలకు ప్రసాదం, డబ్బులు పంచిపెడతారు. డప్పు చప్పుళ్లతో ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ నంది బొమ్మల ధరలు సైజునుబట్టి రూ.వంద నుంచి రూ.8 లక్షల వరకు పలుకుతుండటం విశేషం.



# రష్యాతో భారత్ మైత్రిది చిరకాల చరిత్ర

రష్యాతో భారత్ సత్సంబంధాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సొంత ఘనతగా చాటుకుంటున్నారని కాంగ్రెస్ శుక్రవారం ఆరోపించింది. నిజానికి భారత రష్యాల మధ్య చిరకాలంగా బలమైన సంబంధాలున్నాయని, ఆ సంబంధాల పునాది 1950ల నుంచి 1980వ దశకం వరకూ బలోపేతమైందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భేటీ సందర్భంగా కాంగ్రెస్ నేత ఈ వ్యాఖ్యలు చేశారు. "1950వ దశకంలో ప్రారంభమైన భారత అభివృద్ధి పయనంలో రష్యా అమూల్య భాగస్వామిగా కొనసాగుతోంది" అని జైరాం రమేశ్ తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఉక్కు, భారీ ఇంజనీరింగ్, గనులు, విద్యుత్తు, చమురు సహజవాయువు, రసాయనాలు, రక్షణ, అంతరిక్షం తదితర రంగాల్లో భారత్ సాధించిన పురోగతిలో ఈ సంబంధం ఎంతగానో ఉపయోగపడిందని ఆయన అన్నారు.

**దేశాన్ని మీరు ముంచారు, మేం నిర్మించాం**

కాంగ్రెస్ దేశాన్ని ముంచేయగా తాము తిరిగి నిర్మించామని భాజపా శుక్రవారం పేర్కొంది. బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు సంబంధించి కాంగ్రెస్ తదితర ప్రతిపక్షాలు ప్రతికూల వాతావరణాన్ని సృష్టిస్తున్నాయని ఆ పార్టీ ఆరోపించింది. దేశం సాధిస్తున్న పురోగతిని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని అధికార పార్టీ పేర్కొంది. యూపీఏ పరిపాలనలో 201112 కాలంలో భారత్ బ్రిక్స్‌లో తన స్థాయిని కోల్పోయే పరిస్థితి ఏర్పడగా నేడు ఆ కూటమి దేశాల అధినేతలకు భారత్ ఆతిథ్యం అందించే స్థాయికి చేరిందని భాజపా జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా అన్నారు. ప్రపంచ యవనికపై గతంలో ఎన్నడూ లేనంత ఉన్నత



స్థానాన్ని భారత్ నేడు పొందుతోందని ఆయన అభిప్రాయపడ్డారు.

# ఒకే తరహా హెచ్చరిక వద్దు

**- అధిక, సాధారణ ప్రాసెస్డ్ ఆహార పదార్థాల మధ్య తేడా తెలియాలి: సుప్రీం కోర్టు**



ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ఉప్పు, చక్కెర, కొవ్వు పదార్థాలు అధికంగా కలిసి ఉంటే ప్యాకేజ్డ్ ఫుడ్ ఉత్పత్తుల గురించిన సమాచారం వాటి వినియోగదారులు అందరికీ సులువుగా అవగాహన కలిగించేలా ఉండాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఎన్నో ప్రాంతీయ భాషలు మాట్లాడే మన దేశంలో ప్రజల అక్షరాస్యత, అవగాహన స్థాయిలు కూడా భిన్నంగా ఉంటాయని చెబుతూ తినుబండారాలు, పానీయాల ప్యాకెట్ల ముందు భాగంలో ముద్రించేందుకు ప్రతిపాదించిన హెచ్చరికలు అక్షరాలకే పరిమితం కాకుండా చిత్రాల రూపంలోనూ అర్థమయ్యేలా ఉండాలని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ కె.వినోద్‌చంద్రన్ ధర్మాసనం అభిప్రాయపడింది. ప్యాకెట్ల ముందు భాగంలోనే హెచ్చరికలను ప్రముఖంగా ముద్రించి దశల వారీగా దీనిని అమలుచేస్తామన్న భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) అఫిడవిట్‌పై ధర్మాసనం మరిన్ని వివరణలను కోరింది.

**అమలుకు ఎంత సమయం తీసుకుంటారు?**

తొలి దశలో..ఉప్పు, చక్కెర, కొవ్వు పదార్థాలలో ఏవైనా రెండు అధికంగా ఉండే ప్యాకేజ్డ్ తినుబండారాలు, తీయటి పానీయాల ఉత్పత్తుల ప్యాకెట్లపై పోషక విలువల సమాచార ముద్రణను అమలు చేస్తామని ఎఫ్ఎస్ఎస్ఏఐ అఫిడవిట్‌లో పేర్కొంది. రెండో దశలో...ఈ మూడు ఆందోళనకర పోషకాల్లో ఏ ఒక్కటి అధికంగా ఉన్న ఉత్పత్తులనూ హెచ్చరికల లేబుళ్ల ముద్రణ పరిధిలోకి తీసుకొస్తామని వివరించింది. దీని అమలుకు ఎంత సమయం తీసుకుంటారని ధర్మాసనం ప్రశ్నించింది. మితిమీరి, సాధారణ ప్రాసెస్ చేసిన తినుబండారాలు, అధిక చక్కెరను జోడించిన పానీయాలు, సాధారణ పరిమితికి లోబడి ఉండేవి, మంచి పోషక విలువలున్న ఆహార పదార్థాలేవో వర్గీకరించడంతో పాటు ఆ సమాచారం స్పష్టంగా తెలిసేలా, ఆరోగ్యంపై అవి చూపే దుష్ప్రభావం ప్రాతిపదికన హెచ్చరిక లేబుళ్లు కూడా భిన్నంగా ఉండాలని ధర్మాసనం తెలిపింది. ఈ సూచనలను పరిగణనలోకి తీసుకుని ఎఫ్ఎస్ఎస్ఏఐ తన అఫిడవిట్‌లోని అంశాలను పునఃపరిశీలించుకుని పది రోజుల్లోగా మరింత స్పష్టత ఇవ్వాలని ఆదేశించింది. ప్యాకెట్ల ముందు వైపు ముద్రించే ఆహార పదార్థాల సమాచారం అక్షరాలతో పాటు చిత్రాల రూపంలోనూ సామాన్యులకూ, ఆన్‌లైన్ కొనుగోలుదారులకు అర్థమయ్యేలా ఉండాలని ధర్మాసనం నిర్దేశించింది.

**విద్యార్థులకు ఎలా అవగాహన కల్పిస్తారు?**

ప్యాకేజ్డ్ ఫుడ్‌లో మితిమీరి ప్రాసెస్ చేసిన ఆహార దినుసులు, రుచికోసం అధికంగా వినియోగించే చక్కెర, ఉప్పు, కొవ్వు పదార్థాలు చిన్నారులను అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లకు గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన ధర్మాసనం...పాఠశాలల్లో వీటిపై విద్యార్థులకు ఎలా అవగాహన కల్పిస్తారని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను విద్యార్థులు అలవర్చుకునేలా చేయటానికి రూపొందించే పాఠ్యప్రణాళికలను, నిర్వహించే వర్క్‌షాప్‌ల తరహా కార్యక్రమాలేమిటో తెలియజేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 28వ తేదీకి వాయిదా వేసింది.

# రెండు వాణిజ్య నౌకలు ఢీ.. గుజరాత్ తీరంలో ఘటన



**గుజరాత్ తీరంలో రెండు వాణిజ్య నౌకలు ఢీకొన్నాయి. కాండ్లా నౌకాశ్రయానికి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వెంటనే రంగంలోకి దిగిన భారత కోస్ట్ గార్డ్.. రెస్క్యూ ఆపరేషన్ చేపట్టింది. ఓ నౌకలో 24 మంది సిబ్బంది ఉండగా.. వారిలో 21 మందిని సురక్షితంగా తరలించినట్లు వెల్లడించింది. నౌక కార్యకలాపాలు కొనసాగించేందుకు ముగ్గురు సిబ్బంది అందులోనే ఉన్నారని తెలిపింది.**

**ఎంవీ కేమ్యాక్స్ ఎంపరర్, ఎంపీ ట్రూ మారినర్ అనే వాణిజ్య నౌకలు ఢీకొన్నాయని పేర్కొంది. ఈ ఘటన నేపథ్యంలో కాలుష్య ప్రతిస్పందన చర్యలు మొదలుపెట్టామని.. సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటున్నట్లు తెలిపింది.**

# పాలకులకు అద్భుత సందేశం!

**- పుతిన్‌కు ప్రధాని మోదీ బహూకరించిన తమిళ గ్రంథం ప్రత్యేకత ఇదీ!**




బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు ఢిల్లీ వచ్చిన రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు భారత ప్రధాని మోదీ బహూకరించిన ప్రాచీన తమిళ గ్రంథం 'తిరుక్కురళ్' ఎన్నో అద్భుత విశేషాల సమాహారం. గొప్ప తత్వవేత్త అయిన తిరువళ్లువర్ కాలాతీతమైన, శాశ్వతమైన జ్ఞానాన్ని దాదాపు 2500 ఏళ్ల క్రితమే తన రచన ద్వారా ప్రపంచానికి అందించారు. ఇందులో నైతికత, ప్రేమ, మంచితనం, సుపరిపాలన, సంపద, మనిషి ప్రవర్తన వంటి అనేక అంశాలతో కూడిన 1330 ద్విపదలు ఉన్నాయి. దీన్ని మొత్తం 133 అధ్యాయాలుగా విభజించగా, ఒక్కోదాంట్లో పది ద్విపదలు ఉన్నాయి. ఓ వ్యక్తి ప్రవర్తన ఎలా ఉండాలి? ఇతరులతో ఎలా వ్యవహరించాలి? అనే విషయాలు మొదలు... జీవితం, మరణం, వాటిమధ్య ఇమిడి ఉన్న అనేక విషయాలను ఇందులో ప్రస్తావించారు. మానవ అస్తిత్వానికి సంబంధించిన ఎన్నో ప్రశ్నలకు సమాధానాలున్నాయి. పాలకులు, న్యాయం, వ్యవసాయం, పన్నులు, ప్రభుత్వాల గురించి పేర్కొన్నారు. అర్థమంతమైన, నైతిక జీవితాన్ని గడపడానికి ఈ గ్రంథాన్ని మార్గదర్శిగా భావిస్తున్నందు వల్లే ఇది తమిళనాడు సరిహద్దులు దాటి ఎన్నో ప్రపంచ భాషల్లోకి అనువాదమైంది.

# మా బడిని వెదికిపెట్టండి



బిహార్‌లోని జిల్లా కేంద్రం కటిహార్‌కు పెద్దఎత్తున చేరుకున్న ఆ గ్రామస్థులు "సార్! మా స్కూలు మాయమైంది.. ప్లీజ్ వెదికిపెట్టరూ" అంటూ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ప్రాణ్‌పుర్ తాలూకా దీఘాపార్ గ్రామం నుంచి వీరంతా డప్పు చప్పుళ్లతో తరలివచ్చారు. ఈ గ్రామ పాఠశాల శిథిలావస్థలో ఉండగా, కొత్త భవనం నిర్మాణానికి రూ.44.85 లక్షలు మంజూరయ్యాయి. రికార్డుల ప్రకారం టెండరు ప్రక్రియ 2024లోనే పూర్తయింది. భవన నిర్మాణపనులు కూడా పూర్తికాగా, మూడు విడతల్లో నిధులు చెల్లించినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. వాస్తవానికి అక్కడ భవనం కాదు కదా.. ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. అంతా కాగితాల్లోనే కట్టేసి, నిధులు స్వాహా చేశారంటూ గ్రామస్థులు ఈ వినూత్న నిరసనకు దిగారు. స్వయంగా పరిశీలించి, బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని కటిహార్ సబ్ డివిజనల్ అధికారి సూరజ్‌కుమార్ గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

# కట్ల పామునే.. కట్లు లేవంతే..

ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరి (దుధ్వా టైగర్ రిజర్వ్) ప్రాంతంలో అరుదైన కట్లపాము కనిపించింది. సాధారణంగా కట్లపాములు మెరుస్తూ, తెలిక రంగు అడ్డ చారలతో ఉంటాయి. దీనిపై మాత్రం ఎలాంటి చారలూ లేవు. రంగు కూడా వెలిసిపోయింది. ఇది అసాధారణమైనదని పశుసంవర్ధక శాస్త్ర నిపుణుడు డాక్టర్ దయా శంకర్ తెలిపారు. దీని జన్యుపరమైన అంశాలను అధ్యయనం చేస్తామని వన్యప్రాణి అధికారులు తెలిపారు.



అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
ఆదివారం | అనంతపురం
13.09.2026





# ముప్పు నేపాల్‌కు మాత్రమే కాదు..!

నేపాల్ తాజా వరద విధ్వంసం వాతావరణ మార్పుల దుష్ప్రభావమే. హిమాలయాల్లో హిమానీనదాలు, పురాతన మంచు పొరలు (పెర్మాఫ్రాస్ట్), కొండచరియలు విరిగిపడటం, నదులు ఉప్పొంగడం వంటివి నానాటికీ పెరుగుతున్నాయి. పర్వత ప్రాంతాల సహజ ఆవరణ వ్యవస్థ దెబ్బతింటే హిమానీనదాలు కరిగి నీరు త్వరగా దేశ సరిహద్దులు దాటి వరదగా మారుతుంది. హెచ్చరిక వ్యవస్థలకు, మౌలిక సదుపాయాలకు, దౌత్యానికి అది సవాలు విసురుతుంది.

భోటే కోషి నది 720 కిలోమీటర్ల పొడవుండి టిబెట్ పీఠభూమి నుంచి నేపాల్ మీదుగా బిహార్‌లోకి ప్రవేశించి గంగానదిలో కలుస్తుంది. దీని పరీవాహక ప్రాంతంలో సుమారు 45శాతం నేపాల్‌లో, 33శాతం చైనాలో, 22శాతం భారత్‌లో ఉంది. ఆ నది 35-40 కోట్ల మందికి జీవనాధారం. కోషి హిమాలయాల నుంచి గంగా మైదానంలోకి ప్రవేశించే ముందు ఎగువన సున్ కోషి, అరుణ్, తామోర్ నదులు దానిలో కలుస్తాయి. కోషి పరీవాహక ప్రాంతంలోని హిమాలయాల్లో పగులు రేఖలు ఉండటంతో ఈ బేసిన్‌లో 5,653 కొండచరియలు విరిగిపడిన చరిత్ర ఉంది. అవి నదులకు అడ్డుకట్టగా నిలిచి, ఆ కట్టల వెనక ఆగిన నీరు ఒక్కపెట్టున కిందకు వరదలా వచ్చిపడే ప్రమాదం ఉంది. కోషి నది ఏటా దాదాపు 10 కోట్ల టన్నుల రాళ్లు, మట్టితో కూడిన అవక్షేపాన్ని దిగువకు రవాణా చేస్తుంది. కొన్నిసార్లు అది 13.5 కోట్ల టన్నులకు చేరుకుంటుంది. అవక్షేపం చేరిక వల్ల నదీగర్భం వరద నీటిని ఇముడ్చుకోలేకపోతుంది. ఇప్పటికే కోషి నది 100 కిలోమీటర్లకు పైగా తన ప్రవాహ మార్గాన్ని మార్చుకుంది. దీనికి వాతావరణ మార్పులు తోడై వరదలు సంభవిస్తున్నాయి.

వేలాదిగా హిమానీనదాలు

హిందూకుష్ హిమాలయ ప్రాంతంలోని అయిదు నదీ పరీవాహక ప్రాంతాల్లో 25 వేల నుంచి 31 వేలదాకా హిమానీనదాలు ఉన్నట్లు అంచనా. భూమి వేడెక్కడం వల్ల హిమానీనదాలు, పురాతన మంచు పొరలు (పెర్మాఫ్రాస్ట్) అస్థిరమై సరస్సులు ఏర్పడి, విస్తరిస్తున్నాయి. కొన్నిసార్లు ఆ సరస్సుల కట్టలు, కొండవాలులు బలహీనపడి ఆకస్మిక వరదలు విరుచుకుపడుతున్నాయి. 2020లో కోషి బేసిన్‌లో అలాంటి 3,624 సరస్సులను గుర్తించారు. వాటిలో 47 ప్రమాదకరంగా ఉన్నట్లు తేల్చారు. ఆ సరస్సుల్లో చైనాలో పాతిక, నేపాల్‌లో 21 ఉన్నాయి. ఒకటి ఇండియాలో ఉంది. హిమానీనద సరస్సులు బద్దలై సంభవించే వరదలను 'గ్లాఫ్' అంటారు. 1977 నుంచి నేపాల్‌లో 26 గ్లాఫ్ ఘటనలు నమోదయ్యాయి. ఎవరెస్ట్-దుధ్ కోషి ప్రాంతం యాభైఏళ్లలో అయిదు ప్రధాన గ్లాఫ్‌లను చవిచూసింది. తూర్పు హిమాలయాల్లో గ్లాఫ్ ముప్పు 2100 నాటికి దాదాపు మూడు రెట్లు పెరగవచ్చని అంచనా! ఇలాంటి ప్రమాదాలను ముందే గుర్తించి, పరస్పరం హెచ్చరించుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చు. అంటే- వాతావరణ, భౌగోళిక సమస్యను దౌత్యం ద్వారా పరిష్కరించుకోవాలన్నమాట. కోషి నది విషయంలో ఇలాంటి దౌత్య సహకార చరిత్ర ఉంది. 1954లో కుదిరి 1966లో సవరించిన భారత్-నేపాల్ కోషి ఒప్పంద పరిధిలోకి బ్యారేజీలు, కరకట్టలు, సర్వేలు, వరద నియంత్రణ వస్తాయి. కోషి, గండక్, వరద నిర్వహణ కమిటీలతో సహా అనేక ద్వైపాక్షిక యంత్రాంగాల ద్వారా రెండు దేశాల సహకారం కొనసాగుతోంది.

రుతుపవనాల సమయంలో నేపాల్ వాతావరణ-నదీ ప్రవాహ సమాచారం గంటకోసారి అప్‌డేట్ అవుతుంది. భారతదేశ అంచనాలకు అది ఉపయోగపడుతుంది. బిహార్ కోషి వ్యవస్థ 72 గంటల ముందుగానే 17 ప్రదేశాలలో ప్రయోగాత్మక అంచనాలను అందిస్తుంది. 2014 నుంచి రెండు దేశాల్లో కోషి వ్యవస్థ సెన్సర్లు, రాడార్, వర్షపాత అంచనాలను మిళితం చేసి మూడు రోజుల వరద సూచనలను అందిస్తోంది. హిందూకుష్-హిమాలయ ప్రాంతంలో వాతావరణ మార్పులు, హిమానీనదాల కరుగుదలతో ప్రమాదాలను ముందే గుర్తించి హెచ్చరించడానికి అంతర్జాతీయ సమీకృత పర్వత అభివృద్ధి కేంద్రం, ప్రపంచ వాతావరణ పరిశోధన కేంద్రం కలిసి పనిచేస్తున్నాయి. అవి 2010లో ప్రారంభించిన ప్రాజెక్ట్ కింద బంగ్లాదేశ్, భూటాన్, చైనా, భారత్, నేపాల్, పాకిస్థాన్‌లలో 38 నిజసమయ హైడ్రోమెటియెరొలాజికల్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. రాజకీయ కారణాలవల్ల ఈ ఏర్పాట్లు చట్టబద్ధమైన, నిరంతర వ్యవస్థగా మారలేదు. నిరుడు జులైలో రసువా వరద సమయంలో చైనా ఎలాంటి హెచ్చరిక జారీ చేయలేదని నేపాల్ అధికారులు తెలిపారు. తాజాగా వరద నీరు సరిహద్దు దాటిన తరవాతే కీలక సమాచారం నేపాల్‌కు చేరింది. వరదలు, హిమానీనద ప్రమాద సమాచారాన్ని రాజకీయం చేయకూడదు. తటస్థ మానవతా సహాయంగా పరిగణించాలి. హిమాలయ దేశాల సహకారం స్వచ్ఛంద సమాచార మార్పిడి నుంచి స్వయంచాలక హెచ్చరికల వ్యవస్థకు మారాలి. నీటిమట్టాలు, భూకంప ప్రమాదాలు, హిమానీనదాలు, సరస్సులు, కొండవాలు స్థానభ్రంశం, కొండచరియల స్థితిగతుల గురించి సమాచారాన్ని చైనా, నేపాల్, భారత్‌లు ఇచ్చిపుచ్చుకోవాలి. రాజకీయాలతో సంబంధం లేకుండా సర్వకాల సర్వావస్థల్లో హెచ్చరికలను పంపాలి. ఉపగ్రహ కమ్యూనికేషన్లను విరివిగా ఉపయోగించాలి.

సమాచారాన్ని పంచుకుంటేనే...

ఇంజినీరింగ్ ప్రాజెక్టులు గ్లాఫ్ ప్రమాదాన్ని తగ్గించగలవు కానీ హిమాలయ ప్రాంతమంతటా భద్రతకు హామీ ఇవ్వలేవు. హిందూకుష్-హిమాలయ ప్రాంతంలోనే 200 ప్రమాదకర హిమానీనద సరస్సులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో హిమాలయ ప్రాంతంలో వంతెనలు, ఆనకట్టలు, రోడ్లను భూకంపాలు, హిమానీనదాల ముప్పును తట్టుకునేలా డిజైన్ చేయాలి. నేపాల్‌లో హెచ్చరిక వ్యవస్థలు బలహీనంగా ఉన్నందువల్ల ఉపగ్రహ, కృత్రిమ మేధా పర్యవేక్షణ, సైరన్లు, మొబైల్ అలర్ట్‌లతో కూడిన బలమైన ముందస్తు హెచ్చరిక ప్రణాళికను చేపట్టాలి. అంతర్జాతీయ సంస్థలు వివిధ దేశాలకు హెచ్చరికలు పంపాలి. ముంచుకొస్తున్న ముప్పునకు సంబంధించిన డేటాను పరస్పరం పంచుకోవాలి. మొత్తంగా హిందూకుష్ హిమాలయాల్లో హిమానీనదాలు వేగంగా కరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అధునాతన శాస్త్ర సాంకేతికతలతో నిర్మించిన మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ సహకారం, సకాలంలో హెచ్చరికల ద్వారానే భావి విపత్తులను విజయవంతంగా ఎదుర్కోవడం సాధ్యమవుతుంది.



# ఎలక్ట్రానిక్స్ విప్లవం: దిగుమతిదారు నుంచి ప్రపంచ తయారీ కేంద్రంగా భారత్

## ఆరు రెట్లు పెరిగిన ఉత్పత్తి.. ఎనిమిది రెట్లు ఎగుమతులు.. దశాబ్దంలో 25 లక్షల ఉద్యోగాలు

**ఒకప్పుడు ఎలక్ట్రానిక్ పరికరాల కోసం దిగుమతులపై ఆధారపడిన భారత్.. ఇప్పుడు అదే రంగంలో ప్రపంచానికి తయారీ కేంద్రంగా ఎదిగే దిశగా అడుగులు వేస్తోంది. మొబైల్ ఫోన్ల నుంచి సెమీకండక్టర్ల వరకు విస్తరిస్తున్న ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగం భారత ఆర్థిక వ్యవస్థలో కొత్త శక్తిని నింపుతోంది. భారత్‌లో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి 2014–15లో రూ.1.9 లక్షల కోట్ల నుంచి 2024–25 నాటికి రూ.11.3 లక్షల కోట్లకు చేరింది. అంటే దాదాపు ఆరు రెట్లు పెరిగింది. ఇదే సమయంలో ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు రూ.38 వేల కోట్ల నుంచి రూ.3.27 లక్షల కోట్లకు చేరి దాదాపు ఎనిమిది రెట్లు వృద్ధి చెందాయి. గత పదేళ్లలో ఈ రంగం సుమారు 25 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలను సృష్టించడం మరో కీలక పరిణామం.**





డా. ముచ్చుకోట సురేష్‌బాబు,
9989988912

మొబైల్ ఫోన్.. మార్పుకు ప్రతీక

భారత ఎలక్ట్రానిక్స్ రంగంలో వచ్చిన మార్పుకు మొబైల్ ఫోన్ పరిశ్రమే అత్యుత్తమ ఉదాహరణ. 2014-15లో కేవలం రూ.18 వేల కోట్లుగా ఉన్న మొబైల్ ఫోన్ ఉత్పత్తి 2024-25లో రూ.5.45 లక్షల కోట్లకు చేరింది. ఇది ఏకంగా 28 రెట్ల వృద్ధి. 2014లో దేశంలో రెండు మొబైల్ తయారీ యూనిట్లు మాత్రమే ఉండగా, నేడు వాటి సంఖ్య 300కు పైగా ఉంది. ఏటా సుమారు 33 కోట్ల మొబైల్ ఫోన్లు భారత్‌లో తయారవుతున్నాయి. మొబైల్ ఫోన్ ఎగుమతులు కూడా రూ.1,500 కోట్ల నుంచి రూ.2 లక్షల కోట్లకు పెరిగాయి. ప్రపంచ దిగ్గజ సంస్థలు భారత్‌లో తయారీ సామర్థ్యాలను పెంచుతున్నాయి. ముఖ్యంగా ఆపిల్ వంటి సంస్థల ఉత్పత్తి, ఎగుమతుల విస్తరణ భారత్ అంతర్జాతీయ ఎలక్ట్రానిక్స్ సరఫరా గొలుసులో కీలక స్థానాన్ని సంపాదించుకుంటున్నదనడానికి సంకేతం. అంటే భారత్ ఇక కేవలం ప్రపంచానికి మార్కెట్ మాత్రమే కాదు.. ప్రపంచ మార్కెట్ కోసం తయారు చేసే దేశంగా కూడా మారుతోంది.

స్మార్ట్‌ఫోన్ దాటి విస్తరిస్తున్న రంగం

ఈఎస్డియం అంటే కేవలం మొబైల్ ఫోన్ల తయారీ కాదు. టెలికాం పరికరాలు, కంప్యూటర్లు, వినియోగ ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ ఎలక్ట్రానిక్స్, వైద్య పరికరాలు, రక్షణ, ఏరోస్పేస్, సోలార్ ఫొటోవోల్టాయిక్ పరికరాలు, సెమీకండక్టర్లు, చిప్ డిజైన్, వీఎల్ఎస్ఐ, ఎంబెడెడ్ సిస్టమ్స్, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల వరకు దీని పరిధి విస్తరించింది. విద్యుత్ వాహనాల నుంచి స్మార్ట్ కార్ల వరకు, ఆసుపత్రుల నుంచి పరిశ్రమల వరకు ఎలక్ట్రానిక్స్ కీలకంగా మారింది. భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆటోమేషన్, డ్రోన్లు, రక్షణ సాంకేతికత వంటి రంగాల అభివృద్ధి కూడా ఎలక్ట్రానిక్స్ సామర్థ్యంపైనే ఆధారపడనుంది.

ప్రభుత్వ విధానాలే ఊతం

ఈ మార్పు వెనుక ప్రభుత్వ విధానాలకు గణనీయమైన పాత్ర ఉంది. ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ పథకం ద్వారా పెట్టుబడులు, ఉత్పత్తి, ఎగుమతులను ప్రోత్సహిస్తున్నారు. ఎలక్ట్రానిక్ కాంపోనెంట్లు, సెమీకండక్టర్ల తయారీని పెంచేందుకు స్పెక్స్, దేశీయ కాంపోనెంట్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేసేందుకు ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ మాన్యుఫాక్చరింగ్ స్కీమ్ వంటి పథకాలు అమలులోకి వచ్చాయి. అదే సమయంలో ఇండియా సెమీకండక్టర్ మిషన్ ద్వారా చిప్ తయారీ, ప్యాకేజింగ్, సంబంధిత సాంకేతిక సామర్థ్యాలను దేశంలోనే అభివృద్ధి చేయాలన్న ప్రయత్నం జరుగుతోంది.

'చైనా ప్లస్ వన్'.. భారత్‌కు అవకాశం

ప్రపంచ కంపెనీలు తమ తయారీ సరఫరా గొలుసులను ఒక్క దేశంపై ఆధారపడకుండా విస్తరించేందుకు అనుసరిస్తున్న 'చైనా ప్లస్ వన్' వ్యూహం భారత్‌కు కొత్త అవకాశాన్ని తెచ్చిపెట్టింది. భారీ దేశీయ మార్కెట్, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, మెరుగవుతున్న మౌలిక వసతులు, విధానపరమైన ప్రోత్సాహకాలు భారత్‌ను అంతర్జాతీయ సంస్థలకు ఆకర్షణీయ గమ్యస్థానంగా మారుస్తున్నాయి. తమిళనాడు ఎలక్ట్రానిక్స్ తయారీ, ఎగుమతుల్లో ముందంజలో ఉండగా, కర్ణాటక చిప్ డిజైన్, పరిశోధన-అభివృద్ధిలో బలమైన కేంద్రంగా నిలుస్తోంది. ఉత్తరప్రదేశ్ మొబైల్, వినియోగ ఎలక్ట్రానిక్స్ తయారీలో వేగంగా ఎదుగుతోంది. గుజరాత్, ఆంధ్రప్రదేశ్ కూడా సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రాలుగా తమ స్థానాన్ని బలోపేతం చేసుకుంటున్నాయి.

అసలు సవాలు ఇప్పుడే మొదలు

అయితే ఉత్పత్తి, అసెంబ్లీ పెరగడం మాత్రమే సరిపోదు. భారత్ 'అసెంబ్లీ దేశం' నుంచి 'డిజైన్-ఇన్నోవేషన్ దేశం'గా మారాలి. మొబైల్ ఫోన్లు తయారు చేయడం కంటే వాటిలో ఉపయోగించే చిప్స్, డిస్‌ప్లేలు, సెన్సర్లు, బ్యాటరీలు, ఇతర కీలక కాంపోనెంట్లను దేశీయంగా తయారు చేయడం ముఖ్యం. అంతకంటే ముఖ్యంగా భారతీయ కంపెనీలు స్వంత సాంకేతిక పరిజ్ఞానం, పేటెంట్లు, డిజైన్లు, మేధో సంపత్తిని సృష్టించాలి. ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్లలో దిగుమతి ఆధారితత కొనసాగితే, తయారీ పెరిగినా విలువలో పెద్ద భాగం దేశం వెలుపలే మిగిలే ప్రమాదం ఉంది. కాబట్టి తదుపరి దశ 'మేక్ ఇన్ ఇండియా' నుంచి 'డిజైన్ ఇన్ ఇండియా, ఇన్నోవేట్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్' దిశగా సాగాలి. 2030-31 నాటికి 500 బిలియన్ డాలర్ల దేశీయ ఎలక్ట్రానిక్స్ తయారీ వ్యవస్థను నిర్మించాలన్న లక్ష్యం సాధించాలంటే విధాన స్థిరత్వం, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, దేశీయ కాంపోనెంట్ తయారీ, సెమీకండక్టర్ సామర్థ్యం మరింత బలోపేతం కావాలి. భారత్ ఎలక్ట్రానిక్స్ విప్లవం ఇప్పటికే ప్రారంభమైంది. ఇప్పుడు ప్రశ్న ఉత్పత్తి ఎంత పెరుగుతుందన్నది కాదు——ప్రపంచ సాంకేతికతను భారత్ ఎంతవరకు సృష్టించగలదన్నదే అసలు పరీక్ష. దిగుమతులను తగ్గించే దేశంగా కాకుండా.. ప్రపంచానికి సాంకేతికతను అందించే దేశంగా భారత్ ఎదిగినప్పుడే ఈ ఎలక్ట్రానిక్స్ విప్లవం నిజమైన ఆత్మనిర్భరతకు, ఆర్థిక శక్తికి,

# కలతలు రేపే కలయికలు...!

**కరిగిపోతుంది, మరిగిపోతుంది, విరిగిపోతుంది, పొంగిపోతుంది, కుంగిపోతుంది- చిత్రమైన ఆ మనసు ఎక్కడుంటుందో, ఎలా ఉంటుందో మాత్రం మనిషికి తెలియదు. 'ఉంది' అంటుంది ఐతరేయ బ్రాహ్మణం! శరీరం కన్నా భిన్నమది. అపూర్వమైనది. ప్రజాపతి దాన్ని మనిషిలోనే నిక్షిప్తం చేశాడంది. అందులోంచే పుట్టుకొచ్చే మాయదారి ప్రేమది మరోరకం దాపరికం. ఎప్పుడు ఎవరిపై ఎందుకు పుడుతుందో తెలియదు. ఉన్నట్టుండి మనసులోకి చొరబడుతుంది. వయసును చెరబడుతుంది. కాలాన్ని మర్చిపోయేలా చేస్తుంది. దేహభాషలో మార్పులు తెస్తుంది. 'నీయందు నా చిత్తము అనవరతము నచ్చి యున్నది నీ ఆన! నాన (సంకోచము)లేదు' అంటూ రుక్మిణి వంటి అమ్మాయి కృష్ణుడికి కబురెట్టిందంటే- ప్రేమ ప్రభావ తీవ్రతను ఊహించుకోవచ్చు. 'ఇటువంటి నీ మాట, నీదు పాట, నీ వలపు, చూపు- దొరకునే బహుతపంబులు గావించి బడయకున్న' అని రావణుడంతటి తపశ్శాలి- రంభను చూడగానే తెగ ఇదయ్యాడు. పురాణకాలం నాటి ముచ్చటలవి. 'వెలిగించవే చిన్ని వలపు దీపం... ఎందుకే నామీద అంత కోపం?' వంటి భావకవిత్వాలు వింటూ గర్వంతోను, లజ్జగాను చిరునవ్వును అదిమిపెట్టడం ఇప్పటి గడుసుదనం!**

'ప్రేమను కోరింది నా దేహం కాదు నా ఆత్మ! వేడి కాదది జీవితాన్ని వెలిగించే విద్యుచ్ఛక్తి' అంటుంది చలం నాయిక శశిరేఖ. అలాంటి ప్రేమ అమృతత్వానికి దారితీస్తుంది. మౌనానికి నాదాన్నిస్తుంది. భావానికి దృశ్యాన్నిస్తుంది. చూపులకు మాటలు నేర్పిస్తుంది. 'సఖుని ఒడిలో సురిగి కోటి సుఖముల శిఖర మునైతి' వంటి సమాధి స్థితినిస్తుంది. కవయిత్రి రేవతీదేవి మాటల్లో 'తనువంతటా మనసైన, మనసంతటా తనువైన, నేనైన తనలో పరిపూర్ణమై మేము!' తరహా అద్వైతస్థితికి చేరుస్తుంది. ఇదంతా వలపు కామంతో కలిసి కలుషితం కానంతవరకే! దేహానికి దాహం పెరిగేకొద్దీ మనసును మోహం కమ్మేస్తుంది. కాంక్షలు జ్వలిస్తాయి. ప్రేమ ఓడిపోతుంది. వెన్నెల్లోని వికాసాన్ని కన్నుల్లో వెలిగించగల తన సహజసిద్ధమైన మంత్రశక్తిని కోల్పోతుంది. కొండేపూడి నిర్మల ఊహించినట్లే 'వలను ప్రేమించిన పిట్టల జాబితా' పెరిగిపోతుంది. 'మోహపరవశంతోనే ఉన్మాదమవుతోంది లోకం' అన్న ఆరోపణ నిజం అవుతుంది. 'ఊపిరి నిలిచేదాకా... ఈ జనమ కడదాకా...' వంటి బాసలు తేలిపోతాయి. వాటికి తోడు ఆర్థిక, సామాజిక వ్యత్యాసాలు, అపార్థాలు సైతం దూరాన్ని పెంచుతాయి. ప్రేమికులు విడిపోతారు. ప్రేమ బాధతో నిట్టూరుస్తుంది!

అంతమాత్రాన మరణించిందనుకుంటే పొరబాటు ప్రేమ చిరంజీవి! నివురుకప్పిన నిప్పులాంటిదది. పాత లేఖలు బయటపడినప్పుడో, ఎవరిలోనో పోలిక తోచినప్పుడో, చిరపరిచిత ప్రదేశాలకు మరోసారి పోయినప్పుడో ఆ జ్ఞాపకాలు పెనుగాలులై మంటను రాజేస్తాయి. ఒకప్పుడు చేతిస్పర్శ సోకగానే సెలయేరైన జోరును, మూతివిరుపుతో ఎద నీరైన తీరును గుర్తుచేసుకుని గాఢంగా మూల్గుతుంది. 'కళ్లు శ్రావణమేఘాలవుతున్నా ఫిర్ భీ మేరా మన్ ప్యాసా... దప్పిక మాత్రం తీరక... మధురమైన బాధరా, సలుపుతోందిరా' అనుకుని ఎద నలిగిపోతుంది. అలాంటి భగ్నప్రేమికులకోసం వియత్నాం ప్రభుత్వం ఏటా ఓ సంప్రదాయ వేడుక జరుపుతోంది. భంగపడిన భగ్నప్రేమికులంతా ఆ 'ప్రేమసంత'లో వేలాదిగా పాల్గొని, తీపిగాయాలకు లేపనాలు పూసుకునే విలక్షణ ఆచారం చిరకాలంగా కొనసాగుతోందట. చేరువ కాలేమని తెలిసీ చింతించి, వలచీ విలపించడంలోని తీయదనాన్ని తీరిగ్గా ఆస్వాదించి, సాయంత్రానికి కవి రవూఫ్ చెప్పినట్లు 'పోగొట్టుకున్నదే జీవితం! పొందినదల్లా పోయినదాని ఆనవాళ్లు, కొన్ని గాయాలు, మరికొన్ని జ్ఞాపకాలు' అనుకుంటూ భారంగా వీడ్కోలు చెప్పుకొని, ఎవరి జీవితగమ్యాల దిశగా వారు సా...గిపోతారట అవును, కన్నీళ్లతోనే...!

# ప్రజారోగ్యాన్ని పట్టించుకునేదెవరు?

**మన దేశంలో దేనికి కొరత ఉన్నా నాయకులకు మాత్రం కొరతేమీ లేదు. నింగిలో చుక్కల మాదిరిగా తెల్లచొక్కాల వాళ్లు అంతమంది ఉన్నారు కదా, జనానికి ఏమైనా ఉపయోగపడతారనుకుంటే పొరపాటే! ఆత్మస్తుతి, పరనిందలకు తప్ప ప్రజలకు పనికొచ్చేది ఏదైనా చేయడానికి వాళ్లకు తీరికే ఉండదు. నేతలు సరే వాతలు పెడుతున్నారు, అధికారులైనా ఆదుకుంటారనుకుంటే అది అంతకంటే అమాయకత్వమవుతుంది. సర్కారీ యంత్రాంగంలో చాలామందికి నాయకులూ బడాబాబుల సేవకే సమయం సరిపోవట్లేదు. ఇక వాళ్లు సామాన్యులను పట్టించుకోవాలంటే ఇటు పొద్దు అటు పొడవాలి. జీర్ణశక్తి ఎక్కువ, జ్ఞాపకశక్తి తక్కువ ఉండే నేతలూ సర్కారీ సిబ్బందికి అసలు మామూలు జనం బాధలేవీ గుర్తుండవు. ఆఖరికి న్యాయపాలిక నిర్దేశాలు కూడా వాళ్ల మహాద్భుత మెదళ్లకు ఎక్కవు. సరైన అర్హతల్లేని అనధికార వైద్యులు ప్రజలను దోపిడీ చేయడానికి అనుమతించరాదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టీకరించి పదహారేళ్లు గడచిపోయింది. 'స్వాతంత్ర్యం సాధించి ఏడు దశాబ్దాలు దాటిపోయింది. అర్హతలు లేనివారు వైద్యులు కావడం మాత్రం ఆగట్లేదు. కోట్లాది మంది బతుకులతో వారు చెలగాటమాడుతూ యావత్ సమాజానికీ పెనుముప్పుగా తయారవుతున్నారు' అంటూ మరోకేసులో సుప్రీంకోర్టు హెచ్చరించి ఎనిమిదేళ్లవుతోంది. అయినా ఎవరికి పట్టింది? తాము పుట్టిందే ప్రజాసేవకోసమంటూ బహిరంగ వేదికలపై గొంతు చించుకునే నాయకుల్లో ఎవరికైనా చీమైనా కుట్టినట్టుందా? ప్రజలకు మేలుచేసేస్తామంటూ ఉద్యోగాల్లోకి వచ్చి, ప్రజాధనంతో జీతాలు తీసుకుంటున్న ప్రభుత్వాధికారుల్లోనైనా ఏమైనా చలనం వచ్చిందా? వచ్చి ఉంటే, అడపాదడపా దాడులతో సరిపెట్టకుండా వైద్యుల ముసుగులోని కేటుగాళ్లందరినీ కటకటాల్లోకి ఎందుకు నెట్టడం లేదు?**

ఎనిమిదో తరగతి చదువుతోందా చిన్నారి... బోనాల పండుగకు హాస్టల్ నుంచి ఇంటికొచ్చింది. సంతోషంగా సంబురాలు చేసుకుంది. ఇంతలో కాస్త జలుబు, దగ్గు రావడంతో ఊళ్లోని ఆర్ఎంపీ దగ్గరికి తీసుకెళ్లారు అమ్మానాన్నలు. అక్కడ అతను సూదిమందు ఇవ్వగానే నురగ కక్కుకుని స్పృహ తప్పిపోయింది. ఆ తర్వాత చనిపోయింది. ఇటీవల ఖమ్మం జిల్లాలో జరిగిన దారుణమిది! శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో పది రోజుల కిందట ఓ యువకుడు గ్యాస్ట్రబుల్‌తో ఇబ్బంది పడుతూ స్థానిక ఆర్ఎంపీని కలిశాడు. ఆ ప్రబుద్ధుడు సెలైన్ పెట్టి డోసు ఎక్కువ ఇంజెక్షన్ చేశాడు. అంతే, కడుపునొప్పితో అల్లాడిపోయి ఆ కుర్రాడు చనిపోయాడు. వారం క్రితం హైదరాబాద్‌లో జ్వరమని వచ్చిన ఓ మహిళకు ఇలాగే ఇంజెక్షన్ చేసి ఆమె ప్రాణాలు తీశాడు మరో ఆర్ఎంపీ. ఇలాంటి ఘోరాలు రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, దేశవ్యాప్తంగానూ తరచూ వెలుగుచూస్తున్నాయి. అయినా పల్లెల్లో, పట్టణాల్లోని పేదల బస్తీల్లో అర్హతల్లేని వారు నిర్వహిస్తున్న క్లినిక్‌లు అలాగే నిక్షేపంగా వర్ధిల్లుతున్నాయి. 'ఆరోగ్యంపై భారతదేశం తగినంత శ్రద్ధపెట్టలేదు. గ్రామీణ ప్రాంతాల్లో తగినంత మంది వైద్యుల్లేరు. దాంతో వైద్యులుగా చెప్పుకొనేవారిపై జనం ఆధారపడాల్సి వస్తోంది. వాస్తవానికి వీళ్లకు ఎలాంటి అర్హతలూ ఉండవు. కానీ, గ్రామీణ భారతంలో ఏదైనా చికిత్సకోసం మొదటిసారి వైద్యుణ్ని సందర్శించేవారిలో 80శాతం మంది వీళ్ల దగ్గరికే వెళ్తారు' అని ప్రముఖ ఆర్థికవేత్త అభిజిత్ బెనర్జీ గతంలో ఆవేదన వ్యక్తంజేశారు. నకిలీ వైద్యులు చెదపురుగుల మాదిరిగా వ్యాపించడానికి మూలకారణమేంటో అంత స్పష్టంగా తెలుస్తున్నప్పుడు ప్రభుత్వాలెందుకు గుడ్లప్పగించి చూస్తున్నాయి? కలలో కూడా ప్రజాసంక్షేమాన్ని మర్చిపోమంటూ మైకులు బద్దలు కొట్టే నాయకులు పల్లెల్లో వైద్యవసతులను ఎందుకు బాగుపరచరు? నగరాల్లోని మురికివాడల్లో జీవన పోరాటాలు చేసే బీదాబిక్కీ జనానికి అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్యం అందేలా చేస్తే నేతల సొంత సొమ్ము ఏమైనా తరిగిపోతుందా?

నన్ను ఎరిగినవాడు లేకపోతే నా బడాయి చూడమన్నాడట వెనకటికొకడు. ఇంటర్మీడియట్‌తో చదువు ఆపేసిన ఓ మాయగాడు అలాగే చర్మవ్యాధుల నిపుణుణ్ని అని చెప్పుకొంటూ హైదరాబాద్‌లో ఆసుపత్రిని నడిపిస్తూ మూడు రోజుల క్రితం పట్టుబడ్డాడు. అతితెలివితేటల్లో ఆరితేరిపోయిన అతగాడు సోరియాసిస్ చికిత్సకంటూ సొంతంగా జెల్ ఒకటి తయారుచేసి రోగులకు అంటగడుతున్నాడట. ఇలా అర్హతలేమీ లేకుండానే ఎప్పటినుంచో హాస్పిటళ్లను నిర్వహిస్తున్న మొత్తం పన్నెండు మంది నకిలీ వైద్యులను హైదరాబాద్ పోలీసులు అరెస్టుచేశారు. వైద్యంలో ఓనమాలు తెలియకపోయినా తెల్లకోటు వేసుకుంటున్న మాయగాళ్లు రోగులకు విచ్చలవిడిగా యాంటీబయాటిక్‌లు ఇచ్చేస్తున్నారు. దానివల్ల భవిష్యత్తులో ఆ మందులేవీ పనిచేయని 'ఏఎంఆర్' సమస్య పెరిగిపోతోంది. డబ్బులు దండుకోవడమే ఏకైక లక్ష్యంగా స్టెరాయిడ్లను కూడా రాసేస్తున్న దొంగ డాక్టర్ల కారణంగా ప్రజారోగ్యం ఇంకా దెబ్బతినిపోతోంది. కాసుల కక్కుర్తితో కాలంచెల్లిపోయిన మందులు, ఇంజెక్షన్లను రోగులకు అంటగట్టే నేరగాళ్లు కూడా వైద్యులుగా చలామణీ అవుతున్నారంటే మన వ్యవస్థ ప్రయోజకత్వాన్ని ఎలా అర్థంచేసుకోవాలి? 'నకిలీ వైద్యానికి నయవంచన జతకలిస్తే భయంకర పరిణామాలకు దారితీయవచ్చు.

వైద్యం పేరిట జరుగుతున్న దోపిడీపర్వాలకు అడ్డుకట్ట వేయాలి' అని ప్రసిద్ధ ఆర్థికనిపుణులు అమర్త్యసేన్ ప్రభుత్వాలకు పిలుపిచ్చి దశాబ్ద కాలమవుతోంది. కానీ, ఆలకించిన మహానుభావులు ఎవరున్నారు?

ఉత్తర్ ప్రదేశ్‌లో ఇటీవల ఓ దొంగ డాక్టర్ మూత్రపిండాల్లో రాళ్లు తీస్తానంటూ ఓ మహిళకు శస్త్రచికిత్స చేశాడు. పీకల్దాకా మందుకొట్టి యూట్యూబ్‌లో చూస్తూ ఆపరేషన్ మొదలుపెట్టిన ఆ దుర్మార్గుడు పొట్టలోని నరాలను, చిన్నపేగును, అన్నవాహికను ఎడాపెడా కోసిపారేసి ఆమె ప్రాణాలు తీశాడు. ఇలా దేశవ్యాప్తంగా ఎంతోమంది మోసగాళ్లు మెడలో స్టెతస్కోపు తగిలించుకుని శస్త్రచికిత్సల పేరిట ఎందరో రోగులను బలిగొంటున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో సరైన వైద్యం దొరక్క, ప్రైవేట్ హాస్పటళ్లలో ఖర్చులను భరించలేక సతమతమయ్యే పేద, దిగువ మధ్యతరగతి వర్గాల వారు కాస్త తక్కువకు చికిత్స చేస్తామనే ఇలాంటి నకిలీ డాక్టర్ల మాయలో పడుతున్నారు. చివరికి అయినవారిని అర్ధాంతరంగా పోగొట్టుకుని అంతులేని దుఃఖ□ంలో మునిగిపోతున్నారు. ప్రజారోగ్య రంగంలో సదుపాయాలను మెరుగుపరుస్తామంటూ ప్రభుత్వాలు దశాబ్దాలుగా ఊదరగొడుతున్నాయి కానీ, వాటి మాటలను నమ్మడమంటే మట్టెద్దుతో అరక దున్నించాలనుకోవడమే అవుతుంది. నకిలీ వైద్యులను పట్టుకుని కేసులు పెడుతున్నామని అధికారగణాలు సెలవిస్తుంటాయి కానీ, ఎంతమందికి ఎన్నేళ్లు శిక్షలు పడుతున్నాయంటే మాత్రం అవి నీళ్లు నములుతాయి. ప్రజలకోసమే తాము ఉన్నామన్న కనీసపాటి ఆలోచన నాయకుల్లోనూ యంత్రాంగంలోనూ రానంతకాలం జనభారతానికి పట్టిన ఈ ప్రారబ్ధం తప్పిపోదు. పేరుగొప్ప ప్రజాసేవకుల్లో ఆ స్పృహ ఎప్పటికైనా వస్తుందా అంటే, ఏలినవారు ఏమంటారో మరి!

అనంత
జనశక్తి
జనం కోసమే మా అక్షరం
ఆదివారం | అనంతపురం | 13.09.2026 | 01

# గుంతకల్లు డిఆర్ఎం కార్యాలయంలో రైల్వే సమస్యలపై చర్చ

**అనంతపురం, సెప్టెంబర్ 12 :**
**అనంత జనశక్తి న్యూస్**



అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణంలోని డిఆర్ఎం కార్యాలయంలో శనివారం గుంతకల్లు రైల్వే డివిజన్ డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు.గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోని పలు రైల్వే సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే పలుమార్లు కేంద్ర మంత్రివర్యులకు వినతిపత్రాలు సమర్పించిన విషయాన్ని డిఆర్ఎం దృష్టికి ఎంపీ తీసుకెళ్లారు. ఈ సమస్యలపై రైల్వే ఉన్నతాధికారులతో జరిగే సమావేశాల్లో మరోసారి ప్రత్యేకంగా ప్రస్తావించి, పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిఆర్ఎంని ఎంపీ కోరారు.

# పౌల్ట్రీ రైతుల సంక్షేమానికి పెద్దపీట

- రూ.657 కోట్ల ప్యాకేజీతో రంగం బలోపేతం.. పాలసీని వేగంగా అమలు చేస్తాం
- ఏటా 2,720 మదర్ పౌల్ట్రీ యూనిట్లు
- ఆధునిక పౌల్ట్రీ ఫారాలకు భారీ ప్రోత్సాహకాలు
- మొక్కజొన్న ధరల నియంత్రణకు ప్రత్యామ్నాయాలపై దృష్టి
- పౌల్ట్రీ అసోసియేషన్ సభ్యులతో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి, సెప్టెంబర్ 12:అనంత జనశక్తి ప్రతినిధి**

రాష్ట్రంలో పౌల్ట్రీ రంగాన్ని మరింత బలోపేతం చేసి, పౌల్ట్రీ రైతులకు అండగా నిలిచేందుకు ఏపీ పౌల్ట్రీ డెవలప్‌మెంట్ పాలసీ 2026-29కు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. పాలసీకి ఆమోదం తెలిపిన సందర్భంగా పౌల్ట్రీ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం విజయవాడలోని కార్యాలయంలో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పాలసీని త్వరితగతిన అమల్లోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో పౌల్ట్రీ రంగానికి నూతన ఊతం అందించడంతో పాటు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం, ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించడం, పెట్టుబడులను ఆకర్షించడం, ఉత్పాదకతను పెంచడం, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం లక్ష్యంగా పాలసీని రూపొందించినట్లు తెలిపారు. పౌల్ట్రీ రంగ అభివృద్ధికి ప్రభుత్వం రూ.657 కోట్ల భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించిందని వివరించారు. ఇందులో ఫుడ్ ప్రాసెసింగ్‌కు సంబంధించిన ప్రోత్సాహకాల కోసం రూ.209 కోట్లు, ఇండస్ట్రియల్ పాలసీ కింద రూ.152.18 కోట్లు, పశుసంవర్ధక శాఖ ద్వారా అమలు చేయనున్న కార్యక్రమాలకు రూ.296 కోట్లు కేటాయించనున్నారు. కోళ్ల ఫారాలు, హేచరీల మౌలిక వసతుల అభివృద్ధికి తీసుకునే రుణాలపై 4 శాతం వడ్డీ రాయితీ కల్పించనున్నామని, ఇందుకోసం మూడేళ్ల కాలానికి రూ.72 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. పౌల్ట్రీ రైతుల విద్యుత్ భారాన్ని తగ్గించేందుకు లోటెన్షన్ కోళ్ల ఫారాలకు యూనిట్‌కు రూ.3.75, ఫీడ్ మిక్సింగ్ యూనిట్లకు యూనిట్‌కు రూ.4.75 చొప్పున టారిఫ్‌ను క్రమబద్ధీకరించినట్లు తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసే ఎన్విరాన్‌మెంట్ కంట్రోల్డ్ (EC) పౌల్ట్రీ షెడ్లకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై 25 శాతం వరకు, గరిష్ఠంగా రూ.25 లక్షల వరకు క్యాపిటల్ సబ్సిడీ అందించనున్నాం. ఇప్పటికే ఉన్న పౌల్ట్రీ షెడ్లను ఆధునీకరించేందుకు కూడా 25 శాతం వరకు, గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు సబ్సిడీ అందించేలా ప్రతిపాదించాం. అర్హత కలిగిన EC పౌల్ట్రీ ఫారాలకు టర్మ్ లోన్లపై వడ్డీ సబ్సిడీతో పాటు విద్యుత్ చార్జీలపై యూనిట్‌కు రూ.2 వరకు, సంవత్సరానికి గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు, మూడు సంవత్సరాల పాటు విద్యుత్ టారిఫ్ సబ్సిడీ అందించనున్నాం. అలాగే నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ (NLM) కింద అర్హత కలిగిన ప్రాజెక్టులకు 50 శాతం వరకు క్యాపిటల్ సబ్సిడీ, గరిష్ఠంగా రూ.25 లక్షల వరకు అందించే అవకాశం కల్పించాం అని మంత్రి తెలిపారు.గ్రామీణ మహిళలకు ఉపాధి, అదనపు ఆదాయం కల్పించేందుకు బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీకి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా ఏటా 2,720 మదర్ పౌల్ట్రీ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. SERP, DRDAల ఆధ్వర్యంలో మహిళలకు 30-45 రోజుల శిక్షణ, వ్యాక్సినేషన్, డేఓల్డ్ చిక్స్ సరఫరా వంటి సదుపాయాలను కల్పిస్తామని చెప్పారు. పౌల్ట్రీ ఉత్పత్తులకు విలువ జోడించి మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు PPP విధానంలో ఎగ్, చికెన్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తామని, ముఖ్యంగా చిత్తూరు, విజయవాడ, విశాఖపట్నం నగరాలను కేంద్రాలుగా చేసుకుని చికెన్ ప్రాసెసింగ్ ప్లాంట్లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో పౌల్ట్రీ షెడ్ల నిర్మాణానికి గతంలో ఉన్న డెవలప్‌మెంట్, బెటర్‌మెంట్ చార్జీల నుంచి పూర్తి మినహాయింపు కల్పించి, మున్సిపాలిటీలు, అర్బన్ అథారిటీల పరిధిలో గ్రామ పంచాయతీలకు సమానమైన తక్కువ ఫీజులతో అనుమతులు పొందేలా చర్యలు చేపట్టినట్లు మంత్రి వివరించారు. ప్రస్తుతం పౌల్ట్రీ రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో మొక్కజొన్న ధరల పెరుగుదల కూడా ఒకటని పేర్కొన్న మంత్రి, ఫీడ్ వ్యయాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చించి నూక బియ్యాన్ని పౌల్ట్రీ ఫారాలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పౌల్ట్రీ రైతులు, పరిశ్రమ ప్రతినిధులు, సంబంధిత శాఖల సమన్వయంతో రాష్ట్ర పౌల్ట్రీ రంగాన్ని దేశంలోనే మరింత అభివృద్ధి చెందిన రంగంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

# నిబంధనలను పాటిద్దాం – పండుగను ఆనందంగా జరుపుకుందాం!



**– రూరల్ సీఐ వెంకటరమణ**

**రాయదుర్గం, సెప్టెంబర్ 12, ( గుమ్మగట్ట)అనంత జనశక్తి న్యూస్:**

నిబంధనలను పాటిద్దాం ప్రశాంత వాతావరణం లో వినాయక చవితి వేడుకలు జరుపుకుందామని రాయదుర్గం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటరమణ పిలుపునిచ్చారు. శనివారం పోలీస్ స్టేషన్లో మండల స్థాయి అధికారులు, వినాయక మంటపాల నిర్వాహకుల, గ్రామ పెద్దల తో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయడమైనది. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ ఐపిఎస్ ఆదేశానుసారంగా, కళ్యాణదుర్గం డిఎస్పి రవిబాబు పర్యవేక్షణలో వినాయక మండపాలు నిర్మాణంలో విధివిధానాలు పాటించి వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలన్నారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా, రహదారులకు, ఫుట్ పాత్ లకు ఇబ్బంది లేకుండా తాత్కాలిక మంటపం నిర్మాణాలు చేయాలి. మంటపం వద్ద విద్యుత్ కలెక్షన్, వైరింగ్, లైటింగ్, తదితర ఏర్పాట్లను భద్రత ప్రమాణాలకు అనుగుణంగా నిపుణుల సహాయంతో చేపట్టాలి అక్రమ విద్యుత్ కనెక్షన్ తీసుకోకూడదు. డీజేలు,లౌడ్ స్పీకర్లు ఇతర సౌండ్ సిస్టం లను ప్రభుత్వ నిబంధనలు, పోలీస్ వారి సూచనలను పాటించాలి. ఇతర మతాలు వర్గాలు లేదా వ్యక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ప్రసంగాలు, బ్యానర్లు ఉండకూడదు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, తప్పుడు వార్తలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఫార్వర్డ్ చేయకుండా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. మహిళలు, పిల్లలు, వృద్ధులు, భక్తుల కు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఊరేగింపు, నిమజ్జనం చేయు సమయాల్లో పోలీసువారి సూచనలు తప్పక పాటించాలి.మతసామరస్యం పాటించాలి. చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక చవితి వేడుకలు ప్రజలందరికీ ఆనందాన్ని కలిగించే విధంగా పరస్పర సోదర భావంతో నిర్వహించుకుని యువత, భక్తులు, ప్రజలు పూర్తిగా పోలీసుల కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశానికి డిప్యూటీ తహశీల్దార్ విజయకుమార్, సబ్ ఇన్స్పెక్టర్ చిన్న రాయుడు, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్, ఇతర సంబంధిత శాఖల అధికారులు, మండల స్థాయి నేతలు, వినాయక మంటప నిర్వహకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 90 ఏళ్ల వయసులో గుండెపోటు.. కిడ్నీ వ్యాధి ఉన్నా ప్రాణాలు కాపాడిన కిమ్స్ సవీర వైద్యులు

- తక్కువ మోతాదులో కాంట్రాస్ట్ డైతో అత్యవసర యాంజియోప్లాస్టీ
- కిమ్స్ సేవీరాలో విజయవంతంగా చికిత్స

**అనంతపురం, సెప్టెంబరు 12, అనంత జనశక్తి న్యూస్**




గుండెపోటు.. పైగా 90 ఏళ్ల వయసు.. దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి (క్రానిక్ కిడ్నీ డిసీజ్).. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ కిమ్స్ సవీరా ఆసుపత్రి వైద్యులు అత్యవసర యాంజియోప్లాస్టీ చేసి వృద్ధుడి ప్రాణాలను కాపాడారు. ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు చికిత్సనందించిన ఆసుపత్రి చీఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మూడే సందీప్ మరియు కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పర్వేజ్ నవాజ్. శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర తాలూకా అగళి ప్రాంతానికి చెందిన 90 ఏళ్ల వృద్ధుడు తీవ్ర గుండెపోటుతో ఆసుపత్రికి వచ్చారు. వయసు అధికంగా ఉండటంతోపాటు ఇప్పటికే మూత్రపిండాల పనితీరు దెబ్బతినడం చికిత్స చేయడం సవాలుగా మారింది. గుండెకు రక్తప్రసరణను వీలైనంత త్వరగా పునరుద్ధరించాల్సిన అవసరం ఉండగా.. చికిత్సలో ఉపయోగించే కాంట్రాస్ట్ డై వల్ల మూత్రపిండాలపై అదనపు భారం పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వైద్యులు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని అత్యవసర చికిత్సకు సిద్ధమయ్యారు.కార్డియాలజీ బృందం అత్యవసరంగా యాంజియోప్లాస్టీ నిర్వహించి, స్టెంట్ అమర్చింది. దీంతో గుండెకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళంలో రక్తప్రసరణ పునరుద్ధరించారు. మూత్రపిండాల వ్యాధి ఉన్న నేపథ్యంలో చికిత్సలో కాంట్రాస్ట్ డైను సాధ్యమైనంత తక్కువ పరిమాణంలోనే ఉపయోగించారు. తద్వారా మూత్రపిండాలపై అదనపు ప్రభావం పడకుండా నెఫ్రాలజీ వైద్యులు డా. బదరీనాథ్ మరియు డా. సమీర్ జాన్ సూచించిన జాగ్రత్తలు తీసుకుంటూనే.. గుండెకు అవసరమైన అత్యవసర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. చికిత్స అనంతరం వృద్ధుడి ఆరోగ్యం క్రమంగా మెరుగుపడింది. అనంతరం స్థిరమైన ఆరోగ్య పరిస్థితిలో ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. వృద్ధాప్యంలో గుండెపోటుతోపాటు ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నప్పుడు చికిత్సలో అనేక సవాళ్లు ఉంటాయని డా. నవాజ్ తెలిపారు. అయితే సరైన సమయంలో గుర్తించి, పరిస్థితికి అనుగుణంగా చికిత్సను ప్రణాళికాబద్ధంగా అందిస్తే అధిక వయసున్న వారిలోనూ ప్రాణాలను కాపాడే గుండె చికిత్సలు విజయవంతంగా నిర్వహించవచ్చని పేర్కొన్నారు ."అధిక వయసు, మూత్రపిండాల వ్యాధి వంటి సమస్యలు ఉన్న రోగులకు అత్యవసర గుండె చికిత్స అందించేటప్పుడు ఎంతో జాగ్రత్త అవసరం. ఈ రోగిలో గుండెకు రక్తప్రసరణను వీలైనంత త్వరగా పునరుద్ధరించడంతోపాటు మూత్రపిండాలపై భారం తగ్గించేలా చికిత్సను ప్రణాళిక చేశాం. తక్కువ మోతాదులో కాంట్రాస్ట్ డైను ఉపయోగిస్తూ యాంజియోప్లాస్టీని విజయవంతంగా పూర్తి చేశాం" అని తెలిపారు.చీఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మూడే సందీప్ మాట్లాడుతూ.. "కిమ్స్ సవీరా కార్డియాలజీ విభాగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, నిపుణులైన వైద్య బృందం అందుబాటులో ఉన్నాయి. సంక్లిష్ట గుండె జబ్బులకు, నిర్మాణాత్మక గుండె సమస్యలకు సంబంధించిన చికిత్సలను కూడా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నాం. అధిక వయసు, ఇతర అనారోగ్య సమస్యలు ఉన్న రోగుల్లో సకాలంలో నిర్ణయం తీసుకోవడం, నైపుణ్యంతో చికిత్స అందించడం, చికిత్స సమయంలో పూర్తి జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో కీలకం" అని అన్నారు. తీవ్రమైన గుండెపోటు లక్షణాలు కనిపించినప్పుడు ఆలస్యం చేయకుండా సమీపంలోని అత్యవసర వైద్య కేంద్రానికి తీసుకెళ్లడం ద్వారా ప్రాణాపాయాన్ని తగ్గించవచ్చని వైద్యులు సూచించారు.

# టీడీపీ కార్యకర్త కుటుంబానికి అండగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



- ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆలకుంట రాము
- 5.03లక్షల రూపాయల చెక్కును సీఎంఆర్ఎఫ్ ద్వారా అందించిన ఎమ్మెల్యే
- రాము ఇంటికి స్వయంగా వెళ్లి చెక్కు అందజేసిన ఎమ్మెల్యే
- పిల్లల్ని ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా చదివించేలా చర్యలు తీసుకుంటామన్న ఎమ్మెల్యే దగ్గుపాటి

**అనంతపురం సెప్టెంబర్ 12, అనంత జనశక్తి న్యూస్**

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అండగా నిలిచారు. నగరంలోని 41వ డివిజన్, యువజన కాలనీకి చెందిన ఆలకుంట రాము తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక టిడిపి నాయకులు ఆర్థికంగా అండగా నిలిచేందుకు సీఎంఆర్ఎఫ్(CMRF) ద్వారా దరఖాస్తు చేయించారు. ఇంతలో పరిస్థితి విషమించి రాము చనిపోయారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రత్యేకంగా చొరవ తీసుకుని సీఎంఆర్ఎఫ్ చెక్కు వచ్చేలా చేశారు. మొత్తం 5.03లక్షల రూపాయల చెక్కును స్వయంగా రాము ఇంటికి తీసుకెళ్లి.. రాము సతీమణి సంగమ్మకు అందజేశారు. ముందుగా సంగమ్మతో పాటు పిల్లలను పలుకరించారు. రాము మృతి చెందడం చాలా బాధాకరమని.. పార్టీ కోసం బాగా పని చేసేవాడన్నారు. ప్రస్తుతం సీఎంఆర్ఎఫ్ ద్వారా మీకు కొంత ఆర్థికంగా అండగా ఉండేలా చూశామని.. భవిష్యత్ లో ఏకష్టం వచ్చినా నాతో పాటు పార్టీ ఉంటుందన్నారు. పిల్లల చదువుల గురించి ఆరా తీయగా.. వారు ధర్మవరంలో చదువుతున్నట్టు చెప్పారు. ఈ విషయాన్ని ఎన్టీఆర్ ట్రస్ట్ ఛైర్మన్ నారా భువనేశ్వరి గారి దృష్టికి తీసుకెళ్లి.. ట్రస్ట్ ద్వారా చదివించేలా చూస్తామన్నారు. మీకు ఏ అవసరం ఉన్నా నేను అండగా ఉంటానని.. అధైర్య పడవద్దని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దళవాయి వెంకటనారాయణ టిడిపి నాయకులు పెద్ద మారప్ప, వడ్డే భవాని, వడ్డే వెంకటేష్, కదిరప్ప, సీనా, వెంకటరాముడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాజధాని నిర్మాణ పనుల పురోగతిపై మంత్రి నారాయణ సమీక్ష

- రాయపూడి సీఆర్‌డీఏ కార్యాలయంలో అధికారులతో సమావేశం
- ఐకానిక్ భవనాల నిర్మాణ పనులపై ప్రధానంగా చర్చ

**అమరావతి సెప్టెంబర్ 12, అనంత జనశక్తి న్యూస్**



రాజధాని అమరావతిలో కొనసాగుతున్న నిర్మాణ పనుల పురోగతిపై రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ సమీక్ష నిర్వహించారు. రాయపూడిలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమీక్షకు ఇంజినీర్ ఇన్ చీఫ్ గోపాలకృష్ణారెడ్డి, చీఫ్ ఇంజినీర్లు, వివిధ నిర్మాణ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.సమీక్షలో ప్రధానంగా అమరావ తి లో నిర్మిస్తున్న ఐకానిక్ భవనాల నిర్మాణ పనుల పురోగతిపై చర్చించారు. జీఏడీ టవర్, హెచ్‌ఓడీ టవర్లు, అసెంబ్లీ భవన నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నాయనే అంశాలను అధికారులు మంత్రికి వివరించారు.అమరావతిలోని ఐకానిక్ భవనాలకు సంబంధించి ఐదు టవర్లకు స్టీల్ డయాగ్రిడ్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని అధికా రు లు మంత్రికి వివరించారు. నిర్మాణ పనుల్లో సాధించిన పురోగతిని, ప్రస్తుతం జరుగుతున్న పనుల వివరాలను సమీక్షలో వెల్లడించారు.అసెంబ్లీ భవన నిర్మాణానికి సంబంధించి కీలకమైన స్పైర్ (ఎత్తైన శిఖరం) నిర్మాణ పనులను వారం రోజుల్లో ప్రారంభించనున్నట్లు నిర్మాణ సంస్థ ప్రతినిధులు మంత్రికి తెలిపారు. అసెంబ్లీ భవన నిర్మాణంలో స్పైర్ పనులు ప్రారంభం కానుండటంతో తదుపరి దశ నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయనున్నట్లు వివరించారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ అమరావతి రాజధాని నిర్మాణ పనులను నిర్దేశిత ప్రణాళిక ప్రకారం వేగంగా పూర్తి చేయాల ని అధికారులను, నిర్మాణ సంస్థల ప్రతినిధులను ఆదేశించారు. ఐకానిక్ భవనాల నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేసేలా పనుల్లో వేగం పెంచాలని సూచించారు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించుకోవాలని మంత్రి సూచించారు.

# జనరేటర్ ఉన్న ఉపయోగం సున్నా!

**రాయదుర్గం, సెప్టెంబర్ 12, అనంత జనశక్తి న్యూస్**

రాయదుర్గం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో జనరేటర్ సదుపాయం ఉన్న ఉపయోగం సున్నా అంటూ మండిపడుతున్న రోగులు. ఈమధ్య పట్టణంలో రాత్రివేళల్లో విద్యుత్ ఎప్పుడు ఉంటుందో ఎప్పుడు ఉండదో, ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో ఆ భగవంతునికే తెలియాలని రోగుల బంధువులు వాపోతున్నారు. కరెంటు లేని సమయంలో దోమలు విలయతాండవం చేస్తున్నాయి. రోగులకు దోమల బెడద నుండి రక్షణ కల్పించుటకు విసనకర్రలు చేతులు రుమాలతో గాలివీస్తూ చాలా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితుల్లో విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుని జనరేటర్ ను కూడా అందుబాటులో ఉంచాలని రోగులు వారి బంధువులు కోరుతున్నారు.



# ప్రతి ఇంటా మట్టి వినాయకున్నే పూజించాలి



**- పర్యావరణ పరిరక్షణ కోసం పిలుపునిచ్చిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**
**- శాప్ డైరెక్టర్ బొమ్మినేని శివ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ**
**- ఇంటింటికీ వెళ్లి మట్టి విగ్రహం, పూలమొక్కను అందజేసిన ఎమ్మెల్యే**
**- 4వేల విగ్రహాలు పంపిణీ చేసిన శివను ప్రత్యేకంగా అభినందించిన ఎమ్మెల్యే దగ్గుపాటి**

**అనంతపురం సెప్టెంబర్ 12, అనంత జనశక్తి న్యూస్**

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. శాప్ డైరెక్టర్ బొమ్మినేని శివ ఆధ్వర్యంలో 25వ డివిజన్ హౌసింగ్ బోర్డ్ లో ఆయన మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. 25వ డివిజన్ లో ఎమ్మెల్యే స్వయంగా ఇంటింటికి వెళ్లి మట్టి వినాయక విగ్రహాలను, ఒక పండ్ల మొక్కను అందజేశారు. పర్యావరణ పరిక్షణపై అవగాహన కల్పిస్తూ.. మట్టి విగ్రహాలను పూజించాలని సూచించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ వినాయక చవితి అంటే ప్రతి ఇంట, ప్రతి వాడలో ఘనంగా జరిగే భారీ పండుగ అన్నారు. అయితే చాలా మంది ఆకర్షణీయంగా ఉంటాయని ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాలను పూజించడం అలవాటుగా మార్చుకున్నారన్నారు. ఈ విగ్రహాలను నిమజ్జనం చేస్తే అక్కడ నీరు మొత్తం కలుషితమవుతుందన్నారు. ఇది పర్యావరణానికి హాని కల్గిస్తుందన్నారు. అందుకే మన సాంప్రదాయం ప్రకారం మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలన్నారు. శాప్ డైరెక్టర్ బొమ్మినేని శివ 4వేల మట్టి విగ్రహాలు పంచి పర్యావరణానికి మేలు చేస్తున్నారన్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, టిడిపి నాయకులు రాజారావు, చేపల హరి, సాకే లక్ష్మీనరసింహా, తొండపునాటి రమేష్, అర్షదుల్లా, బాలాంజనేయులు, సున్నం శ్రీనివాసులు, రంగా, మణిరవి, పుల్లన్న, నల్లాని మనోహర్, గోపాల్, జాఫర్, హరీష్ రెడ్డి టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గురువాయూరప్పను దర్శించుకున్న పవన్ కళ్యాణ్



**- వేకువజామున పవిత్ర నిర్మాల్య సేవ**
**- తైలాభిషేకం, వాకచార్థు, శంఖాభిషేకం సేవల్లో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రివర్యులు**

**కేరళం సెప్టెంబర్ 12, అనంత జనశక్తి న్యూస్**

కేరళం రాష్ట్రం, త్రిస్సూర్ జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గురువాయూర్ శ్రీ బాలకృష్ణుని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ దర్శించుకున్నారు.గురువాయూర్ ఆలయంలో అత్యంత పవిత్ర సేవగా భావించే వేకువజాము నిర్మాల్య దర్శనంలో ఆయన పాల్గొన్నారు.ముందురోజు చేసిన అలంకరణతో స్వామిని చేసుకునే తొలి దర్శనాన్ని నిర్మాల్య సేవగా పిలుస్తారు. ఈ సేవ కోసం శనివారం ఉదయం వేకువజామున 3 గంటలకు పవన్ కళ్యాణ్ గురువాయూర్ ఆలయానికి చేరుకున్నారు. దాదాపు 30 నిమిషాలపాటు ఈ విశిష్ట సేవలో పాల్గొని తరించారు.అంతకు ముందు గురువాయూర్ చేరుకున్న పవన్ కళ్యాణ్ కి ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలికారు. దక్షిణ ముఖద్వారం నుంచి ఆలయం లోపలికి ప్రవేశించిన ఆయన, స్వామి నిర్మాల్య దర్శనం చేసుకున్నారు. గర్భాలయంలో మూలవిరాట్టుకి నిర్వహించే ప్రత్యేక కైంకర్యాలు అత్యంత భక్తిశ్రద్ధలతో తిలకించారు.
స్వామి వారికి పట్టు వస్త్రాల సమర్పణ
నిర్మాల్య దర్శనానంతరం సంప్రదాయం ప్రకారం నువ్వుల నూనెతో తైలాభిషేకం చేస్తారు. శంభాభిషేకం, వాకచార్థు సేవలు నిర్వహిస్తారు.స్వామి వారికి ముందు రోజు అలంకరించిన గంధాన్ని తొలగించి అభ్యంగన స్నానం చేయించే అద్భుత సేవ గురించి ఆలయ అధికారులు పవన్ కళ్యాణ్ కి వివరించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పవన్ కళ్యాణ్ పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం నైరుతిలో ఉన్న వినాయకుడిని దర్శించుకుని, ఆలయ ఆచారాలను అనుసరిస్తూ గుడి వెనుక భాగంలో సాష్టాంగం చేశారు. తదుపరి ఆలయ ప్రాంగణంలో ఉన్న ఆంజనేయస్వామి, అనంత పద్మనాభ స్వామి, భగవతి అమ్మవార్లను దర్శించుకున్నారు.గురువాయూర్ ఆలయ ప్రదక్షిణలో శ్రీ అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం గురువాయూర్ మేల్ శాంతితోపాటు ఇతర ప్రధాన అర్చకులు పవన్ కళ్యాణ్ ని ఆశీర్వదించి, స్వామివారి కళభం, తదితర ప్రసాదాలు అందజేశారు. పవన్ కళ్యాణ్ కి ఆయుర్వేద థెరపీ చేసిన వైద్యులు ఆయనతోపాటు గురువాయూర్ శ్రీ బాలకృష్ణ స్వామి వారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

# కార్యకర్తకు కష్టం వస్తే

**- అండగా నిలిచే నాయకత్వం....**

**ధర్మవరం సెప్టెంబర్ 11 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణంలోని తారకరామాపురానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త పవన్ కళ్యాణ్ ఇటీవల జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో ఆయన కాలుకు మూడు చోట్ల ఫ్రాక్చర్ కావడంతో ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. పార్టీ కార్యకర్తకు ప్రమాదం జరిగిందన్న విషయం తెలుసుకున్న జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన రెడ్డి వెంటనే స్పందించారు. పవన్ కళ్యాణ్ ను పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. చికిత్స ఖర్చుల కోసం రూ.10,000 ఆర్థిక సహాయం అందిస్తూ ఈ కష్ట సమయంలో కుటుంబానికి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పదవులు మారవచ్చు.. పరిస్థితులు మారవచ్చు కానీ కార్యకర్తల పట్ల ఉండే అభిమానం, ఆప్యాయత మాత్రం మారదు. కార్యకర్త కష్టాల్లో ఉన్నప్పుడు పలకరించడం మాత్రమే కాదు.. అవసరమైన సమయంలో చేతనైన సాయం అందించి అండగా నిలవడమే నిజమైన నాయకత్వం. పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాం.



## తాగునీటికి ఎక్కడా సమస్య రానివ్వద్దు..

# ముందస్తు ప్రణాళికలు ఉండాలి



**- అధికారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశం**
**- ఎంపీడీఓలు, ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులతో సమీక్ష**
**- జల్ జీవన్ మిషన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్న సునీత**
**- రాబోయే రోజుల్లో పరిస్థితులు దృష్టించుకోవాలని సూచన**

**రాప్తాడు సెప్టెంబర్ 12, అనంత జనశక్తి న్యూస్**

రాప్తాడు నియోజకవర్గంలోని 6మండలాల్లో ఎక్కడా తాగునీటి సమస్య రానివ్వద్దని.. అధికారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు.అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆమె ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీవోలు, ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా ఎల్‌నినో సమస్య ఉన్న నేపథ్యంలో గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న తాగునీటి వనరులు, అలాగే ఎక్కడెక్కడ సమస్య ఉందన్నది తెలుసుకున్నారు. ఇప్పటికే తన దృష్టికి వచ్చిన ప్రాంతాల గురించి చర్చించారు. అనంతపురం రూరల్ మండలంలోని కక్కలపల్లి కాలనీ, పాపంపేట, ఆత్మకూరు మండలంలోని ఆత్మకూరు, పంపనూర్ తండా, ఇంకా రామగిరి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి, రాప్తాడు మండలాలలోని గ్రామాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి చర్చించారు. బోర్లలో నీటి మట్టం తగ్గినప్పుడు పైపులు అదనంగా దించడం, మోటార్స్ వెంటనే రిపేర్ చేయడం వంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. అనంతపురం రూరల్ మండలంలో ప్రస్తుతం జలజీవన్ మిషన్ పనులు త్వరగా పూర్తిచేస్తే రెండు నెలల్లో నీరు ఇవ్వగలుగుతామన్నారు. అక్కంపల్లి దగ్గర బోర్లను రన్ చేస్తే కక్కలపల్లి, పాపంపేటకు ఇవే నీరు సరఫరా చేయవచ్చన్నారు. ఇప్పటికే జల జీవన్ మిషన్ కింద 8 ట్యాంకులు కట్టి వాటి ద్వారా ఎస్కేయూ వరకు నీరు ఇస్తున్నామన్నారు. నరసనాయనకుంట, ఎం.బి.పల్లి, సజ్జల కాలువ ప్రాంతాల్లో పెండింగ్లో ఉన్న నీటి సమస్యను తీర్చినట్టు చెప్పారు. చియ్యేడు ఎస్సీ కాలనీ, అక్కంపల్లి, సుభాష్ కాలనీల్లో నీటి సమస్యను పరిష్కరించాలన్నారు. రాప్తాడు మండలం పాలబావి మినహా ఇంకా ఏ గ్రామాల్లోనూ నీటి సమస్య లేదని.. కాకపోతే భూగర్భ జలాలు తగ్గుముఖం పడితే.. రానున్న రోజుల్లో నీటి సమస్య వచ్చే అవకాశం ఉందన్నారు. కావున సర్ఫేస్ వాటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. చెన్నేకొత్తపల్లి మండలం పల్లెన్నగారిపల్లి, ప్రసన్నాయపేట డిపినింగ్ చేయాల్సి ఉందన్నారు. ఒంటికొండ, హరియాన్ చెరువు, న్యామద్దెల, ప్యాదిండి, సికేపల్లి, పల్లెన్నగారిపల్లిలో నీటి సరఫరా కోసం ట్యాంకర్లు అవసరం ఉంటుందన్నారు. రామగిరి మండలం కొండాపురం, మాదాపురంలో కాస్త నీరు తగ్గిందని.. గంగంపల్లి నుండి సరఫరా చేస్తున్నారన్నారు. సంపుకు కనెక్షన్ ఇవ్వడానికి పైపులు కావాలని, డీప్నింగ్ చేయాలన్నారు. నరసంపల్లి సంపుకు నీరు నింపితే రామగిరి మండలంలోని 12 గ్రామాలు, కనగానపల్లి మండలంలో 22 గ్రామాలకి నీటి సరఫరా చేయవచ్చన్నారు. వీటికి అంచనాలు తయారు చేయవలసిందిగా ఆదేశించారు. ఆత్మకూరు మండలంలోని పంపనూరు తాండాకు సరఫరా చేసే మోటారు కెనాల్ లో ఉందని.. దాని మరమ్మతుకు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడాలన్నారు. సత్యసాయి నీటి సరఫరా కొనసాగితే ఆత్మకూరులో ఎటువంటి సమస్యలు ఉండవన్నారు. మరోవైపు నూతన పింఛన్ల కోసం దరఖాస్తుల గురించి కూడా చర్చించారు. పింఛన్ల విషయంలో తహసిల్దార్ కార్యాలయంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఒంటరి మహిళ సర్టిఫికెట్లు, ఇతర ధృవ పత్రాలకు సంతకాలు ఆలస్యం కాకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన అందరూ దరఖాస్తు చేసుకునేలా చూడాలని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు...

# పౌల్ట్రీ రైతుల సంక్షేమానికి పెద్దపీట



**- రూ.657 కోట్ల ప్యాకేజీతో రంగం బలోపేతం.. పాలసీని వేగంగా అమలు చేస్తాం**
**- ఏటా 2,720 మదర్ పౌల్ట్రీ యూనిట్లు**
**- ఆధునిక పౌల్ట్రీ ఫారాలకు భారీ ప్రోత్సాహకాలు**
**- మొక్కజొన్న ధరల నియంత్రణకు ప్రత్యామ్నాయాలపై దృష్టి**
**- పౌల్ట్రీ అసోసియేషన్ సభ్యులతో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**అమరావతి, సెప్టెంబర్ 12:అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్రంలో పౌల్ట్రీ రంగాన్ని మరింత బలోపేతం చేసి, పౌల్ట్రీ రైతులకు అండగా నిలిచేందుకు ఏపీ పౌల్ట్రీ డెవలప్మెంట్ పాలసీ 2026-29కు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. పాలసీకి ఆమోదం తెలిపిన సందర్భంగా పౌల్ట్రీ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం విజయవాడలోని కార్యాలయంలో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పాలసీని త్వరితగతిన అమల్లోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో పౌల్ట్రీ రంగానికి నూతన ఊతం అందించడంతో పాటు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం, ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించడం, పెట్టుబడులను ఆకర్షించడం, ఉత్పాదకతను పెంచడం, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం లక్ష్యంగా పాలసీని రూపొందించినట్లు తెలిపారు. పౌల్ట్రీ రంగ అభివృద్ధికి ప్రభుత్వం రూ.657 కోట్ల భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించిందని వివరించారు. ఇందులో ఫుడ్ ప్రాసెసింగ్‌కు సంబంధించిన ప్రోత్సాహకాల కోసం రూ.209 కోట్లు, ఇండస్ట్రియల్ పాలసీ కింద రూ.152.18 కోట్లు, పశుసంవర్ధక శాఖ ద్వారా అమలు చేయనున్న కార్యక్రమాలకు రూ.296 కోట్లు కేటాయించనున్నారు. కోళ్ల ఫారాలు, హేచరీల మౌలిక వసతుల అభివృద్ధికి తీసుకునే రుణాలపై 4 శాతం వడ్డీ రాయితీ కల్పించనున్నామని, ఇందుకోసం మూడేళ్ల కాలానికి రూ.72 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. పౌల్ట్రీ రైతుల విద్యుత్ భారాన్ని తగ్గించేందుకు లోటెన్షన్ కోళ్ల ఫారాలకు యూనిట్‌కు రూ.3.75, ఫీడ్ మిక్సింగ్ యూనిట్లకు యూనిట్‌కు రూ.4.75 చొప్పున టారిఫ్‌ను క్రమబద్ధీకరించినట్లు తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసే ఎన్విరాన్‌మెంట్ కంట్రోల్డ్ (EC) పౌల్ట్రీ షెడ్లకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై 25 శాతం వరకు, గరిష్ఠంగా రూ.25 లక్షల వరకు క్యాపిటల్ సబ్సిడీ అందించనున్నాం. ఇప్పటికే ఉన్న పౌల్ట్రీ షెడ్లను ఆధునీకరించేందుకు కూడా 25 శాతం వరకు, గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు సబ్సిడీ అందించేలా ప్రతిపాదించాం. అర్హత కలిగిన ఈసీ పౌల్ట్రీ ఫారాలకు టర్మ్ లోన్లపై వడ్డీ సబ్సిడీతో పాటు విద్యుత్ చార్జీలపై యూనిట్‌కు రూ.2 వరకు, సంవత్సరానికి గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు, మూడు సంవత్సరాల పాటు విద్యుత్ టారిఫ్ సబ్సిడీ అందించనున్నాం. అలాగే నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ (NLM) కింద అర్హత కలిగిన ప్రాజెక్టులకు 50 శాతం వరకు క్యాపిటల్ సబ్సిడీ, గరిష్ఠంగా రూ.25 లక్షల వరకు అందించే అవకాశం కల్పించాం అని మంత్రి తెలిపారు.గ్రామీణ మహిళలకు ఉపాధి, అదనపు ఆదాయం కల్పించేందుకు బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీకి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా ఏటా 2,720 మదర్ పౌల్ట్రీ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సెర్ప్, డి ఆర్ డి ఏ ల ఆధ్వర్యంలో మహిళలకు 30-45 రోజుల శిక్షణ, వ్యాక్సినేషన్, డేఓల్డ్ చిక్స్ సరఫరా వంటి సదుపాయాలను కల్పిస్తామని చెప్పారు. పౌల్ట్రీ ఉత్పత్తులకు విలువ జోడించి మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు పీపీపీ విధానంలో ఎగ్, చికెన్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తామని, ముఖ్యంగా చిత్తూరు, విజయవాడ, విశాఖపట్నం నగరాలను కేంద్రాలుగా చేసుకుని చికెన్ ప్రాసెసింగ్ ప్లాంట్లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో పౌల్ట్రీ షెడ్ల నిర్మాణానికి గతంలో ఉన్న డెవలప్‌మెంట్, బెటర్‌మెంట్ చార్జీల నుంచి పూర్తి మినహాయింపు కల్పించి, మున్సిపాలిటీలు, అర్బన్ అథారిటీల పరిధిలో గ్రామ పంచాయతీలకు సమానమైన తక్కువ ఫీజులతో అనుమతులు పొందేలా చర్యలు చేపట్టినట్లు మంత్రి వివరించారు. ప్రస్తుతం పౌల్ట్రీ రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో మొక్కజొన్న ధరల పెరుగుదల కూడా ఒకటని పేర్కొన్న మంత్రి, ఫీడ్ వ్యయాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చించి నూక బియ్యాన్ని పౌల్ట్రీ ఫారాలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పౌల్ట్రీ రైతులు, పరిశ్రమ ప్రతినిధులు, సంబంధిత శాఖల సమన్వయంతో రాష్ట్ర పౌల్ట్రీ రంగాన్ని దేశంలోనే మరింత అభివృద్ధి చెందిన రంగంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

# గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్, సింగిల్ విండో అనుమతులపై కృతజ్ఞతలు




**- ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను కలిసిన ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు**

**కదిరి సెప్టెంబర్ 12, అనంత జనశక్తి న్యూస్**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు, సింగిల్ విండో విధానం ద్వారా అనుమతుల ప్రక్రియను సులభతరం చేసిన కూటమి ప్రభుత్వానికి, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కి ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ మేరకు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ నివాసంలో ఆయనను ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ కల్పించడం, సింగిల్ విండో ద్వారా అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడం పట్ల ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలియజేశారు.గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు వివిధ ప్రభుత్వ శాఖలు ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితితో సమన్వయం చేసుకుని, నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సహకారం అందించాలని ప్రతినిధులు కోరారు.అదేవిధంగా రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు, ప్రజలకు మేలు కలగాలని ఆకాంక్షిస్తూ గణేష్ మండపాల్లో ప్రతిరోజూ రెండుపూటలా పూజల అనంతరం నిర్వహించాల్సిన వరుణ జపానికి సంబంధించిన సంకల్పం, బీజాక్షర మంత్రంతో కూడిన కరపత్రాన్ని ఎమ్మెల్యే కి అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ, వినాయక చవితి ఉత్సవాలు ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఉత్సవాల నిర్వహణలో భక్తులు, నిర్వాహకులు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ సహకరించాలని కోరారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు పుష్కలంగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వినాయక స్వామిని ప్రార్థిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# ధ్వజస్తంభ, ప్రధాన కలశ స్థాపన మహోత్సవంలో జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్

**అనంతపురం, సెప్టెంబర్ 12 :అనంత జనశక్తి న్యూస్**



అనంతపురం నగరంలోని కృష్ణ కళామందిరంలో ఉన్న శ్రీశ్రీశ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ ధ్వజస్తంభ, ప్రధాన కలశ స్థాపన మహోత్సవం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, డిఆర్ఓ ఏ.మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంత రెవెన్యూ ఉద్యోగుల క్రెడిట్ సహకార సొసైటీ, ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ ఉద్యోగుల సేవా సంఘం, అనంత రెవెన్యూ ఉద్యోగుల క్రీడలు & సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆలయ ధ్వజస్తంభ, ప్రధాన కలశ స్థాపన మహోత్సవంలో భాగంగా మొదటిరోజు శ్రీ గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహాది దేవతల కలశస్థాపన, మూలవిరాట్టు పూజ, ధ్వజస్తంభ ఆవాహన పూజ, ప్రధాన పూజా, మంగళహారతి నిర్వహించగా, ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, డీఆర్ఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

# మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటుదాం...!!

- ప్రతి వార్డులో తెదేపా జెండా ఎగరాలి.
- పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో ధర్మవరం పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందాం.
- పట్టణ 10వ కస్టర్ సమావేశంలో తెదేపా నేతలు.




**ధర్మవరం సెప్టెంబర్ 12, అనంత జనశక్తి న్యూస్:**

మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రతి వార్డులో తెదేపా జెండా ఎగరాలని తెలుగుదేశం పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ సూచనలను అనుసరించి ధర్మవరం పట్టణం పదవ కస్టర్ సమావేశం ఎర్రగుంట సర్కిల్లో గల తెదేపా కార్యాలయంలో నిర్వహించారు. నూతనంగా పదవ క్లస్టర్ క్రింద వచ్చే వార్డులు అయిన 15,21,22,23,26,27, 29,30,31,32 వార్డు నాయకులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య మాట్లాడుతూ..... రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో యువ నాయకుడు నారా లోకేష్ ఆధ్వర్యంలో అదేవిధంగా ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ యువ నాయకత్వంలో వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో విజయఢంకా మోగించాలని,గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేసే ప్రతి వార్డులను తెదేపా జెండా ఎగురవేయాలని,ఏ ఒక్కరూ భేషజాలాల కు వెళ్లకుండా ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు.పట్టణ తెదేపా అధ్యక్షుడు పరిశే సుధాకర్ మాట్లాడుతూ....,ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి ఓటర్లకు వివరించి మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు.అదే విధంగా క్లస్టర్ కన్వీనర్ పురుషోత్తం గౌడ్ కో కన్వీనర్ మాధవరెడ్డి లు మాట్లాడుతూ... ప్రతి వార్డులో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలతో మమేకమై వార్డులో సమస్యలను గుర్తించి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని, వార్డులలో కౌన్సిలర్ గా పోటీ చేసే అభ్యర్థిత్వాన్ని పరిటాల శ్రీరామ్ ఎంపిక చేస్తారని, ఎన్డీఏ కూటమిలో ఉన్న దృష్ట్యా కొన్ని చోట్ల నాయకులు కొన్ని వార్డులను త్యాగాలు చేయవలసి ఉంటుందని దయచేసి ప్రతి ఒక్కరూ,పార్టీ అధిష్టానానికి అనుగుణంగా పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో పనిచేయాలని సూచించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా ప్రతి ఒక్కరూ ప్రజాక్షేత్రంలోనే ఉండాలని ప్రజల అవసరాలను తక్షణమే గుర్తించి పరిష్కరించే విధంగా నాయకులు కార్యకర్తలు ముందుకు వెళ్లాలని ఈ సందర్భంగా తెదేపా నాయకులు వార్డులలో గల నాయకులకు కార్యకర్తలకు సూచించారు.

# గుంతకల్లు ఏరియా ఆసుపత్రిలో ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లేబొరేటరీ ప్రారంభం

- కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, తదితరులు..

**అనంతపురం, సెప్టెంబర్ 12 :**

**అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్ర వ్యాప్తంగా 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటరీలను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా వర్చువల్ గా ప్రారంభించారు. విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళా వేదికలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి క్రిటికల్ కేర్ బ్లాకులు, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటరీలను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ప్రారంభించారు. రూ.249 కోట్ల వ్యయంతో 22 ప్రాజెక్టులను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఇందులోభాగంగా ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద గుంతకల్లు పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ప్రయోగశాలను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి సమక్షంలో వర్చువల్‌గా ప్రారంభించారు. శనివారం గుంతకల్లు పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లేబొరేటరీని వర్చువల్ విధానంలో ప్రారంభించిన కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, తదితరులు. పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐ.పీ.హెచ్.ఎల్ అందుబాటులోకి రావడం గుంతకల్లుతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో ప్రయోజనకరం అని అన్నారు. వివిధ రకాల వైద్య పరీక్షలను స్థానికంగానే నిర్వహించుకునే అవకాశం కలగడంతో వ్యాధులను సకాలంలో గుర్తించడం, సరైన చికిత్స అందించడం మరింత సులభతరం కానుందన్నారు. ముఖ్యమైన వైద్య పరీక్షల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో ప్రజలకు సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా అవుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి గుంతకల్లు ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు ఈ సౌకర్యం మరింత మెరుగైన వైద్య సేవలను



అందించడంలో కీలకంగా నిలుస్తుందన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గుంతకల్లు నియోజకవర్గంలో ఆరోగ్య మౌలిక వసతులను మరింత బలోపేతం చేసేందుకు నా వంతు కృషి కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డా.ఈ.వెంకటరావు, ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా.ఆర్.అజేంద్రరావు, ఆర్ఎంఓ డా. జయవర్ధన్ రెడ్డి, వైద్యులు, సీనియర్ రెసిడెంట్ వైద్యులు మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి
- బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరితో కలిసి ఆధునిక వైద్య పరికరాలను ప్రారంభించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి.



**బనగానపల్లె సెప్టెంబర్ 12, అనంత జనశక్తి న్యూస్**

బనగానపల్లె ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రూ.1.25 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లాబొరేటరీ (ఐపీహెచ్ఎల్)తో పాటు, అదానీ ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధులు రూ.1.57 కోట్లతో సమకూర్చిన ఆధునిక వైద్య పరికరాలను నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరితో కలిసి రోడ్లు & భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ప్రారంభించారు.అనంతరం మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, బనగానపల్లె నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు వైద్య పరీక్షలు, చికిత్సల కోసం జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.ఐపీహెచ్ఎల్ అందుబాటులోకి రావడంతో వివిధ రకాల వైద్య పరీక్షలను మరింత సమర్థవంతంగా నిర్వహించే అవకాశం కలుగుతుందని, అత్యాధునిక వైద్య పరికరాల వినియోగంతో రోగులకు వైద్య పరీక్షలు, చికిత్స మరింత సులభతరం కానున్నాయని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే మెరుగైన వైద్యం అందించాలన్నదే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి అవసరమైన ఆధునిక వైద్య పరికరాలు సమకూర్చేందుకు అదానీ ఫౌండేషన్ చైర్మన్‌కు రూ.3 కోట్ల సీఎస్ఆర్ నిధులు మంజూరు చేయాలని తాను రాసిన లేఖకు స్పందిస్తూ మొదటి విడతగా రూ.1.57 కోట్ల విలువైన అత్యాధునిక వైద్య పరికరాలను అందించారని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన ఆధునిక వైద్య పరికరాల ద్వారా ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య పరీక్షలు, మెరుగైన చికిత్స అందించే అవకాశం ఏర్పడిందని పేర్కొన్నారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల నాణ్యతను పెంచేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం నిరంతరం చర్యలు చేపడుతోందన్నారు.మా విజ్ఞప్తికి వెంటనే స్పందించి సి ఎస్ ఆర్ నిధులు మంజూరు చేసి, విలువైన వైద్య పరికరాలను అందించిన అదానీ గ్రూప్ ఫౌండేషన్ చైర్మన్‌కు, సంస్థ ప్రతినిధులకు వైద్యులు, బనగానపల్లె నియోజకవర్గ ప్రజల తరఫున మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో అంకితభావంతో పనిచేసే వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారని, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బనగానపల్లె ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉమాదేవి, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారుల హక్కుల పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

- 16వ జాతీయ వినియోగదారుల సదస్సులో శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

**పుట్టపర్తి, సెప్టెంబర్ 12:**

వస్తువుల ప్రత్యక్ష కొనుగోలు నుంచి ఆన్‌లైన్ సేవల వరకు వినియోగదారులకు సంపూర్ణ అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని, వినియోగదారుల హక్కుల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు.

పుట్టపర్తిలోని సాయి ఆరామం కాన్ఫరెన్స్ హాల్‌లో 16వ జాతీయ వినియోగదారుల అవగాహన సదస్సు, మహాసభలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ (CAPCO), కన్స్యూమర్ కోఆర్డినేషన్ కౌన్సిల్ (CCC), న్యూఢిల్లీ సంయుక్త ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆహార, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ సహకారంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు.

సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినియోగదారులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి "ఒకే సంస్థ – ఒకే గళం" అనే భావనతో విధానపరమైన నిర్ణయాల్లో వినియోగదారుల హక్కులను బలంగా వినిపించాలనే లక్ష్యంతో 1990లో CCC ఆవిర్భవించడం వినియోగదారుల ఉద్యమంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా అభివర్ణించారు. శ్రీ సత్యసాయి జిల్లాలో వినియోగదారులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై మరింత అవగాహన కల్పించేందుకు వివిధ శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి

సభాధ్యక్షులు, CAPCO/CCC చైర్మన్ శ్రీ జి. సురేష్ కుమార్ మాట్లాడుతూ, వినియోగదారులు తమ హక్కులపై అవగాహన పెంచుకుని "ప్రశ్నించే తత్వాన్ని" అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

శ్రీ సత్యసాయి నడయాడిన పవిత్ర పుట్టపర్తి నేలపై జాతీయ స్థాయిలో వినియోగదారుల ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. సదస్సుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్న ప్రభుత్వ యంత్రాంగానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సదస్సులో CCC జాతీయ చైర్మన్ శ్రీ అభిషేక్ శ్రీవాస్తవ, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ డైరెక్టర్ శ్రీమతి ప్రేమ సంజని పట్నాల, ప్రొఫెసర్ అనిల్ జవహరి, CAPCO గౌరవ చైర్మన్ శ్రీ నాగేశ్వరరావు, CCC వ్యవస్థాపకులు శ్రీ ఎం. కృష్ణారెడ్డి, మాజీ చైర్మన్ శ్రీ షాజీ, హైకోర్టు అడ్వకేట్ శ్రీ సునీల్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

CCC 35 ఏళ్ల ప్రస్థానం

CCC ఆవిర్భవించి 35 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అతిథులు ప్రత్యేక పోస్టర్‌ను ఆవిష్కరించారు. వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారంలో డిజిటల్ విధానాలు, ఆన్‌లైన్ న్యాయ ప్రక్రియలు కీలకంగా మారుతున్నాయని వక్తలు పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో వినియోగదారుల చైతన్యం, MRP అమలు, ఆహార భద్రత, సురక్షిత డిజిటల్ లావాదేవీలపై గత 15 సంవత్సరాలుగా CAPCO అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తోందని తెలిపారు.

కొత్త సాంకేతిక సవాళ్లపై చర్చ

ప్రస్తుత ఆధునిక కాలంలో వినియోగదారులు కేవలం ధర, నాణ్యత సమస్యలకే పరిమితం కాకుండా ఈకామర్స్, ఆన్‌లైన్ మోసాలు, తప్పుడు ప్రకటనలు, డేటా రక్షణ, కృత్రిమ మేధస్సు (AI), డిజిటల్ చెల్లింపులు, ఫైనాన్షియల్ సర్వీసెస్ వంటి అనేక కొత్త సవాళ్లను ఎదుర్కొంటున్నారని CCC ప్రతినిధులు తెలిపారు.

రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న సదస్సులో ప్రధానంగా:

డిజిటల్, ఆర్థిక రంగాల్లో వినియోగదారుల అవగాహన పెంపు

ఆహార, ఆరోగ్య భద్రతను మెరుగుపరచడం

యువతను వినియోగదారుల ఉద్యమంలో భాగస్వాములను చేయడం

ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత సులభతరం చేయడం

భవిష్యత్ జాతీయ వినియోగదారుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం

వంటి అంశాలపై చర్చలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

"సమస్యలపై వ్యక్తిగతంగా పోరాడటం కంటే... ఉమ్మడి కార్యాచరణతోనే వినియోగదారుల హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుంది" అనే సందేశంతో జాతీయ స్థాయిలో వినియోగదారుల సంఘాలను మరింత బలోపేతం చేయాలని సదస్సు పిలుపునిచ్చింది.మధ్యాహ్నం నిర్వహించిన ప్రత్యేక వినియోగదారుల అవగాహన కార్యక్రమంలో సిసి సి ప్రతినిధులు రామ్ అవతార్, అమృత్ లాల్ షాహ్, భైక లక్ష్మి, పవన్ గోయల్, నాగార్జున, విజయలక్ష్మి, మిశ్రా తదితరులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.పది రాష్ట్రాల నుంచి సిసిసి ప్రతినిధులు హాజరై జాతీయ స్థాయిలో వినియోగదారుల ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

# స్వర్గీయ తోపుదుర్తి భాస్కర్ రెడ్డి కి ఘన నివాళి



- ప్రథమ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన....
- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి......

**ధర్మవరం సెప్టెంబర్ 12 అనంత జనశక్తి న్యూస్ :**

తోపుదుర్తి గ్రామంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, స్వర్గీయ తోపుదుర్తి భాస్కర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి తోటలోని ఘాట్ వద్ద ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి భాస్కర్ రెడ్డి సమాధి వద్ద పుష్పాంజలి ఘటించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. ప్రజలతో మమేకమై, పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన భాస్కర్ రెడ్డి సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆయన భౌతికంగా దూరమైనా ప్రజలతో ఆయనకు ఉన్న అనుబంధం, చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని కేతిరెడ్డి పేర్కొన్నారు.

# ప్రతి జిల్లా కేంద్రంలో పూలే, అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేయాలి



- రాష్ట్ర ప్రభుత్వంకు బహుజన ఉద్యోగుల న్యాయ భేరి డిమాండ్

**ధర్మవరం సెప్టెంబర్ 12, అనంత జనశక్తి న్యూస్:**

సత్యసాయి జిల్లా బహుజన ఉద్యోగుల న్యాయభేరి సభ ధర్మవరం నియోజకవర్గ కేంద్రంలో ఎన్జీహోం నందు జిల్లా రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు నారాయణ స్వామి ఆధ్వర్యంలో జరిగిన సభ లో ముఖ్య అతిథులుగా డాక్టర్ పోతుల నాగరాజు మాట్లాడుతూ..... ప్రభుత్వాలు రాజ్యాంగ పరిరక్షణ కోసం పని చేయాలని, రిజర్వేషన్ల పరిరక్షణ కోసం ప్రభుత్వ రంగ సంస్థ లను కాపాడుకోవాలని, చట్ట సభ లలో బీసీ లకు 44%రిజర్వేషన్ల కోసం పార్లమెంట్ లో చట్టం చేయాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, టైమ్ స్కేల్ ఉద్యోగుల ను రెగ్యులర్ చేయాలని, ప్రయివేట్ కార్పొరేట్ ఉద్యోగాలలో రిజర్వేషన్ అమలు చేయాలని, న్యాయ వ్యవస్థ లో రిజర్వేషన్ అమలు చేయాలని, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, ప్రభుత్వ రంగాలలో ఖాళీ గా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని ప్రభుత్వం ను డిమాండ్ చేస్తూ, ఆంధ్రప్రదేశ్ లో ప్రతి జిల్లా కేంద్రంలో మహాత్మా జ్యోతి రావ్ పూలే, డాక్టర్ అంబేద్కర్ విగ్రహలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వం ఏర్పాటు చేయక పోతే రిజర్వేషన్ వర్గాల ఐక్యత కోసం ఈ విగ్రహాల ఏర్పాటు ఉపయోగ పడుతుంది అని ఆది ముందుగా సత్యసాయి జిల్లా కేంద్రం లో ఏర్పాటు చేయడం జరుగుతుంది అని సభ తీర్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు నాగభూషణం, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ నారాయణ నాయక్, బీసీ మహిళ అధ్యక్షురాలు జయశ్రీ బిసి ఉద్యోగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా నాగరాజు విశ్వవిద్యాలయాల రాష్ట్ర కన్వీనర్ సి చింతన్న ఆర్ పి ఎస్ యువత అధ్యక్షులు పెరుగు శివకృష్ణ రాష్ట్ర నాయకులు జి శ్రీనివాసులు శ్రీరాములు, బాల రామ్మోహన్ ఆదినారాయణ, రామచంద్ర, కమ్మన్న, బి రమేష్, బాబు, బాలు నాయక్, శ్రీనివాసులు, కిష్టప్ప, నాగేష్, మురళి, బండారు మల్లికార్జున, ఎం. నరేష్ ,బాలాజీ నాయక్, అనంతపురం జిల్లా అధ్యక్షులు రాజా రమేష్, హరి, మురళి, తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 21 వరకు ఎక్సైజ్ షాపుల రెన్యూవల్

- 3,736 మద్యం షాపుల రెన్యూవల్‌కు షెడ్యూల్ ఖరారు
- సెప్టెంబర్ 30న రెన్యూవల్ కాని షాపులకు లాటరీ

**అమరావతి, సెప్టెంబర్ 12:**

**అనంత జనశక్తి న్యూస్**



రాష్ట్రంలోని 3,736 రిటైల్ మద్యం షాపుల రెన్యూవల్‌కు ప్రభుత్వం షెడ్యూల్ ఖరారు చేసింది. శనివారం నుంచి సెప్టెంబర్ 21 వరకు ఆరు పనిదినాల్లో ప్రస్తుత లైసెన్స్‌దారుల నుంచి రెన్యూవల్ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎక్సైజ్ కమిషనర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. సెప్టెంబర్ 22న కొత్త దరఖాస్తులకు గెజిట్ నోటిఫికేషన్ ప్రచురించి, అదే రోజు నుంచి సెప్టెంబర్ 29 వరకు ఏడు పనిదినాల్లో కొత్త దరఖాస్తులు స్వీకరిస్తారు. సెప్టెంబర్ 30న లాటరీ నిర్వహించనున్నారు. రెన్యూవల్‌కు సంబంధించిన గెజిట్ నంబర్లను సంబంధిత కలెక్టరేట్ల నుంచి ఎక్సైజ్ శాఖ ఇప్పటికే తీసుకుంది. శనివారం రెన్యూవల్‌కు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రచురించారు. మరో ఏడాది పాటు షాపులను కొనసాగించాలనుకునే ప్రస్తుత లైసెన్స్‌దారులు నిర్ణీత గడువులో రెన్యూవల్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.2026 అక్టోబర్ 1 నుంచి 2027 సెప్టెంబర్ 30 వరకు రాష్ట్రంలో మొత్తం 3,736 రిటైల్ మద్యం షాపులు కొనసాగనున్నాయి. వీటిలో 3,396 షాపులు ఓపెన్ కేటగిరీలో, 340 షాపులు గీత కులాలకు రిజర్వ్ చేశారు.ప్రస్తుత లైసెన్స్‌దారులు రెన్యూవల్‌కు దరఖాస్తు చేసుకోని షాపులు లేదా ఇతర కారణాలతో రెన్యూవల్ కాని షాపులను లాటరీ ద్వారా కొత్తగా కేటాయించనున్నారు. కొత్త షాపులకు దరఖాస్తు చేసుకునే వారు రూ.1,000 ప్రాసెసింగ్ ఫీజు, రూ. మూడు లక్షలు తిరిగి చెల్లించని దరఖాస్తు రుసుము జమ చేయవలసి ఉంది.

లాటరీ నిర్వహించేందుకు కనీసం నాలుగు దరఖాస్తులు అవసరం అవుతాయని కమీషనర్ శ్రీధర్ పేర్కొన్నారు.

## పండుగ ఎంత ముఖ్యమో.. పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యం



- వినాయక చవితి సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత
- మిడుతూరు హరీష్ రెడ్డి ఆధ్వర్యంలో వెయ్యి మట్టి విగ్రహాల పంపిణీ
- వినాయక చవితి పూజల్లో మట్టి విగ్రహాలు మాత్రమే ఉండాలన్న సునీత

**రాప్తాడు సెప్టెంబర్ 12, అనంత జనశక్తి న్యూస్**

మన సాంప్రదాయాల ప్రకారం పండుగలు ఎంత ముఖ్యమో.. జన జీవనానికి పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. వినాయక చవితి సందర్భంగా ఆమె పాపంపేటలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. టీడీపీ నేత మిడుతూరు హరీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పాపంపేట వాసులకు వెయ్యి వినాయక విగ్రహాలను అందజేస్తూ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. పర్యావరణం బాగుండాలన్న మంచి ఉద్దేశ్యంతో మిడుతూరు హరీష్ పాపంపేటలో వెయ్యి మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా అందజేయడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో మీ పరిసర ప్రాంతాల్లో మట్టి విగ్రహాలను పూజించేలా అవగాహన కల్పించాలన్నారు. అసలే నీటి వనరులు తక్కువగా ఉన్న మన జిల్లాలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నీటిలో వేయడం వలన తీవ్రమైన కాలుష్యం జరుగుతుందన్నారు. ఇది పర్యావరణానికి ఎంతో హాణి కలిగేలా చేస్తుందన్నారు. మన సంస్కృతి సాంప్రదాయం ప్రకారం మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసి గరికతో పూజలు చేయాలన్నారు. ప్రజలంతా దీనిని గుర్తించాలని ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి చేశారు...

## బొర్రపాలెంలో పోషణ మాసం కార్యక్రమం



**అనంతగిరి, సెప్టెంబర్ 12:అనంత జనశక్తి న్యూస్**

అనంతగిరి మండలం పరిధిలో గల పినకోట పంచాయతీ,బొర్రపాలెం అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్త కె.గౌరమ్మ ఆధ్వర్యంలో చిన్నారులు,గర్భిణులు, బాలింతలకు సమతుల్య ఆహారం, పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. రోజువారీ ఆహారంలో ఉప్పు, నూనె, చక్కెరను పరిమితంగా వినియోగించాలని సూచించారు. చిరుధాన్యాలు, పప్పులు, ఆకుకూరలు, కూరగాయలు వంటి స్థానిక పోషకాహారాన్ని తీసుకోవాలని తెలిపారు. టి హెచ్ ఆర్ , హెచ్ సి ఎం మెనూతో పాటు స్థానిక ఆహార పదార్థాలతో తయారు చేసిన వంటకాలను ప్రదర్శించారు.పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించి, చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పెంపొందించడమే పోషణ మాసం లక్ష్యమని గౌరమ్మ తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త గౌరమ్మ ఆయా,వసుందర,ఆశ వర్కర్,జమ్ములమ్మ,ఘర్భిణీస్త్రీలు, బాలింతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## డివిజన్ ఎక్సలెన్స్ అవార్డు, అందుకున్న, ఎన్ నరహరి రావు




**అమడగూరు సెప్టెంబర్ 11,అనంత జనశక్తి న్యూస్**

అమడగూరు మండలంలో తపాలా కార్యాలయంలో పనిచేస్తున్నటువంటి ఎస్ పి ఎం, హరి స్వామి అమడగూరు, మండలం నుంచి పోస్టు మాస్టర్ జీఎస్ఎల్ ( కర్నూల్ రీజియన్ ) చేతుల మీదుగా డివిజన్ ఎక్సెలెన్స్ అవార్డు ను, అమడగూరు మరియు తుమ్మల బిపిఎం,ఎన్ నరహరి రావు ఎస్ పి ఎం, ఎం తిరుపాల్ నాయక్, అవార్డులు అందుకోవడం జరిగింది ఈ సందర్భంగా హరి స్వామి మాట్లాడుతూ ఇప్పటికీ నేను, 3 అవార్డులు అందుకున్నట్లు హర్షం వ్యక్తం చేశారు అవార్డులు వచ్చినందుకు పోస్ట్ ఆఫీస్ సిబ్బంది గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరు అభినందనలు తెలియజేశారు హరి స్వామి ఇలాంటి అవార్డులో మరెన్నో అందుకోవాలని అభినందనలు తెలియజేశారు

## యువతకు ఏఐ స్కిల్స్‌పై శిక్షణ

- 18 నుంచి 28 ఏళ్ల యువత దరఖాస్తు చేసుకోవాలి

**అనంతగిరి సెప్టెంబర్12: అనంత జనశక్తి న్యూస్**

ఐటీడీఏ పాడేరు ఆధ్వర్యంలో 18 నుంచి 28 సంవత్సరాల వయస్సు గల యువతకు కృత్రిమ మేధస్సు నైపుణ్యాలుపై శిక్షణ అందించనున్నట్లు పినకోట పంచాయతీ అభివృద్ధి అధికారి సతీష్ తెలిపారు.పినకోట పంచాయతీ పరిధిలోని 24 గ్రామాలకు చెందిన అర్హులైన యువత ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 18 చివరి తేదీగా తెలిపారు.దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 20న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.స్క్రీనింగ్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులను ఎంపిక చేసి తదుపరి ఏఐ స్కిల్స్ శిక్షణ అందిస్తామని పంచాయతీ అభివృద్ధి అధికారి సతీష్ వెల్లడించారు.అర్హులైన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.




# వినియోగదారుల హక్కుల పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

- ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి: జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

**పుట్టపర్తి, సెప్టెంబర్ 12:అనంత జనశక్తి న్యూస్**




వస్తువుల కొనుగోలు నుంచి ఆన్‌లైన్ సేవల వరకు వినియోగదారులకు సంపూర్ణ అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని, వినియోగదారుల హక్కుల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు.పుట్టపర్తిలోని సాయి ఆరామం సమావేశ మందిరంలో శనివారం 16వ జాతీయ వినియోగదారుల అవగాహన సదస్సు, మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల సంఘాల సమాఖ్య, న్యూఢిల్లీ వినియోగదారుల సమన్వయ మండలి సంయుక్త ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆహార, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ సహకారంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు.సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వినియోగదారులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై మరింత అవగాహన కల్పించేందుకు వివిధ శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

**హక్కులపై అవగాహన అవసరం**

సభాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల సంఘాల సమాఖ్య, వినియోగదారుల సమన్వయ మండలి చైర్మన్ జి. సురేష్ కుమార్ మాట్లాడుతూ వినియోగదారులు తమ హక్కులపై అవగాహన పెంచుకుని ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. శ్రీ సత్యసాయి నడయాడిన పవిత్ర పుట్టపర్తి నేలపై జాతీయ స్థాయిలో వినియోగదారుల ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. వినియోగదారులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఒకే సంస్థ, ఒకే గళం అనే భావనతో విధానపరమైన నిర్ణయాల్లో వినియోగదారుల హక్కులను బలంగా వినిపించాలనే లక్ష్యంతో 1990లో వినియోగదారుల సమన్వయ మండలి ఏర్పడిందని తెలిపారు.

**కొత్త సవాళ్లపై చర్చ**

ప్రస్తుత ఆధునిక కాలంలో వినియోగదారులు ధర, నాణ్యత సమస్యలతో పాటు ఆన్‌లైన్ కొనుగోళ్లు, మోసాలు, తప్పుడు ప్రకటనలు, సమాచార భద్రత, కృత్రిమ మేధస్సు, నగదు రహిత చెల్లింపులు, ఆర్థిక సేవలు వంటి అనేక కొత్త సవాళ్లను ఎదుర్కొంటున్నారని వక్తలు పేర్కొన్నారు.రెండు రోజుల పాటు జరిగే సదస్సులో వినియోగదారుల అవగాహన పెంపు, ఆహార భద్రత, ఆరోగ్య పరిరక్షణ, యువతను వినియోగదారుల ఉద్యమంలో భాగస్వాములను చేయడం, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత సులభతరం చేయడం, భవిష్యత్ జాతీయ కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం వంటి అంశాలపై చర్చలు నిర్వహిస్తున్నారు.వినియోగదారుల సమన్వయ మండలి 35 సంవత్సరాల ప్రస్థానం పూర్తయిన సందర్భంగా ప్రత్యేక పోస్టర్‌ను అతిథులు ఆవిష్కరించారు.వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారంలో డిజిటల్ విధానాలు, ఆన్‌లైన్ న్యాయ ప్రక్రియలు కీలకంగా మారుతున్నాయని వక్తలు తెలిపారు.కార్యక్రమంలో వినియోగదారుల సమన్వయ మండలి జాతీయ చైర్మన్ అభిషేక్ శ్రీవాస్తవ, భారతీయ ప్రమాణాల సంస్థ డైరెక్టర్ ప్రేమ సంజని పట్నాల, ప్రొఫెసర్ అనిల్ జవహరి, ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల సంఘాల సమాఖ్య గౌరవ చైర్మన్ నాగేశ్వరరావు, వినియోగదారుల సమన్వయ మండలి వ్యవస్థాపకులు ఎం. కృష్ణారెడ్డి, మాజీ చైర్మన్ షాజీ, హైకోర్టు న్యాయవాది సునీల్ తదితరులు పాల్గొన్నారు.పది రాష్ట్రాల నుంచి వినియోగదారుల సమన్వయ మండలి ప్రతినిధులు హాజరై జాతీయ స్థాయిలో వినియోగదారుల ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ గురువులకు ఘన సన్మానం

**అనంతగిరి,సెప్టెంబర్,12: అనంత జనశక్తి న్యూస్**



ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అనంతగిరి మండల శాఖ ఆధ్వర్యంలో అల్లూరి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సభకు నరాజీ మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పుడిగి దేముడు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శెట్టి రాంబాబు, మండల గౌరవ అధ్యక్షులు బోనంగి సత్యనారాయణ పడాల్, సీనియర్ యుటిఎఫ్ నాయకులు గుజ్జెల కొండబాబు, మండల ప్రధాన కార్యదర్శి జన్ని దేముడు, ఉపాధ్యక్షులు సోమేల గంగరాజు, హైస్కూల్ శాఖ నాయకులు తడబారికి బాలకృష్ణ, మహిళా అధ్యక్షులు వి.వి. ఉషారాణి, పూర్వ ప్రధాన కార్యదర్శి బిడ్డ సింహాచలం, ట్రెజరర్ బి. విజయ్ కుమార్, పూర్వ అధ్యక్షులు కేత రామారావు, జిల్లా కౌన్సిలర్లు కమిడి ప్రసాద్, గార నారాయణ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విద్యపై ఫిన్లాండ్ దేశంలో శిక్షణ పొందిన UTF సీనియర్ నాయకులు శెట్టి రాంబాబు, అనంతగిరి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల2 ప్రధానోపా ధ్యాయురాలు, బి.మంగమ్మ, టోకూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల తెలుగు (SA) ఉపాధ్యాయు రాలు రొబ్బ సూర్యకాంతం, పులుసుమామిడి మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు ఉమశ్రీ, కాసీపట్నం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు బి.బి. విజయ, డముకు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఎల్.బి. మంజునాథ్, బీంపోలు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మూతిబోయిన సురేష్‌లను పుష్పగుచ్ఛాలు, మెమెంటోలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల, శివలింగపురం ప్రధానోపాధ్యాయులు శెట్టి సుబ్బారావు, డిప్యూటీ ప్రధానోపాధ్యాయులు గుజ్జెల కొండబాబు, లుంగపర్తి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు తడబారికి బాలకృష్ణ మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థులకు వినూత్న పద్ధతుల్లో విద్యను అందిస్తూ, ఎంతోమంది విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్న ఉత్తమ ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాల అభివృద్ధిలో అహర్నిశలు భాగస్వాములవుతూ, సమాజ సేవలోనూ తమదైన ముద్ర వేస్తున్న ఉపాధ్యాయులకు అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పుడిగి నాగేశ్వరరావు, పి. శ్యామల, జె. శివ, చేపల వెంకట్రావు, శెట్టి మహేశ్వరి, బాకా అరుణ, స్వామి నాయుడు, కపాటి విజయకుమారి, పద్మావతి, తనూజ తదితరులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీ ప్రక్రియ పూర్తి పారదర్శకం

- మంత్రి కందుల దుర్గేష్
- రాత్రింబవళ్లు కష్టపడి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల శ్రమను అవమానించడమే వైసీపీ నైజం
- అభ్యర్థుల భవిష్యత్తును అడ్డుకునేందుకు వైఎస్సార్సీపీ 335 పిటిషన్లు.. వైసిపి తీరుకు హైకోర్టు తీర్పు చెంపపెట్టు
- రోస్టర్, హారిజంటల్ రిజర్వేషన్లు, మెరిట్ ఆధారంగానే ఎంపికలు
- 148 రోజుల్లోనే 16,347 పోస్టుల భర్తీ కూటమి ప్రభుత్వ పారదర్శకతకు తార్కాణం
- డీఎస్సీ పై వైసీపీ వ్యవహరిస్తున్న తీరుని జనసేన ఖండిస్తోంది
- విజయవాడ తూర్పు నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ సెప్టెంబర్ 12, అనంత జనశక్తి ప్రతినిధి**



గత కొన్ని రోజులుగా మెగా డీఎస్సీ పై అభూత కల్పనలు సృష్టించి, అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వైసీపీ తీరును జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. శనివారం విజయవాడ తూర్పు నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ "సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించింది. ఈ నేపథ్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు దక్కకూడదనే దుర్బుద్ధితో వైఎస్సార్సీపీ ఏకంగా 335 పిటిషన్లను హైకోర్టులో దాఖలు చేసింది. వైసీపీ ఎమ్మెల్సీ వేసిన పిల్ పై విచారణ చేపట్టిన హైకోర్టు.. బాధిత అభ్యర్థులు ఎవరూ కోర్టుకు రానప్పుడు మీకెందుకు ఆరాటం? అంటూ తీవ్రంగా మందలించింది. ఈ తీర్పు వైసీపీకి గట్టి చెంపపెట్టు వంటిది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించిన వెంటనే చేసిన మొదటి సంతకం మెగా డీఎస్సీపైనే. కేవలం 148 రోజుల రికార్డు వ్యవధిలో 16,347 పోస్టులను అత్యంత పారదర్శకంగా భర్తీ చేసి కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకుంది. నోటిఫికేషన్, మెరిట్ లిస్టులు, ఆన్సర్ కీలు, గ్రీవెన్స్ పరిష్కారం వరకు ప్రతి అంశాన్ని పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉంచాం. కేవలం మెరిట్ ర్యాంకు మాత్రమే కాకుండా అభ్యర్థి కేటగిరీ, పోస్టుల లభ్యత, రోస్టర్ పద్ధతి, హారిజంటల్ రిజర్వేషన్లు, మహిళలు, దివ్యాంగులు, క్రీడాకారులు, మాజీ సైనికుల నిబంధనలకు కట్టుబడి తుది ఎంపికలు జరిగాయి. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ, ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఏషియా గుర్తించిన వ్యూహాత్మకమైన 'బ్రిడ్జ్' క్రీడపై వైసీపీ నేతలు అవగాహన లేకుండా రాద్ధాంతం చేస్తున్నారు. ఈ క్రీడ ప్రాధాన్యతను అర్థం చేసుకోకుండా విషప్రచారం చేయడం వారి అజ్ఞానానికి నిదర్శనం.గత ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ గ్రూప్స్ పరీక్షల నిర్వహణలో వైఫల్యం చెంది నిరుద్యోగులను మోసం చేశారు. జాబ్ క్యాలెండర్ పేరుతో ఐదేళ్లు కాలయాపన చేశారు. నాడు పరీక్షలు రాసిన అభ్యర్థులకు వైసీపీ తీవ్ర అన్యాయం చేసింది. గత కొన్ని రోజులుగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవాలు లేవు. "జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని నాడు నిరుద్యోగులను మోసం చేసింది వైసీపీ కాదా?". కానీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంతో పాటు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ త్వరలోనే మరో డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించడంతో నిరుద్యోగ యువతలో కొత్త ఆశలు చిగురించాయి.రాజకీయ ఉనికి కోల్పోతామనే భయంతో రాత్రింబవళ్లు కష్టపడి ఉద్యోగాలు సాధించిన వేలాది మంది నిరుద్యోగుల శ్రమను వైసీపీ అవమానిస్తోందని, నిరాధారమైన ఆరోపణలు మానుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని మంత్రి కందుల దుర్గేష్ హెచ్చరించారు.

## కూటమి ధర్మంతో స్థానిక పోరుకు సిద్ధం

- మంత్రి కందుల దుర్గేష్
- విజయవాడ పార్లమెంట్ సమన్వయ సమావేశంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల భాగస్వామ్యం
- బలాబలాల ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక.. అధినేతల నిర్ణయమే శిరోధార్యం
- గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలంటూ అభ్యర్థులను భయపెట్టి ప్రజాస్వామ్యాన్ని పూడ్చిపెట్టిన మాజీ సీఎం జగన్.. నేడు నీతులు చెప్పడం విడ్డూరం
- ప్రజాస్వామ్యయుతంగా స్థానిక సంస్థల ఎన్నికలు.. 100% స్ట్రైక్ రేట్‌తో విజయం ఖాయం

**విజయవాడ సెప్టెంబర్ 12 అనంత జనశక్తి న్యూస్**



రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ధర్మాన్ని పాటిస్తూ భాగస్వామ్య పక్షాలన్నీ కలిసికట్టుగా పోటీ చేస్తాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. విజయవాడలోని భారతి నగర్ లో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన కూటమి సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), జనసేన పార్టీ తరపున తూర్పు నియోజకవర్గం, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అమ్మిశెట్టి వాసు, బండి కోమలి, మరియు బీజేపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం విజయవాడ తూర్పు నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈరోజు కూటమి పార్టీల సమన్వయ కమిటీ సమావేశాలు జరుగుతున్నాయి. కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య స్థానాల కేటాయింపును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ అధిష్ఠానం ఉమ్మడిగా నిర్ణయిస్తాయి.ఏ పార్టీకి ఎక్కడ బలం ఉందో పరిశీలించి, ఆ స్థానాల్లో సదరు పార్టీ పోటీ చేసేలా చర్యలు ఉంటాయి. ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా, అత్యంత స్పష్టతతో అంతిమంగా అధినేతల ఆమోదంతో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ముందుకు సాగుతుంది. ప్రజాస్వామ్య విలువల పట్ల అపరిమితమైన విశ్వాసం ఉన్న కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తి పారదర్శకంగా, ప్రజాస్వామ్యయుతంగా నిర్వహిస్తుంది.

**ఈ ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేట్‌తో కూటమి క్లీన్ స్వీప్ చేయడం ఖాయం.**

మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలపై చేతులెత్తేసి, సాధారణ ఎన్నికల్లో పోటీ పడదామని వ్యాఖ్యానించడం 'దెయ్యాలు వేదాలు వల్లించినట్లు' ఉంది. 2021 స్థానిక ఎన్నికల్లో ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురిచేసి, ఎక్కడా ఎన్నికలు జరగకుండా అడ్డుకుని, దౌర్జన్యంగా ఏకగ్రీవాలు చేసుకున్న చరిత్ర వైసీపీది. నాడొక న్యాయం, నేడొక న్యాయమా అని ప్రశ్నించారు.

**జనసేన పార్టీ కోఆర్డినేటర్లు, సపోర్ట్ టీంతో సమావేశం**

సమన్వయ సమావేశం అనంతరం విజయవాడ తూర్పు నియోజకవర్గం జనసేన కార్యాలయంలో జనసేన పార్టీకి సంబంధించి ఎంపిక చేసిన కోఆర్డినేటర్లు, కోఆర్డినేటర్ టీం మరియు సపోర్ట్ టీంతో మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేకంగా చర్చించి ఎన్నికల కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు అమ్మిశెట్టి వాసు, బొలిశెట్టి శ్రీకాంత్, బండి కోమలి, చెరుకుమిల్లి సురేష్, వేమన కిషోర్ కుమార్, తాటి శివకృష్ణ, చింతలపాటి వెంకటకృష్ణ, రుద్ర శేఖర్ నాయుడు, గాదిరెడ్డి పూర్ణ చంద్రరావు, కొప్పిరెడ్డి సూర్యనారాయణ, పాయింట్ ఆఫ్ కాంటాక్ట్స్ అక్కల గాంధీ, బొలిశెట్టి వంశీకృష్ణ, తంబళ్లపల్లి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో వైసీపీ జెండా ఎగరేద్దాం: కేతిరెడ్డి

- ప్రతి గ్రామం.. ప్రతి వార్డులో ప్రజలకు అందుబాటులో ఉండాలి.....
- ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి.....

**ధర్మవరం సెప్టెంబర్ 12 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసేలా పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలని సూచించారు. శనివారం ధర్మవరంలోని తన కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో కేతిరెడ్డి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్నికల సన్నద్ధత, గ్రామాలు, వార్డుల్లో పార్టీ బలోపేతం తదితర అంశాలపై శ్రేణులతో చర్చించారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డులో పార్టీ కార్యకర్తలు ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవాలని కేతిరెడ్డి సూచించారు. ప్రజలకు అండగా నిలుస్తూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం




కృషి చేయాలని అన్నారు. పార్టీ కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగితే స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి విజయాన్ని అందించవచ్చని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు మరింత చేరువ కావాలని కేతిరెడ్డి సూచించారు. ఎన్నికల సమరానికి ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

# అడిగితే ఆలస్యం లేదు.. ఆపన్నహస్తానికి వెనుకడుగు లేదు

- వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ డీకే బాబు
- తలుపులలో డీకే బాబు దాతృత్వం.. వినాయక చవితికి రూ.5.10 లక్షల భారీ విరాళం!

**తలుపుల సెప్టెంబర్12 అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రంలోని వినాయక చవితి సందర్భంగా గణనాధుని విగ్రహాల కొరకు కమిటీ సభ్యులకు అడగగా రూ. 5,10,000/ ఐదు లక్షల 10 వేల రూపాయల విరాళంను వైఎస్ఆర్సిపి తలుపుల మండల కన్వీనర్ డికె బాబు అందజేశారు.
ఈ సందర్భంగా డీకే బాబు మాట్లాడుతూ తలుపుల మండలంలో ఏ సమస్య వచ్చినా 24 గంటల్లో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మరియు అందుబాటులో లేకపోయినా తన అనుచరులు ఉంటారని తెలియజేశారు..



అనంతరం తలుపుల మండలం కేంద్రంలోని ప్రజలు మరియు నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రతి ఒక్కరూ మేము ఎల్లప్పుడూ డీకే బాబుకి అండగా ఉంటామని తెలియజేశారు. మరియు డీకే బాబు వెంటే ఉంటామని కొనియాడారు.

# సీఎంఆర్ఎఫ్ పేదలకు ఆర్థిక భరోసా ఎమ్మెల్యే కాలవ.



**రాయదుర్గం, సెప్టెంబర్ 12, అనంత జనశక్తి న్యూస్:**

సీఎం ఆర్ ఎఫ్ పేదలకు ఆర్థిక భరోసాని ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు కాల్వ శ్రీనివాసులు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో శస్త్ర చికిత్సలు, ఖరీదైన వైద్యం చేయించుకున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పించడం ఎంతో సంతోషంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.గతంలో ఎన్నడూ లేనివిధంగా మానవతా దృక్పథంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదలకు మెరుగైన వైద్య సేవలు అందేలా సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నారని తెలిపారు. శనివారం రాయదుర్గం పట్టణంలోని తన స్వగృహంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. 34 మంది లబ్ధిదారులకు రూ.16.48 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించినట్లు తెలిపారు. రాయదుర్గం నియోజకవర్గంలో ఇప్పటి వరకు 565 మందికి రూ.3.50 కోట్ల మేర ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించామని వెల్లడించారు. పలువురు పేదలు వైద్య ఖర్చుల కోసం అప్పులు చేసి కర్ణాటక తదితర ప్రాంతాలకు వెళ్లి మెరుగైన వైద్యం పొందుతున్నారని, అలాంటి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందడం ఎంతో ఊరటనిస్తోందన్నారు.సహాయం పొందిన కుటుంబాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. రాయదుర్గం నియోజకవర్గంలోని మరింత మంది పేదలకు పెద్ద ఎత్తున వైద్య సహాయం అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, మండల పార్టీ అధ్యక్షులు వన్నారెడ్డి, మోహన్ రెడ్డి, మల్లెన్న, క్లస్టర్ ఇంచార్జి తలారి గంగాధర్, సుదర్శన్,గోపాల్ రెడ్డి, బుదూరు తిప్పే స్వామి,ధనార్జున తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరును రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతాం





- పొంగూరు షరణి
- రూపాయికే విలాసవంతమైన ఫంక్షన్ హాల్
- మంత్రి నారాయణ ప్రజా నిబద్ధత నిదర్శనం
- 1.40 కోట్లతో రేబాల పార్కు అభివృద్ధి – పర్యటించి హర్షం వ్యక్తం చేసిన పొంగూరు షరణి
- ఈ నెల 16న నెల్లూరుకు మంత్రి నారా లోకేష్..
- ఆర్ ఎస్ ఆర్ , డిఎస్ఆర్ మోడల్ స్కూల్స్ పరిశీలించిన పొంగూరు షరణి

**నెల్లూరు సెప్టెంబర్ 12, అనంత జనశక్తి న్యూస్**

మా నాన్న మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఎన్నికల ప్రచారంలో 8వ డివిజన్‌లో పర్యటించినప్పుడు పండు అనే చిన్నారి కోరిన హామీని నెరవేర్చి, ఆ బాలుడి చేతుల మీదుగానే పార్కును ప్రారంభించడం ఆయన నైతికతకు, ప్రజా నిబద్ధతకు నిదర్శనమని మంత్రి నారాయణ కుమార్తె పొంగూరు షరణి తెలిపారు. NCAP 25 లక్షలు, కార్పొరేషన్ 1.15 కోట్లు నిధులతో మొత్తం 1.40 కోట్ల అంచనాతో నిర్మించిన ఈ ప్రాజెక్టులో అధునాతన AC జిమ్, కమ్యూనిటీ హాల్ అందుబాటులోకి వచ్చాయని, పేదలకు ప్రైవేట్ హాల్స్ భారం కాకూడదనే ఏకైక ఉద్దేశంతో సెంట్రల్ AC, 500 మంది కెపాసిటీ, విశాలమైన పార్కింగ్ ఉన్న హాల్‌ను కేవలం రూపాయికే అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 16న ఐటీ మంత్రి నారా లోకేష్ పర్యటన నేపథ్యంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్‌తో కలిసి స్టోన్ హౌస్ పేటలోని RSR, మూలాపేటలోని DSR పాఠశాలల ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం రేబాల పార్కును పర్యటించిన షరణి, అక్కడ ఉన్న వాతావరణం, జిమ్ ఎక్విప్‌మెంట్ చాలా బాగుందని, ఎంతో ఆహ్లాదకరంగా ఉందని తీవ్ర సంతృప్తి వ్యక్తం చేస్తూ తమ నాన్నగారు ఇచ్చే ప్రతి మాటనూ ఖచ్చితంగా పాటిస్తూ నెల్లూరును రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతారని స్పష్టం చేశారు. ఇప్పటికే నగరంలో 35 పార్కులను అందుబాటులోకి తెచ్చామని, త్వరలోనే వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ పార్కులను కూడా ప్రారంభించబోతున్నామని వెల్లడించగా, అక్కడ తనతో సరదాగా గడిపిన పిల్లలు థాంక్యూ నారాయణ సార్, థాంక్యూ షరణి అంటూ ఎంతో ఆనందంతో కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో 8వ డివిజన్ క్లస్టర్ ఇంచార్జి తిరుమల నాయుడు,కో క్లస్టర్ హేమంత్,వైస్ ప్రెసిడెంట్ శేఖర్,మల్లి, అజయ్,సుబ్బారావు..తదితరులు పాల్గొన్నారు

# మట్టి వినాయకునే పూజిద్దాం

-పర్యావరణాన్ని పరిరక్షిద్దాం
- జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

**పుట్టపర్తి,సెప్టెంబర్ 12:అనంత జనశక్తి న్యూస్**

వినాయక చతుర్థి సందర్భంగా మట్టి వినాయకుడిని పూజించాలని పర్యావరణాన్ని పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.గురువారం చిన్నంపల్లి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు,ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన వినాయక చతుర్థి సందర్భంగా మట్టి విగ్రహాల తయారీ,చిట్టి చేతుల్లో మట్టి గణపతి కార్యక్రమంలో చిన్నారులు చేసిన మట్టి బొమ్మలకు బహుమతి ప్రదానం చెసారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... వినాయక చవితి విశిష్టతను కాపాడేందుకు అందరూ



సమష్టిగా కృషి చేయాలన్నారు. సహజ రంగులతో చేసిన మట్టి ప్రతిమలతో పర్యావరణ అనుకూల వినాయక చవితిని జరుపుకోవాలన్నారు. వినాయక చవితి పండుగను సుస్థిరంగా మరియు పర్యావరణానికి అనుకూలంగా జరుపుకోవాలని, చెరువులు మరియు జల వనరులకు నష్టం కలిగించే వ్యర్థ పదార్థాల వినియోగం తగ్గిద్దాం లేదా పూర్తిగా మానేయాలన్నారు. మట్టితో చేసిన ప్రతిమలను వాడాలని, విగ్రహాల తయారీకి సహజసిద్ధమైన రంగులను ప్రకృతిలో లభ్యమయ్యే పత్తి, నారా వంటి పదార్థాలను వినియోగించాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వాడకం నిషేధించబడిందని మరియు పిఓపిలో హానికరమైన రసాయనాలు నీటి కాలుష్యానికి దారితీస్తాయని మరియు నీటి వనరుల కాలుష్యాన్ని నివారించడానికి పర్యావరణ అనుకూలమైన (క్లే) గణేష్ విగ్రహాలను మాత్రమే ఉపయోగించాలన్నారు. సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలకు అనుగుణంగా విగ్రహాల తయారీ, నిమజ్జన కార్యక్రమం జరగాలని సూచించారు. వినాయక మండపాలకు అనుమతులు జారీ చేసేటప్పుడు మరియు విగ్రహాల ఏర్పాటు సమయంలో కూడా రెవెన్యూ డిపార్ట్‌మెంట్, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా పంచాయతీ డిపార్ట్‌మెంట్, అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖ మరియు పోలీసు డిపార్ట్‌మెంట్‌లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన సవరించిన మార్గదర్శకాలను అనుసరించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ ఇంజనీర్, శ్రీమతి శశికళ,డిఆర్‌డిఏ పిడి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఫైనల్‌కు డ్రాగన్ 11, పెనుకొండ జట్లు



**ధర్మవరం సెప్టెంబర్ 12 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న అటల్ జనహిత వాజపేయి స్మారక క్రికెట్ టోర్నమెంట్ - సీజన్-3 ఉత్కంఠభరితంగా కొనసాగుతోంది. టోర్నమెంట్ లో భాగంగా శనివారం నిర్వహించిన సెమీఫైనల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. ప్రత్యర్థులపై విజయం సాధించిన డ్రాగన్ 11, పెనుకొండ జట్లు తుది పోరుకు అర్హత సాధించాయి. ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్‌బాబు టాస్ వేసి సెమీఫైనల్ పోటీలను ప్రారంభించారు. తొలి సెమీఫైనల్‌లో డ్రాగన్ 11-తారక్ 11 జట్లు తలపడగా డ్రాగన్ 11 జట్టు విజయం సాధించింది. అనంతరం జరిగిన రెండో సెమీఫైనల్‌లో పెనుకొండ-హిందూపురం జట్లు తలపడగా పెనుకొండ జట్టు ప్రత్యర్థిపై ఆధిపత్యం ప్రదర్శించి విజయాన్ని సొంతం చేసుకుంది. దీంతో డ్రాగన్ 11, పెనుకొండ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. సెప్టెంబర్ 16న జరిగే తుది పోరులో ఈ రెండు జట్లు టైటిల్ కోసం తలపడనున్నాయి. దీంతో ఫైనల్ మ్యాచ్‌పై క్రీడాభిమానుల్లో ఆసక్తి నెలకొంది. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు స్థానిక క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. క్రీడలకు ప్రోత్సాహం అందిస్తూ యువతకు మంచి వేదిక కల్పించడమే లక్ష్యంగా పోటీలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్ డి ఏ కూటమి 100% విజయమే లక్ష్యం



- కూటమి పార్టీల మధ్య సమన్వయం.. ప్రతి స్థానంలో విజయమే ధ్యేయం

**ధర్మవరం సెప్టెంబర్ 12 అనంత జనశక్తి న్యూస్ :**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్ డి ఏ కూటమి అభ్యర్థులు పోటీ చేసే ప్రతి స్థానంలో విజయం సాధించడమే లక్ష్యంగా కర్నూలు పార్లమెంట్ పరిధిలో కూటమి నేతలు కార్యాచరణకు సిద్ధమవుతున్నారు.
స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కర్నూలు పార్లమెంట్ పరిధిలోని మున్సిపాలిటీలకు సంబంధించిన పలు కీలక అంశాల పై కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త చిలకం మధు సుధన్ రెడ్డి ఈరోజు ఎన్ డి ఏ కూటమి పార్టీల ముఖ్య నాయకులతో కీలక సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయడం, కూటమి అభ్యర్థులు ఎక్కడెక్కడ పోటీ చేయాలనే అంశాలపై చర్చించారు. ఏ పార్టీ అభ్యర్థి పోటీ చేసినా.. మిగిలిన కూటమి భాగస్వామ్య పార్టీలు సమష్టిగా అండగా నిలిచి, ఆయా స్థానాల్లో విజయానికి కృషి చేయాలని నిర్ణయించారు. పోటీ చేసే స్థానాల సంఖ్య కాదు.. గెలిచే స్థానాలే ముఖ్యం అన్న లక్ష్యంతో ప్రతి వార్డు, ప్రతి స్థానాన్ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని నాయకులు చర్చించారు. కూటమి నేతల మధ్య సమన్వయం, కార్యకర్తల మధ్య ఐక్యత, పటిష్టమైన ఎన్నికల వ్యూహంతో ఎన్ డి ఏ కూటమికి 100% స్ట్రైక్ రేట్ సాధించేలా ముందుకు సాగాలని నిర్ణయించారు.

# జాతీయ లోక్ అదాలత్ లో 409 కేసులు పరిష్కారం..



- జడ్జీలు వెంకటేశ్వర్లు, వెంకట హరీష్.

**ధర్మవరం సెప్టెంబర్ 12, అనంత జనశక్తి న్యూస్:**

పట్టణంలోని కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలతో 409 కేసులు పరిష్కారం కావడం జరిగిందని సీనియర్ సివిల్ జడ్జ్ వెంకటేశ్వర్లు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ వెంకట హరీష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... రాజి మార్గమే రాజమార్గమని, రాజీకు కాబడిన కేసులు మాత్రమే పరిష్కరించడం జరిగిందని తెలిపారు. ఇంతటి విజయానికి కృషిచేసిన పోలీస్ శాఖకు, న్యాయవాదులకు, బార్ అసోసియేషన్ వారికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు. పరిష్కారమైన కేసులలో ఓఎస్ కేసులు నాలుగు (రూ.6,02,800), ఈ పీ కేసులు ఒకటి (రూ.4,500), ఎం సి కేసులు ఒకటి (నాలుగు లక్షల రూపాయలు), సీసీఐపీసీ కేసులు 40, సీసీ ఎక్సైజ్ కేసులు 93 (రూ.3,32,144), ఎస్ టి సి కేసులో రెండు (రూ.11,33,000), ఎస్టిసి కేసులు 265 ఇందులో జరిమానా నగదు రూ,1,25,060, సీజుడు అమౌంటు రూ.6,11,800, బ్యాంకు పి ఎల్ సి కేసులు మూడు (రు.1,36,000), తెలిపారు409 కేసులు(రూ.27,74,004) పరిష్కారం అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ తో పాటు సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోటి సిబ్బంది పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లకు సిద్ధమైన అధికారులు



**రాయదుర్గం, సెప్టెంబర్ 12, అనంత జనశక్తి న్యూస్**

వినాయక నిమజ్జనానికి అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు సిద్ధమయ్యారు. శనివారం వివిధ శాఖ అధికారులు వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం ఎక్కడ స్థలం అనుకూలంగా ఉంటుందనే అంశంపై మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి, తహసీల్దార్ సూర్యప్రతాప్, రూరల్ సీఐ దేవానంద్ వివిధ శాఖల అధికారులు కలిసి పట్టణ పరిసరాల్లో ఆరు ప్రాంతాలను పరిశీలించారు.అందులో భాగంగా నాన్ చెరువు ప్రాంతాన్ని నిమజ్జనానికి అనుకూలంగా గుర్తించారు. అక్కడ పెద్ద దీర్ఘచతురస్రాకారంలో కుంట తరహాలో గొయ్యిని ఏర్పాటు చేసి, ట్యాంకర్ల ద్వారా నీటిని నింపి నిమజ్జన ఏర్పాట్లను ప్రారంభించారు.ఐదు అడుగుల లోపు ఉన్న వినాయక విగ్రహాలు, చిన్న విగ్రహాలను ఈ ప్రాంతంలోనే నిమజ్జనం చేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. అలాగే మార్కెట్ యార్డ్ సమీపంలో ఉన్న కుంట లో కూడా నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అక్కడ బారికేడ్లు, విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, అవసరమైన చోట క్రేన్ సహాయంతో నిమజ్జనం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా పెద్ద వినాయక విగ్రహాలను కనేకల్ హెచ్ఎల్సీ కాలువలో నిమజ్జనం చేసే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామన్నారు.

# గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**రాప్తాడు సెప్టెంబర్ 12 అనంత జనశక్తి న్యూస్**



గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన రాప్తాడు మండలంలోని అయ్యవారిపల్లి క్రాస్ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. రాప్తాడు పోలీసుల వివరాల మేరకు.. పెద్దవడుగూరు మండలం చింతలచెరువు గ్రామానికి చెందిన కోనేపల్లి ఆదినారాయణరెడ్డి (61) బస్సులకు సంబంధించిన స్పేర్ పార్ట్స్ తీసుకురావడానికి శనివారం ఉదయం తన హోండా షైన్ మోటార్‌సైకిల్‌పై రాప్తాడు ఆటోనగర్‌కు వచ్చారు. స్పేర్ పార్ట్స్ తీసుకున్న అనంతరం తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో మధ్యాహ్నం సుమారు 12.30 గంటల సమయంలో అయ్యవారిపల్లి క్రాస్ సమీపంలోని ఎన్‌హెచ్ 44పై అనంతపురం వైపు వెళ్తుండగా.. బెంగళూరు వైపు నుంచి వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఆయన మోటార్‌సైకిల్‌ను ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆదినారాయణరెడ్డికి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న రాప్తాడు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్‌లో తరలించినట్లు రాప్తాడు స్టేషన్ ఎస్‌హెచ్ఓ తెలిపారు.

# హైవేలో ఘోర రోడ్డు ప్రమాదం ఒకరు స్పాట్



- **రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన టిప్పర్ లారీ బలంగా డీకొట్టింది**
- **ప్రాణాలతో బయటపడిన కుమార్తె పండుగ పూట విషాదం.**

**అగళి సెప్టెంబర్ 12,అనంత జనశక్తి న్యూస్:**

అగళి మండలకేంద్రం నందు 544E నెం. గల హైవే పై శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో దొడ్డరంగప్ప అను వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు గుడిబండ మండలం సింగేపల్లి పంచాయితికి చెందిన దొడ్డరంగప్ప అను వ్యక్తి, అగళి మండలకేంద్రంలోని కెజిబివి పాఠశాలలో ఇంటర్ విద్యను అభ్యసిస్తున్న తన కుమార్తె మోనికను పండుగకు పిలిచుకొని ఊరికి వెళ్ళుతుండగా అగళి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద 544E నెం. గల రహదారి పై ద్విచక్రవాహనం ద్వారా దొడ్డరంగప్ప రోడ్డు దాటుతుండగా రొళ్ళ వైపు నుండి వేగంగా వచ్చిన టిప్పర్ లారీ బలంగా డీకొట్టింది. ఈ ఘటనలో డీకొట్టగానే కుమార్తె కిందకు పడి ప్రాణాలతో బయట పడింది. దొడ్డరంగప్ప మాత్రం నుజ్జు నుజ్జయ్యాడు, టిప్పర్ లారీ కొద్ది దూరం మేర వరకు బైక్ ను, దొడ్డరంగప్పను ఈడ్చుకెళ్ళింది. దొడ్డ రంగప్ప అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానిక ఎస్సై రంగడు యాదవ్ ప్రమాద స్థలానికి చేరుకొని, ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# వైసీపీకి షాక్.. టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసిపి నాయకులు

- **అగళి మండలం హళ్లికేరా గ్రామంలో టీడీపీలోకి భారీ చేరికలు**

**అగళి సెప్టెంబర్ 12,అనంత జనశక్తి న్యూస్:**

అగళి మండలం హళ్లికేరా గ్రామంలో వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ ఎంపీటీసీ ద్యావమ్మతో పాటు సుమారు 100 మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం టీడీపీలో చేరారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో వీరంతా టీడీపీ కండువాలు కప్పుకుని పార్టీలోకి చేరారు.ఈ సందర్భంగా గుండుమల తిప్పేస్వామి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా టీడీపీలోకి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వ పాలన, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పెద్ద సంఖ్యలో ప్రజలు టీడీపీ వైపు వస్తున్నారని ఆయన అన్నారు. గ్రామస్థాయిలో టీడీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.



# లేఅవుట్, భవన అనుమతుల ప్రక్రియలో ఇబ్బందులపై మంత్రి నారాయణ సమీక్ష

- **సాఫ్ట్‌వేర్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం**
- **ఐదు అంతస్తులు, అంతకంటే పైబడిన భవనాల అనుమతుల కోసం డైరెక్టరేట్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు**

**అమరావతి సెప్టెంబర్ 12, అనంత జనశక్తి ప్రతినిధి**



లేఅవుట్, భవన నిర్మాణ అనుమతుల దరఖాస్తుల సమర్పణలో తలెత్తుతున్న ఇబ్బందులపై పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించారు. లేఅవుట్, భవన నిర్మాణ అనుమతులను మరింత సులభంగా, పారదర్శకంగా జారీ చేసే విధానంపై సమీక్షలో ప్రధానంగా చర్చించారు. ఈ సమీక్షకు టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లతతో పాటు క్రెడాయ్, నరేడ్కో ప్రతినిధులు హాజరయ్యారు. లేఅవుట్, భవన అనుమతుల కోసం దరఖాస్తులు సమర్పించే సమయంలో ఎదురవుతున్న సమస్యలను రియల్ ఎస్టేట్ సంఘాల ప్రతినిధులు మంత్రి నారాయణ దృష్టికి తీసుకువచ్చారు.ముఖ్యంగా సాఫ్ట్ వేర్‌లో తలెత్తుతున్న సమస్యల కారణంగా దరఖాస్తుల సమర్పణ, అనుమతుల ప్రక్రియలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రతినిధులు వివరించారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించి, దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. ఐదు అంతస్తులు, అంతకంటే పైబడిన భవనాల అనుమతుల దరఖాస్తుల పరిష్కారానికి టౌన్ ప్లానింగ్ డైరెక్టరేట్ లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. తద్వారా ఇటువంటి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా, వేగంగా అనుమతుల ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

టౌన్ ప్లానింగ్ విభాగం అందించే సేవలు మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని మంత్రి నారాయణ పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా టౌన్ ప్లానింగ్ విభాగంలో కీలక సంస్కరణలను తీసుకొచ్చామని తెలిపారు. సంస్కరణల ఫలితాలు ప్రజలకు, రియల్ ఎస్టేట్ రంగానికి అందేలా వాటిని పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. అనుమతుల జారీ విషయంలో నిబంధనల ప్రకారం పారదర్శకంగా వ్యవహరించాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు మంత్రి నారాయణ సూచించారు. దరఖాస్తుల స్వీకరణ నుంచి అనుమతుల జారీ వరకు ప్రతి దశలోనూ ప్రక్రియ సులభంగా, పారదర్శకంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లేఅవుట్, భవన అనుమతుల కోసం వచ్చే దరఖాస్తులను వేగంగా పరిష్కరించడంతో పాటు, సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన సమస్యలను సాంకేతికంగా అధిగమించి సేవల్లో మరింత నాణ్యత, పారదర్శకత తీసుకురావాలని మంత్రి అధికారులకు సూచించారు.

# అనంత కరువును జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలి**
- **సీపీఐ జాతీయ కార్యదర్శి కే. రామకృష్ణ డిమాండ్**

**రాప్తాడు సెప్టెంబర్ 12 అనంత జనశక్తి న్యూస్**



అనంతపురం జిల్లాను కరువు కమ్మేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని సీపీఐ జాతీయ కార్యదర్శి కే. రామకృష్ణ మండిపడ్డారు. అనంతపురం జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను జాతీయ విపత్తుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కరువు పరిస్థితులను స్వయంగా పరిశీలించేందుకు రాప్తాడు మండలం గంగులకుంటలో రామకృష్ణ పర్యటించారు. కరువు కారణంగా ఎండిపోయిన చీని తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వేరుశెనగ, కంది పంటలు కూడా దాదాపుగా పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ఏళ్ల తరబడి సంరక్షించిన తర్వాతే దిగుబడికి వచ్చే పండ్ల తోటలు సైతం కళ్లముందే ఎండిపోతుండటం ఆవేదన కలిగిస్తోందని రామకృష్ణ అన్నారు. పరిస్థితులు ఇంత తీవ్రంగా ఉన్నప్పటికీ కరువు నివారణకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. కరువు పరిస్థితులను ఎదుర్కోవడం రాష్ట్ర ప్రభుత్వ ఒక్కదాని బాధ్యత కాదని, కేంద్ర ప్రభుత్వం కూడా సమాన బాధ్యత తీసుకుని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటివరకు కరువు పరిస్థితులపై స్పందించకపోవడం విచారకరమన్నారు. ఇటీవల జరిగిన కలెక్టర్ సమీక్ష సమావేశంలో కూడా కరువు అంశం ఎజెండాలో లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని రామకృష్ణ విమర్శించారు. రైతులు తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు.

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మరో మూడు రోజుల పాటు పర్యటించి క్షేత్రస్థాయిలో కరువు పరిస్థితులను పరిశీలిస్తామని రామకృష్ణ తెలిపారు. అనంతరం సెప్టెంబర్ 15 లేదా 16 తేదీల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను వివరించి, తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని కోరనున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను వివరించేందుకు సీపీఐ, రైతు సంఘం సిద్ధమవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శివర్గ సభ్యుడు పి. జగదీష్, జిల్లా కార్యదర్శి పాలెం నారాయణస్వామి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదల

- **పోషణ్ మాసం–2026లో భాగంగా అవగాహన కార్యక్రమం**

**రాప్తాడు సెప్టెంబర్ 12 అనంత జనశక్తి న్యూస్**



రాప్తాడు మండలం ఎర్రగుంట గ్రామంలోని 1వ అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ మాసం-2026లో భాగంగా 'మన అంగన్వాడి-మన బాధ్యత' కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీఓ శ్రీమతి ఉమాశంకరమ్మ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిన్నారుల ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు వారి బరువు, ఎత్తును క్రమం తప్పకుండా పరిశీలించాల్సిన అవసరాన్ని వివరించారు.

ఆరు నెలలు పూర్తయిన చిన్నారులకు తల్లిపాలతో పాటు అదనపు ఆహారాన్ని అందించాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారాన్ని మెత్తగా ఉడికించి గుజ్జు రూపంలో పిల్లలకు అందించడం ద్వారా వారి శారీరక ఎదుగుదలకు, ఆరోగ్యానికి మేలు జరుగుతుందని తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పాలు, గుడ్లు, బాలామృతం, బాలసంజీవని కిట్లు, బియ్యం, కందిపప్పు, నూనె తదితర పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ఉపయోగపడేలా లబ్ధిదారులే వినియోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ, బాల్యవివాహాలు లేదా చిన్నారుల రక్షణకు సంబంధించిన సమస్యలు ఎదురైనప్పుడు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, అత్యవసర సేవల కోసం 100కు సమాచారం అందించాలని తెలిపారు.

కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ లీలావతి, అంగన్వాడీ కార్యకర్త చంద్రకళ, హెల్పర్ సరోజతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

# ఈనెల 16వ తేదీ రాజకీయ,పార్టీలతో,సమావేశం

**అమడగూరు సెప్టెంబర్ 12 ( అనంత జనశక్తి న్యూస్ )**

అమడగూరు మండలంలోని అన్ని రాజకీయ పార్టీలతో డ్రాఫ్ పోలింగ్ కేంద్రాలపై ఈనెల 16న స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శకుంతల, శనివారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలకు సంబంధించిన డ్రాఫ్, పోలింగ్ కేంద్రాలను ఏప్రిల్ 16న ప్రచురించామన్నారు పోలింగ్ కేంద్రాలపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్న 16న నిర్వహించే రాజకీయ పార్టీల సమావేశంలో పార్టీల అభిప్రాయాలను స్వీకరించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఆమె కోరారు



# పర్యాటకులతో స్నేహపూర్వక, బాధ్యతాయుత టూరిజమే లక్ష్యం




- **జిల్లా టూరిజం అధికారి పట్టాసి చలపతిరావు**

**పాడేరు సెప్టెంబర్ 12, అనంత జనశక్తి న్యూస్**

అల్లూరి సీతారామరాజు జిల్లా మేఘలకొండ వంజంగి పర్యాటక కేంద్రాన్ని జిల్లా టూరిజం అధికారి పట్టాసి చలపతిరావు సందర్శించారు. ఈ సందర్భంగా వంజంగి ప్రాంతంలోని వాహన డ్రైవర్లు, వాహన యజమానులు, హోటల్,ఇతర పర్యాటక సేవల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి బాధ్యతాయుత పర్యాటకంపై అవగాహన కల్పించారు. వంజంగిలో పర్యాటకుల నుంచి అధికంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై పత్రికల్లో వచ్చిన వార్తల నేపథ్యంలో స్థానికులతో క్షేత్రస్థాయిలో సమగ్రంగా విచారణ జరిపారు.ఈ సందర్భంగా జిల్లాటూరిజం అధికారి మాట్లాడుతూ, పర్యాటకులకు అధిక ధరలతో ఇబ్బందులు కలగకుండా, అదే సమయంలో వాహనదారులు, హోటల్ నిర్వాహకులు, స్థానిక వ్యాపారులకు నష్టం కలగకుండా స్నేహపూర్వక వాతావరణంలో పర్యాటక వ్యాపారాన్ని నిర్వహించాలని సూచించారు. పర్యాటకులు సంతృప్తిగా ఉండేలా సేవలు అందించడం ద్వారా జిల్లాకు మరింత మంది పర్యాటకులను ఆకర్షించి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయవచ్చన్నారు.ప్లాస్టిక్ రహిత పర్యాటకమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు.రానున్న నెలలో పర్యాటక సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో, జిల్లాలోని టూర్ ఆపరేటర్లు, వాహన యజమానులు, రెస్టారెంట్ నిర్వాహకులు, హోటల్ యాజమాన్యాలతో అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ టి. పూజశ్రీ,ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. పర్యాటకులకు అందుబాటులో ఉండేలా, సేవాదారులకు కూడా అనుకూలంగా ఉండే సహేతుకమైన ధరల నిర్ణయానికి ఈ సమావేశంలో చర్చిస్తామని పేర్కొన్నారు.పర్యాటక సీజన్‌లో పర్యాటకులకు మెరుగైన సేవలు అందిస్తూ, జిల్లా ప్రతిష్ఠను మరింత పెంచేందుకు అన్ని వర్గాలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా టూరిజం అధికారి కోరారు.

# మహిళా క్రికెట్‌కు మరింత ప్రోత్సాహం అవసరం

**- హిళలు ఇష్టపడిన రంగంలో రాణించేలా కుటుంబం అండగా నిలవాలి: డాక్టర్ రాయపాటి శైలజ**



**కడప సెప్టెంబర్ 12 అనంత జనశక్తి న్యూస్**

దేశవ్యాప్తంగా మహిళా క్రికెట్‌కు ఇటీవలి కాలంలో ఆదరణ, గుర్తింపు పెరగడం అభినందనీయమని, అయితే మహిళా క్రీడాకారిణులకు మరింత ప్రోత్సాహం అవసరమని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ అన్నారు. కడప శివార్లలోని కేఎస్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించిన ఆర్‌ఎక్స్‌ఎస్ జెర్సీ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రముఖ నటి నిధి అగర్వాల్, వ్యాఖ్యాత రాములమ్మ, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.మహిళా క్రికెట్‌కు దాదాపు ఐదు దశాబ్దాల చరిత్ర ఉన్నప్పటికీ, గత ఆరేడేళ్లుగా మాత్రమే దేశంలో మహిళా క్రికెట్‌కు విస్తృత స్థాయిలో గుర్తింపు లభిస్తోందని శైలజ పేర్కొన్నారు. ఇంటి నుంచి పాఠశాల, కళాశాల, ఉద్యోగం వరకు అనేక రంగాల్లో మహిళల కంటే పురుషులకు అధిక ప్రాధాన్యత ఇచ్చే పరిస్థితులు ఉన్నప్పటికీ, మహిళలు తమ ప్రతిభను నిరూపించుకుంటూ ముందుకు సాగడం అభినందనీయమన్నారుభారత మహిళా క్రికెట్ జట్టు తమ ఆటలో చూపిస్తున్న నిబద్ధత, పట్టుదలతో పురుషులకు తాము ఏమాత్రం తీసిపోమని నిరూపించిందని అన్నారు. గతంలో మహిళా క్రికెట్ మ్యాచ్‌లకు ప్రేక్షకులను రప్పించాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం స్టేడియాలు ప్రేక్షకులతో కిక్కిరిసే స్థాయికి ఆదరణ పెరిగిందన్నారు. గతంలో 'మెన్ ఇన్ బ్లూ'గా పిలిచినట్లుగానే ఇప్పుడు 'లేడీస్ ఇన్ బ్లూ' అని గర్వంగా చెప్పుకునే పరిస్థితి రావడం సంతోషకరమన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో మహిళా క్రికెట్‌లో అపారమైన ప్రతిభ ఉందని, యువ క్రీడాకారిణుల్లో కనిపిస్తున్న పట్టుదల, నిబద్ధత అభినందనీయమని శైలజ అన్నారు. ప్రతిభ ఉన్న క్రీడాకారిణులను ప్రోత్సహించేందుకు కుటుంబం, సమాజం నుంచి మరింత మద్దతు అవసరమన్నారు. మహిళా క్రికెట్‌ను ప్రోత్సహించేందుకు ముందుకు వస్తున్న అమర్, రాజారెడ్డిలను అభినందించారు.విజయం సాధించిన తర్వాత మాత్రమే క్రీడాకారిణులను అభినందించడం కాకుండా, వారు క్రీడా ప్రయాణాన్ని ప్రారంభించినప్పటి నుంచే ప్రోత్సహించాలని సూచించారు. శ్రీచరణి వంటి క్రీడాకారిణుల విజయాలు మరింత మంది అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.క్రీడల్లోకి వచ్చే అమ్మాయిలకు కుటుంబం నుంచే అనేక ప్రశ్నలు, అడ్డంకులు ఎదురవుతున్నాయని, వాటిని అధిగమించి క్రీడలపై ఉన్న ఆసక్తితో ముందుకు సాగుతున్న క్రీడాకారిణులకు, వారికి అండగా నిలుస్తున్న కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు."మహిళా సాధికారత అంటే కేవలం చదువు చెప్పించడం కాదు. ఒక అమ్మాయి తాను ఇష్టపడిన రంగంలో, తాను చేయాలనుకున్న పనిలో ముందుకు వెళ్లేలా ప్రోత్సహించి, చివరి వరకు ఆమెకు వెన్నంటి ఉండటమే నిజమైన మహిళా సాధికారత" అని డాక్టర్ శైలజ స్పష్టం చేశారు.క్రీడలు కేవలం గెలుపు గురించి మాత్రమే కాకుండా, ఓటమిని ఎదుర్కొని మళ్లీ ప్రయత్నించడం, కిందపడినా తిరిగి లేచి ముందుకు సాగడం నేర్పుతాయని అన్నారు. క్రీడాకారిణుల పట్టుదలను ప్రతి అమ్మాయి స్ఫూర్తిగా తీసుకుని జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించాలని సూచించారు.ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మరింత మంది క్రీడాకారిణులు భవిష్యత్తులో భారత జాతీయ క్రికెట్ జట్టులో చోటు సంపాదించాలని డాక్టర్ రాయపాటి శైలజ ఆకాంక్షించారు. రాష్ట్రంలో మహిళా క్రీడలను ప్రోత్సహించేందుకు అందరూ కలిసి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆర్‌ఎక్స్‌ఎస్ జట్టు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి జగన్ రెడ్డి

**- అలాంటి వ్యక్తి మంత్రి లోకేష్ పై ఆరోపణలు చేస్తున్నాడు.. ఎమ్మెల్యే దగ్గుపాటి**

**- నీరు ప్రగతి పార్క్ వద్ద 80లక్షలతో సీసీ రోడ్డుకు భూమి పూజ**

**- త్వరలో 350 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్న ఎమ్మెల్యే**



**అనంతపురం సెప్టెంబర్ 12 అనంత జనశక్తి న్యూస్**

ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి జగన్ రెడ్డి అని అలాంటి వ్యక్తి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారిపై ఆరోపణలు చేస్తున్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురం నగరంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న నీరు ప్రగతి పార్క్ సర్కిల్ వద్ద 80 లక్షలతో సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో 1300 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేసామన్నారు. 250 కోట్ల రూపాయలతో సిసి రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతులు కల్పించామన్నారు. గత ఐదేళ్లలో ఎక్కడా కూడా రోడ్లు డ్రైనేజీలు వేసిన పాపాన పోలేదన్నారు. కనీసం కాలువలు శుభ్రం చేసిన పరిస్థితి కూడా లేదన్నారు. కేవలం ఏదో చేస్తున్నామని చెప్పి మభ్యపెట్టి దొంగ బిల్లులు చేసుకున్నారని విమర్శలు చేశారు. ఒక్క శ్రీనగర్ కాలనీలోనే రెండు కోట్ల రూపాయలతో రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. మరో 80 లక్షలు రూపాయలతో నేడు సిసి రోడ్డుకు భూమి పూజ చేసామన్నారు. శ్రీనగర్ కాలనీ రూపురేఖలు మారుస్తున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి పేర్కొన్నారు. గత 15 ఏళ్లుగా పెండింగ్లో ఉన్న రోడ్లన్నీ నిర్మించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరో 350 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కేవలం ఈ రెండేళ్లలోనే 600 కోట్ల రూపాయలతో నగరంలో అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేటాయించారన్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ పై తొలి సంతకం చేశారన్నారు. 16,347 పోస్టులను 150 రోజుల్లోనే భర్తీ చేశారన్నారు. అత్యంత పారదర్శకంగా మెగా డీఎస్సీ జరిగితే వైసిపి నాయకులు అందులో అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు చేస్తున్నారన్నారు. దీనిపై మంత్రి నారా లోకేష్ బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరినప్పటికీ వైసీపీ నాయకులు రాలేదన్నారు. పొద్దున లేచినప్పటి నుంచి డీఎస్సీ మీద ఆరోపణలు చేస్తూ బురదచల్లుతున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, టిడిపి నాయకులు బుగ్గయ్య చౌదరి, కోనంకి గంగారం, సరిపుటి రమణ, సంగా తేజస్విని, రాజారావు, గోళ్ళ సుధాకర్ నాయుడు, సాకే లక్ష్మీనరసింహ,nపొట్లూరి కేశవ నాయుడు, కృష్ణకుమార్, నెట్టెం బాలకృష్ణ, చేపల హరి, గోపాల్ గౌడ్, శ్రీవర్ధన్, మల్లెల దుర్గేష్, గోనుగుంట్ల అమర్నాథ్, పాటిల్ మధు కుమార్, ముకేష్, దాడి రమేష్, బండి కాశి, కదిరప్ప, రమాదేవి, సుజాతమ్మ, అయేషా నేహా, దాసరి చంద్రకళ, ప్రశాంతి, అలివేలమ్మ, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు బానిసైతే భవిష్యత్తు నాశనం




**- విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి.. ఈగల్ ఎస్ఐ హనుమంతు**

**అనంతపురం సెప్టెంబర్ 12, అనంత జనశక్తి న్యూస్**

మాదకద్రవ్యాలకు బానిసైతే విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతుందని, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని అలవర్చుకోవాలని ఈగల్ బృందం ఎస్ఐ బి. హనుమంతు సూచించారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ ప్రభుత్వ పాఠశాలలో ఈగల్ బృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ హనుమంతు మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలను వినియోగించడం, విక్రయించడం, రవాణా చేయడం తీవ్రమైన నేరమని తెలిపారు.మాదకద్రవ్యాలకు పాల్పడిన వారిపై మాదకద్రవ్యాల నియంత్రణ చట్టం కింద కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయని విద్యార్థులకు వివరించారు.గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల విక్రయాలు, సరఫరా, వినియోగానికి సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే వెంటనే ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు తమ చుట్టూ ఉన్నవారిని కూడా చెడు అలవాట్ల నుంచి దూరంగా ఉంచేందుకు అవగాహన కల్పించాలని ఎస్ఐ హనుమంతు కోరారు.ఈ కార్యక్రమంలో ఈగల్ బృందం సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చెట్టికులంగర భగవతి అమ్మవారి సేవలో పవన్ కళ్యాణ్

**- ఆలయంలో పుష్పాంజలి సేవ.. అమ్మవారికి ప్రత్యేక పూజలు**

**- దసరా శరన్నవరాత్రులకు వచ్చే వేలాది మంది భక్తుల అన్నదానానికి విరాళం**

**కేరళం సెప్టెంబర్ 12,అనంత జనశక్తి న్యూస్**

కేరళం రాష్ట్రంలోని అలప్పుజ జిల్లా పరిధిలో చారిత్రక ఆలయంగా పేరున్న చెట్టికులంగర శ్రీ భగవతి అమ్మవారిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ దర్శించుకున్నారు. శనివారం సాయంత్రం పుష్పాంజలి సేవలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరోగ్య ప్రదాయినిగా పేరున్న శ్రీ భగవతి అమ్మవారికి పుష్పాంజలి సమర్పణ సర్వదోష నివారణ నిమిత్తంచేస్తారని ప్రతీతి. దసరా శరన్నవరాత్రుల తొమ్మిది రోజులు శ్రీ భగవతి అమ్మవారి దర్శనానికి విచ్చేసే వేలాది మంది భక్తులకు అన్నదానానికి అయ్యే వ్యయం మొత్తాన్ని దేవస్థానం బోర్డుకు విరాళంగా పవన్ కళ్యాణ్ అందజేశారు. త్రిశక్తి స్వరూపిణి అయిన అమ్మవారి దర్శనానికి దసరా నవరాత్రుల రోజుల్లో వేలాదిగా భక్తులు తరలివస్తారు. అంతకు ముందు అమ్మవారి దర్శనానికి విచ్చేసిన పవన్ కళ్యాణ్ కి అధికారులు, అర్చకస్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి ముందుగా బాలశివుని దర్శించుకుని అర్చనలు చేశారు. అమ్మవారి దర్శనానంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న వినాయకుడు, నాగదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మేల్ శాంతి ఉప ముఖ్యమంత్రివర్యులతో పూజలు చేయించారు.చెట్టికులంగర భగవతి అమ్మవారి ఆలయానికి 1200 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. రాక్షస సంహారం కోసం శివుడి మూడో కన్ను నుంచి అమ్మవారు జన్మించినట్టు పురాణాలు చెబుతున్నాయి. శ్రీ భగవతీ అమ్మవారు త్రిశక్తి స్వరూపిణిగా భక్తుల పూజలు అందుకుంటున్నారు.



# ఆశా కార్యకర్త పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం



**అమడగూరు, సెప్టెంబర్ 12 (అనంత జనశక్తి న్యూస్):**

అమడగూరు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కందుకూరిపల్లి గ్రామం, జౌకల కొత్తపల్లి స్వర్ణ వార్డులో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్త పోస్టును భర్తీ చేయడానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ అపర్ణ తెలిపారు. ఆశా కార్యకర్త పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా మహిళ అయి ఉండటంతో పాటు సంబంధిత గ్రామం లేదా వార్డులో నివసిస్తూ ఉండాలి. అభ్యర్థుల వయస్సు 25 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలి. పదో తరగతి విద్యార్హత తప్పనిసరిగా కలిగి ఉండాలి. సేవాభావం, ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉన్న స్థానిక మహిళలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు.దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ సెప్టెంబర్ 15 నుంచి 19వ తేదీ వరకు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ ఆరోగ్య, పారిశుధ్య, పోషకాహార కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. కమిటీ ఎంపిక చేసిన ముగ్గురు అభ్యర్థుల పేర్లను జిల్లా స్థాయికి పంపించి, అక్కడ తుది ఎంపిక చేపడతారు.అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని మండల వైద్యాధికారి డాక్టర్ అపర్ణ సూచించారు.

# వినాయక మండపాలకు నిసార్ యాసిన్ చేయూత



**- కదిరిలో సుమారు 30 మండపాలకు చందాలు అందజేత**

**కదిరి, సెప్టెంబర్ 12 (అనంత జనశక్తి న్యూస్):**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కదిరి పట్టణంతో పాటు నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేస్తున్న వినాయక మండపాలకు సిమ్స్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్, ఎన్వైపీఎస్ఎన్ ఫౌండర్ బీ. నిసార్ యాసిన్ ఆర్థిక సహాయం అందించారు. మండపాల నిర్వాహకులకు స్వయంగా చందాలు అందజేసి వేడుకలకు తనవంతు సహకారం అందించారు.కదిరి ప్రాంతంలో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన సుమారు 30 వినాయక మండపాలకు నిసార్ యాసిన్ చందాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో, సోదరభావంతో నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు.ప్రజా సేవతో పాటు మత సామరస్యాన్ని పెంపొందించే కార్యక్రమాలకు తనవంతు సహకారం అందించడం ఆనందంగా ఉందని నిసార్ యాసిన్ పేర్కొన్నారు. వినాయక మండపాల నిర్వాహకులు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతూ, సేవా భావాన్ని అభినందించారు.

# విద్యా సంస్థల పరిసరాల్లో పొగాకు విక్రయిస్తే కఠిన చర్యలు




**- 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్'లో భాగంగా తనిఖీలు.. ఐదు దుకాణాలకు రూ.2,200 జరిమానా**

**అనంతపురం సెప్టెంబర్ 12 అనంత జనశక్తి న్యూస్**

విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని విద్యా సంస్థల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ పి. జగదీష్ తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు శనివారం జిల్లా వ్యాప్తంగా 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్'లో భాగంగా పోలీసులు తనిఖీలు నిర్వహించారు.అనంతపురం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని చైతన్య టెక్నో స్కూల్, నెహ్రూ స్కూల్, శ్రీకృష్ణదేవరాయ హైస్కూల్ సమీపంలో ఈగల్ బృందం, రెండో పట్టణ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. పాఠశాలలకు 500 మీటర్ల పరిధిలో ఉన్న ఏడు బడ్డీ, కిరాణా దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల నిషేధ చట్టం నిబంధనలను ఉల్లంఘిస్తూ పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న ఐదు దుకాణాల యజమానులకు మొత్తం రూ.2,200 జరిమానా విధించారు. విద్యా సంస్థల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయం చట్టరీత్యా నేరమని దుకాణదారులకు పోలీసులు స్పష్టం చేశారు. నిబంధనలను మరోసారి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ తనిఖీల్లో రెండో పట్టణ సీఐ పుల్లయ్య, ఎస్ఐ రామకృష్ణ, ఈగల్ విభాగం ఎస్ఐ బి. హనుమంతుతో పాటు సిబ్బంది అమర్‌నాథ్ రెడ్డి, నల్లపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తిరగబడ్డ జాతి కథ... ది ప్యారడైజ్



"ఈ 18 ఏళ్లలో మానసికంగా, శారీరకంగా నేను ఎక్కువగా కష్టపడింది 'ది ప్యారడైజ్' కోసమే. ప్రచార చిత్రాల్లో హింస కనిపిస్తుందేమో కానీ, మేం దాని వెనకున్న భావోద్వేగాల్ని ప్రేక్షకులు అనుభూతి చెందాలని చేసిన ప్రయత్నమే ఈ చిత్రం" అన్నారు నాని. ఆయన కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమే 'ది ప్యారడైజ్'. కయాదు లోహర్ కథానాయిక. మోహన్‌బాబు ముఖ్యభూమిక పోషించారు. ఎస్.ఎల్.వి.సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా చిత్రబృందం శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించింది. నాని మాట్లాడుతూ... "ఒక సినిమాకి ఇంత విరామం నా కెరీర్‌లో ఎప్పుడూ రాలేదు. కొన్ని అనివార్య కారణాలు, మా ప్రణాళికల్లో లోపాలు ఇందుకు కారణం కావొచ్చు. ఇదంతా మాకు ఓ అనుభవ పాఠంలా ఉపయోగపడుతుంది. అయితే మేం ఏం అనుకుని ఈ సినిమాని మొదలుపెట్టామో, దాన్ని పక్కాగా సిద్ధం చేయడంలో మాత్రం విజయవంతం అయ్యాం. ఇప్పటికే పలు బృందాలు నిద్రాహారాలు మానేసి పనిచేస్తున్నాయి. ఇప్పటివరకూ విడుదల చేసిన ప్రచార చిత్రాలకూ, పాటలకు ప్రేక్షకుల నుంచి గొప్ప స్పందన లభించింది. వాటిని సొంతం చేసుకున్న తీరు చూశాక మాపై బాధ్యత ఇంకా పెరిగిపోయింది. ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని పంచడం కోసం సినిమాని నాణ్యతతో సిద్ధం చేస్తున్నాం. విడుదల తేదీ దగ్గర పడుతున్న దృష్ట్యా, సినిమాని నాణ్యగా ముస్తాబు చేయడం కోసం ట్రైలర్‌ని విడుదల చేయడం లేదు. ఈ సినిమా ప్రయాణంలో జడలతో పోరాట ఘట్టాల్లో నటించడమే తాను ఎదుర్కొన్న అతి పెద్ద సవాల్. జడలు, చేతిపై పచ్చబొట్టు... ఇలా ప్రత్యేకమైన వేషధారణతో నా పాత్ర కనిపిస్తుంది. మొండి ఘటమైన దర్శకుడు శ్రీకాంత్ నిజాయతీతో కూడిన ఆలోచనల నుంచి పుట్టుకొచ్చిందే ఆ రూపం. ఈ సినిమా ప్రయాణంతో మోహన్‌బాబులోని మరో కొత్త మనిషిని చూశా. ఆయనతో కలిసి పనిచేస్తే ప్రేమలో పడతారు. నేను ఇప్పటివరకూ చేసిన సినిమాల్ని చూస్తే నేను ట్రెండ్‌ను అనుసరించలేదనే విషయం స్పష్టం అవుతుంది. 'హిట్ 3', 'ది ప్యారడైజ్', 'బ్లడీ రోమియో' సినిమాల కారణంగా నేను ఎంచుకునే కథలపై రకరకాల అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కానీ నా తర్వాత సినిమా ప్రకటన వస్తే అందరికీ నా ప్రయాణంపై స్పష్టత వస్తుంది. ఇప్పుడు చేస్తున్న సినిమాలకి భిన్నమైన ప్రయత్నాలతో త్వరలోనే తిరిగొస్తా" అన్నారు.

ఇది మా సినిమా అనడం కంటే కూడా, జనం సినిమా అనడమే సరైనదనీ.. ఇందులోని పాటల్ని, ప్రచార చిత్రాల్నీ అంతగా సొంతం చేసుకున్నారన్నారు దర్శకుడు శ్రీకాంత్ ఓదెల. "తిరుగుబాటుతో కూడిన భావోద్వేగ ప్రధానమైన సినిమా ఇది. ఒక సవారీ జాతి కథ. 'పుట్టుక మనది, చావు మనది, బతుకంతా దేశానిది' అనేది కాళోజీ మాట. అలా దేశం కోసం కొట్లాడిన వాళ్లని ఈ దేశంతోనే సంబంధం లేదన్నప్పుడు.. ఏం చేయాలో తెలియక తిరుగుబాటు చేస్తారు. వాళ్ల కథే ఇది. ఇందులో భావోద్వేగాలే ప్రధానం" అన్నారు శ్రీకాంత్ ఓదెల. నిర్మాత సుధాకర్ చెరుకూరి మాట్లాడుతూ "ఈ నిర్మాణ వ్యయం అంచనాల్ని మించినా నేను సంతోషంగానే ఉన్నా. ముందస్తు ప్రదర్శనలు ఉంటాయి. టిక్కెట్ ధరల విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు" అన్నారు.



## రామ్‌తో సంయుక్త

రామ్ పోతినేని కథానాయకుడిగా నటిస్తూ.. స్వీయ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందిస్తున్నారు. కృష్ణ పోతినేని నిర్మాత. ఇందులో సంయుక్త కథానాయికగా నటిస్తోంది. ఈ విషయాన్ని శుక్రవారం ఆమె పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఇదో విభిన్నమైన నియో-నోయిర్ సైకలాజికల్ థ్రిల్లర్. రామ్ ఇందులో వీర అనే శక్తిమంతమైన పాత్రలో.. సరికొత్త లుక్‌తో అలరించనున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటున్న ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ సినిమాకి సామ్ సీఎస్ సంగీతమందిస్తుండగా.. తిరునావుక్కరసు ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు. ఇక మరోవైపు సంయుక్త పుట్టినరోజు సందర్భంగా 'స్వయంభూ', 'స్లమ్ డాగ్', 'హైందవ', 'ది బ్లాక్ గోల్డ్' చిత్ర బృందాలు ఆమె కొత్త ప్రచార చిత్రాలు విడుదల చేసి శుభాకాంక్షలు తెలిపాయి.

## ఆ మార్పునకు సిద్ధంగా ఉన్నా!



"బిడ్డ పుట్టడం వల్ల జీవితం మారిపోతుందని అందరూ చెబుతారు. నేను ఆ మార్పుని స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాన"ని అంటోంది కథానాయిక సమంత. ఇటీవలే 'మా ఇంటి బంగారం' చిత్రంతో విజయాన్ని అందుకున్న ఆమె.. త్వరలో తల్లి కాబోతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే సమంత తన జీవితంలోని కొత్త దశ గురించి ఆసక్తికరమైన సంగతుల్ని తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. "తస్సాదియ్యా' పాట చిత్రీకరణలో గర్భవతినని తెలిసింది. ఆ సమయంలో కొంచెం అనారోగ్యంగా ఉన్నప్పటికీ చిత్రీకరణని కొనసాగించాం. ఇప్పుడా సందర్భాన్ని వెనక్కి తిరిగి చూసుకున్నా సహజంగానే కుదిరినట్లు అనిపిస్తుంది. బిడ్డ పుట్టడం 'మీ జీవితాన్ని పూర్తిగా మార్చేస్తుంది' అని అందరూ చెప్పే మాటను నేను నిజంగా నమ్ముతాను. దానిని ఆస్వాదించడానికి కూడా సిద్ధంగా ఉన్నాను. వృత్తి పరంగా కొంత కాలం విరామం తీసుకున్నప్పటికీ నా శరీరం చెప్పే దానిపైనే దృష్టి పెడతాను. బాధ్యతల నుంచి పూర్తిగా తప్పుకోవడం లేదు. మా నిర్మాణ సంస్థలో కొత్త ప్రతిభని ప్రోత్సహిస్తూ.. మరెన్నో చిత్రాలు రాబోతున్నాయి. వాటికి అవసరమైన సమయాన్ని కేటాయిస్తూనే అన్నింటినీ బ్యాలెన్స్ చేసుకుంటాను. భవిష్యత్తులో కూడా బలమైన మహిళా ప్రాధాన్య పాత్రలు కలిగిన చిత్రాలొస్తాయి" అని చెప్పింది.

## మోహిని నుంచి.. ఓ చిన్న రిక్వెస్ట్

వదిన... ఒక స్వచ్ఛమైన, కల్తీ లేని వందశాతం అసలైన హారర్ సినిమా రకం మంత్రగత్తె' అంటూ కుటుంబం మొత్తాన్ని కూర్చోబెట్టి.. తన వదిన ఎలాంటిదో చెప్పి నమ్మించాలని ప్రయత్నిస్తున్నాడో వ్యక్తి. మరి అతను చెప్పేది నిజమేనా? అందరూ అది నమ్మారో లేదో తెలియాలంటే 'నయీ నవేలి' సినిమా చూడాల్సిందే. యామీ గౌతమ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రమిది. బాలాజీ మోహన్ దర్శకత్వంలో ఆనంద్ ఎల్ రాయ్, హిమాన్షు శర్మ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. దసరా పండగ సందర్భంగా అక్టోబరు 16న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం 'లేడీస్ అండ్ జెంటిల్‌మెన్.. మోహిని నుంచి ఒక చిన్న రిక్వెస్ట్' అనే వ్యాఖ్యలతో తాజాగా ఈ చిత్ర అధికారిక టీజర్‌ను ఇన్‌స్టాలో విడుదల చేసింది. ఇందులో 'మంత్రగత్తెనా? అంతేనా? ఇద్దరు మంత్రగత్తెలు, ముగ్గురు రాక్షసులు, నాలుగు దెయ్యాలని అల్పాహారంగా తింటాను.. లేడీస్ అండ్ జెంటిల్‌మెన్ థింక్ బిగ్' అంటూ యామీ చెప్పిన డైలాగులు, సరికొత్త అవతారంలో భయపెట్టిన తీరు ఆసక్తిని రేకెత్తించాయి. ఈ చిత్రంలో ఒక సాధారణ కుటుంబ ప్రపంచాన్ని తలకిందులు చేసే కోడలు మోహిని పాత్రలో ప్రేక్షకుల్ని అలరించనుంది యామి.



## వైభవ్ లాంటి వాడిని ఒక్కడినైనా తయారు చేశారా?: పీఎస్ఎల్‌పై అక్రమ్ ఫైర్



పాకిస్థాన్ సూపర్ లీగ్‌పై ఆ దేశ మాజీ క్రికెటర్ వసీం అక్రమ్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశాడు. ఈ సందర్భంగా భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని ఉదహరిస్తూ పాక్ క్రికెట్‌కు చురుకలంటించాడు. అలాంటి కుర్రాడిని ఒక్కరినైనా పాక్ క్రికెట్‌కు అందించారా? అని ప్రశ్నించాడు. ఐపీఎల్‌తో వైభవ్ వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. అక్రమ్ గతంలో ఐపీఎల్, పీఎస్ఎల్‌తో కలిసి పనిచేశాడు. రెండు లీగ్‌లను పోలుస్తూ పాకిస్థాన్ దేశవాళీ క్రికెట్ వ్యవస్థపై విమర్శలు గుప్పించాడు.

"పీఎస్ఎల్ మొదలై ఇప్పటికి పదేళ్లు అయింది. కానీ, ఒక్క సంచలన బ్యాటర్‌నైనా ఆ లీగ్ అందించిందా? అవును మేం బౌలింగ్‌లో మంచి ఆటగాళ్లను వెలుగులోకి తెచ్చాం.. కానీ, బ్యాటింగ్‌లో గొప్ప టాలెంట్ ఉన్న ప్లేయర్లను పట్టుకోలేకపోయాం. భారత్‌లో వైభవ్ వంటి కుర్రాడు దొరికాడు. మరి మనం ఆ స్థాయికి ఎప్పటికి చేరుతాం? పాకిస్థాన్‌లో టెస్టు క్రికెట్ బతకాలంటే క్లబ్ క్రికెట్‌ను పునరుద్ధరించాలి. ప్రతిభ కలిగిన ప్లేయర్లు ఎక్కువగా అక్కడ్నుంచే వస్తున్నారు. కరాచీ, లాహోర్‌లో భారీగా ఖర్చు చేయాలి. అప్పుడే పాక్ జాతీయ జట్టుకు నాణ్యమైన ప్లేయర్లు వస్తారు" అని వసీం అక్రమ్ తెలిపాడు.

**అఫ్గాన్‌తో సిరీస్‌లో వైభవ్ ఆడతాడా? లేదా?**

అఫ్గానిస్థాన్‌తో ఆదివారం నుంచి మూడు టీ20ల సిరీస్ మొదలుకానుంది. అయితే, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఇందులో ఆడే అవకాశాలు తక్కువనేని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. వరల్డ్ కప్ త్రయం అభిషేక్ శర్మ, సంజు శాంసన్, ఇషాన్ కిషన్ ఆడే నేపథ్యంలో వైభవ్‌కు ఛాన్స్ కష్టమే. అయితే, ఇషాన్‌కు ప్రాక్టీస్ సమయంలో గాయమైన సంగతి తెలిసిందే. ఒకవేళ అతడు ఫిట్‌గా లేకపోతే వైభవ్‌కే అవకాశం రావచ్చు.

## అరుదైన హ్యాట్రిక్ హీరోతో సంచలన ప్లేయర్ 'ఫైనల్' పోరు

యూఎస్ ఓపెన్ 2026 ఎడిషన్‌చివరి అంకానికి చేరుకుంది. ఫైనల్‌లో తలపడే ప్రత్యర్థులు ఎవరో తేలిపోయింది. కార్లోస్ అల్కరాస్ వంటి స్టార్ ప్లేయర్‌నే ఓడించి సంచలన ప్రదర్శనతో సెమీస్‌కు దూసుకొచ్చిన బెన్ షెల్టన్ ఇక్కడా దూకుడు ప్రదర్శించాడు. అద్భుతంగా ఆడి 4-6, 6-3, 6-3, 7-5 తేడాతో టియాఫోపై గెలిచి ఫైనల్‌కు చేరాడు. మరోవైపు ఆరేళ్ల తర్వాత యూఎస్ ఓపెన్ ఫైనల్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్ అడుగు పెట్టాడు. సెమీస్‌లో జ్వెరెవ్ 6-3, 7-6 (9/7), 7-6 (8/6) తేడాతో కచనోవ్‌పై విజయం సాధించాడు. ఫైనల్ మ్యాచ్ ఆదివారం జరగనుంది.

**సంచలన ఆటతో..**

అమెరికాకు చెందిన 23 ఏళ్ల బెన్ షెల్టన్ ఆటే ఈ యూఎస్ ఓపెన్‌కు హైలైట్. హోరాహోరీగా సాగిన క్వార్టర్స్‌లో టాప్ ప్లేయర్ అల్కరాస్‌పై అద్భుత విజయం సాధించాడు. తాను ఇక్కడి వరకూ ఏదో లక్ మీద రాలేదని.. తన కష్టంతోనే వచ్చానని సెమీస్‌లో నిరూపించాడు. తొలి సెట్ టియాఫో గెలిచినా.. బెన్ ఏమాత్రం బెణకలేదు. రెండో సెట్ నుంచి అతడు ఆడిన తీరు అభిమానులను ఆకట్టుకుంది. వరుసగా మూడు సెట్లను గెలిచిన బెన్ తన ప్రత్యర్థికి అవకాశం లేకుండా చేశాడు. వీరిద్దరి మధ్య ఈ మ్యాచ్ దాదాపు మూడున్నర గంటలపాటు సాగింది. ఇప్పటి వరకు తన కెరీర్‌లో యూఎస్ ఓపెన్ సెమీస్ వరకూ బెన్ చేరాడు. తొలిసారి ఫైనల్‌లో అడుగు పెట్టాడు.




**హ్యాట్రిక్ సాధించిన జ్వెరెవ్**

జర్మనీకి చెందిన అలెగ్జాండర్ జ్వెరెవ్ ఆరేళ్ల తర్వాత యూఎస్ ఓపెన్ ఫైనల్‌కు చేరాడు. చివరిసారిగా 2020లో డొమినిక్ థీమ్ చేతిలో పరాజయం చవిచూశాడు. ఇప్పుడు మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు వచ్చాడు. ఈ క్రమంలో అరుదైన హ్యాట్రిక్‌ను సాధించాడు. ఒకే ఏడాదిలో మూడు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌కు చేరిన ప్లేయర్‌గా ఘనత నమోదు చేశాడు. ఫ్రెంచ్ ఓపెన్‌ను గెలిచిన అతడు.. వింబుల్డన్‌లో రన్నరప్‌గా నిలిచాడు. ఇప్పుడు యూఎస్ ఓపెన్ సెమీస్‌లో కచనోవ్‌ను ఓడించి టైటిల్ పోరుకు సిద్ధమయ్యాడు. కచనోవ్ గట్టిగా ప్రతిఘటించినా జ్వెరెవ్ మాత్రం పట్టువదల్లేదు. ప్రత్యర్థికి ఒక్క సెట్‌నూ ఇవ్వకుండా విజయం సాధించాడు.

## జూనియర్ ఆసియా కప్.. అమ్మాయిలూ ఫైనల్‌కు వచ్చేశారు..!



భారత జూనియర్ హాకీ జట్లు అదరగొట్టేస్తున్నాయి. జూనియర్ ఆసియా కప్‌లో ఇప్పటికే పురుషుల జట్టు ఫైనల్‌కు చేరుకోగా.. తాజాగా మహిళా జట్టూ అదే బాటపట్టింది. సెమీస్‌లో సౌత్ కొరియాపై భారత్ విజయం సాధించింది. గత మ్యాచులతోపోలిస్తే ఈసారి టీమ్‌ఇండియాకు కాస్త పోటీ ఎదురైంది. అయినా సరే 5-1 తేడాతో దక్షిణ కొరియాను ఓడించింది. చైనా - జపాన్ జట్ల మధ్య జరిగే మరో సెమీస్ విజేతతో భారత్ టైటిల్ పోరులో తలపడనుంది.

**సుప్రియ హ్యాట్రిక్..**

అంతకుముందు క్వార్టర్ ఫైనల్‌లో పాకిస్థాన్‌ను 19-0 తేడాతో చిత్తు చేసిన భారత్.. అదే ఊపుతో సెమీస్‌లోనూ సౌత్ కొరియాపై విజృంభించింది. సుప్రియ హ్యాట్రిక్, మధు సిదార్, సుఖ్వీర్ కౌర్ తలో గోల్‌తో భారత విజయంలో కీలక పాత్ర పోషించారు. దక్షిణ కొరియా తరఫున యురి జెంగో ఒక గోల్ చేసింది.

## మన ప్రత్యర్థి లంక

మహిళల ఆసియా కప్ టీ20 టోర్నీ ఫైనల్లో భారత్‌ను శ్రీలంక ఢీకొనబోతోంది. శుక్రవారం ఉత్కంఠభరితంగా సాగిన రెండో సెమీఫైనల్లో ఆ జట్టు.. 4 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను ఓడించింది. మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన పాక్ 5 వికెట్లకు 130 పరుగులు చేసింది. కెప్టెన్ ఫాతిమా సనా (47 నాటౌట్; 36 బంతుల్లో 4×4, 2×6) టాప్‌స్కోరర్. లంక బౌలర్లలో చమరి ఆటపట్టు (2/24), చముడి ప్రబోధ (2/25) రాణించారు. ఫాతిమా సనా (4/38) బంతితోనూ విజృంభించడంతో ఛేదనలో తడబడ్డ లంక ఒక దశలో 33/4తో నిలిచింది. ఈ దశలో హర్షిత సమరవిక్రమ (36; 31 బంతుల్లో 2×4), కవిశ దిల్హర (33; 33 బంతుల్లో 4×4) 67 పరుగుల భాగస్వామ్యంతో జట్టును గెలుపు బాటలో నడిపించారు. వీళ్లిద్దరూ స్వల్ప వ్యవధిలో ఔట్ కావడంతో ఉత్కంఠ నెలకొన్నప్పటికీ.. నీలాక్షిక (18 నాటౌట్), కౌశిని (10 నాటౌట్) జట్టును గెలిపించారు. భారత్, లంక మధ్య ఆదివారం ఫైనల్ జరుగుతుంది.



PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314